
గురువారం 3, ఏప్రిల్ 2025
https://www.telugudesam.org



# చైతన్యరథం



సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్లు

## సంతోషంగా ఉంది

సీఎం చంద్రబాబు నాయుడు

3





# నూరుశాతం ప్రక్షాళన

- టీటీడీ సేవలు, సౌకర్యాలలో మార్పు కనిపించాలి
- ఆలయ సేవలు బాగుంటే ప్రభుత్వానికీ మంచి పేరు
- అభివృద్ధి పనుల పేరుతో అనవసర ఖర్చు వద్దు
- టీటీడీలో మనం ధర్మకర్తలం, నిమిత్తమాత్రులం
- వచ్చే 50ఏళ్ల అవసరాలకు అనుగుణంగా టీటీడీని తీర్చిదిద్దాలి
- అవసరం లేకుంటే పాతవారిని కొనసాగించ వద్దు
- త్వరలో జేఈవో, సీవీఎస్‌వో, ఎస్వీబీసీ ఛైర్మన్ నియామకం
- అధికారులకు స్పష్టం చేసిన సీఎం చంద్రబాబు నాయుడు
- అలిపిరిలో భక్తుల కోసం బేస్‌క్యాంప్ నిర్మాణం...
- 60 అనుబంధ దేవాలయాల అభివృద్ధికి మాస్టర్ ప్లాన్
- ప్రతిసేవపై భక్తుల ఫీడ్‌బ్యాక్.. త్వరలో వాట్సాప్ సేవలు
- సచివాలయంలో తితిదేపై విస్తృతస్థాయి సమీక్ష

2

# పీ-4కు సీబీజీతో నాంది




- సీఎం చంద్రబాబు సంకల్పానికి ఇక్కడినుంచి శ్రీకారం
- పేదరికం లేని ప్రకాశం ఆవిష్కరణే మా లక్ష్యం
- ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాల కల్పనే సింగిల్ టార్గెట్
- కనిగిరి ప్రాంతంలోనే 50 సీబీజీ ప్లాంట్లు ఏర్పాటు చేస్తాం
- త్వరలోనే కనిగిరి ట్రిపుల్ ఐటీకి శంకుస్థాపన చేస్తా
- రిలయన్స్ సీబీజీ ప్లాంట్లతో 2.5 లక్షలమందికి ఉద్యోగాలు
- మంచి పనులకు మోకాలడ్డితే.. రెడ్‌బుక్‌లోకి ఎక్కిస్తా...
- కనిగిరిలో రిలయన్స్ సీబీజీ ప్లాంట్‌కు మంత్రి లోకేష్ భూమిపూజ

5

# ఆవిష్కరణలకు ఏపీ వేదిక

- వచ్చే ఐదేళ్లలో 20 వేల స్టార్టప్‌ల స్థాపనే లక్ష్యం
- రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌లో భాగస్వాములుకండి
- 'ఇంటికో ఎంట్రప్రెన్యూర్' సంకల్పాన్ని నిజం చేయండి
- పారిశ్రామికవేత్తలు, మేధావులకు సీఎం చంద్రబాబు పిలుపు

3



## గ్లోబల్ స్థాయికి కళ, వారసత్వ సంస్కృతి

- సీఎం చంద్రబాబు నాయుడు

9



## అడగకుండానే వరమిచ్చారు

- మంత్రి లోకేష్‌పై ప్రజా ప్రతినిధుల ప్రశంసలు
- ప్రకాశం జిల్లా చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగ్గ రోజు
- వైసీపీ పాలనలో పరిశ్రమలను పొరుగు రాష్ట్రాలకు తరిమివేశారు
- 10 నెలల్లోనే ఎన్నో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టాం
- దివాకరపల్లి సభలో ప్రజాప్రతినిధుల ప్రసంగ సారాంశం

7



# తొలి అడుగుపడింది!

- దివాకరపల్లి వద్ద రిలయన్స్ సీబీజీ ప్లాంట్‌కు శంకుస్థాపన
- సంస్థ ప్రతినిధులతో కలిసి శంకుస్థాపన చేసిన మంత్రి లోకేష్
- రాష్ట్రంలో రూ.65వేల కోట్ల పెట్టుబడి పెట్టనున్న రిలయన్స్
- 2.5 లక్షల మందికి ఉపాధి అవకాశాలు
- వెనుకబడిన ప్రకాశంలో పారిశ్రామిక వెలుగులకు శ్రీకారం

8



## హస్త కళలకు మరింత ప్రాచుర్యం

- రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి సవిత వెల్లడి
- ఏపీహెచ్‌డీసీ, ఎన్ఐడి మధ్య రెండు కీలక ఒప్పందాలు
- బనానా ఫైబర్, గుర్రపు డెక్కల కళారూపాల తయారీపై శిక్షణ
- అనంతపురం, మచిలీపట్నంలో శిక్షణా కేంద్రాల ఏర్పాటు

9

## సంచార జాతుల అభివృద్ధే సీఎం ధ్యేయం

రాష్ట్ర బీసీ సంక్షేమ మంత్రి సవిత

## మీ సహకారం కొనసాగాలి

- శరవేగంగా అమరావతి నిర్మాణానికి ప్రభుత్వం రెడీ
- సింగపూర్ ప్రతినిధుల బృందంతో భేటీలో సీఎస్

13

## విశాఖలో ప్రేమోన్మాది ఘాతుకం

- తల్లి మృతి.. ప్రమాదస్థితిలో కుమార్తె
- సీఎం చంద్రబాబు దిగ్భ్రాంతి
- బాధిత యువతికి మెరుగైన వైద్యానికి ఆదేశం

8

చైతన్యరథం



# నూరుశాతం ప్రక్షాళన

- టీటీడీ సేవలు, సౌకర్యాలలో మార్పు కనిపించాలి
- ఆలయ సేవలు బాగుంటే ప్రభుత్వానికీ మంచి పేరు
- అభివృద్ధి పనుల పేరుతో అనవసర ఖర్చు వద్దు
- టీటీడీలో మనం ధర్మకర్తలం, నిమిత్తమాత్రులం
- వచ్చే 50ఏళ్ల అవసరాలకు అనుగుణంగా టీటీడీని తీర్చిదిద్దాలి
- అవసరం లేకుంటే పాతవారిని కొనసాగించ వద్దు
- త్వరలో జేఈవో, సీవీఎస్వో, ఎస్వీబీసీ చైర్మన్ నియామకం
- అధికారులకు స్పష్టం చేసిన సీఎం చంద్రబాబు నాయుడు
- అలిపిరిలో భక్తుల కోసం బేస్‌క్యాంప్ నిర్మాణం...
- 60 అనుబంధ దేవాలయాల అభివృద్ధికి మాస్టర్ ప్లాన్
- ప్రతిసేవపై భక్తుల ఫీడ్‌బ్యాక్... త్వరలో వాట్సాప్ సేవలు
- సచివాలయంలో తితిదేపై విస్తృతస్థాయి సమీక్ష



అమరావతి (చైతన్య రథం): తిరుమల తిరుపతి దేవస్థానం భక్తులకు అందించే సేవలు, సౌకర్యాల్లో నూరుశాతం మార్పు కనిపించాలని, భక్తుల మనోభావాలకు, ఆలయ పవిత్రతకు పెద్దపీట వేసేలా ప్రతి కార్యక్రమం, నిర్ణయం ఉండాలని సీఎం చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. తిరుమల తిరుపతి దేవస్థానంపై సీఎం చంద్రబాబు సచివాలయంలో సమగ్రంగా సమీక్ష చేశారు. భక్తులకు అందించే సౌకర్యాలు మెరుగుపరిచేందుకు గత తొమ్మిది నెలల కాలంలో తీసుకున్న చర్యలపై టీటీడీ అధికారులు ప్రజెంటేషన్ ఇచ్చారు. పెరుగుతున్న భక్తుల రద్దీ నేపథ్యంలో భవిష్యత్‌లో చేపట్టే చర్యలపై సీఎం సమీక్షించారు. దర్శనాలు, వసతితో పాటు వివిధ సేవలపై భక్తులనుంచి సేకరించిన అభిప్రాయాలపైనా సమావేశంలో చర్చించారు. బ్రహ్మోత్సవాలు, రథసప్తమి, వైకుంఠ ఏకాదశి వంటి ప్రత్యేక సమయాలతో పాటు చేపట్టిన చర్యలు, వాటి ఫలితాలపై అధికారులు నివేదించారు. 9 నెలల కాలంలో శ్రీవారి లడ్డూ ప్రసాదం, అన్న ప్రసాదంలో తీసుకువచ్చిన మార్పులను అధికారులు వివరించారు. గ్యాలరీల్లో సౌకర్యాల పెంపు, మరింత భక్తులకు అవకాశం కల్పించేలా మాఢవీధులలో ఏర్పాట్లు, అలిపిరిలో భక్తుల కోసం బేస్ క్యాంప్ నిర్మాణం, శ్రీ పద్మావతీ అమ్మవారి దేవాలయం అభివృద్ధి ప్రణాళిక, అమరావతిలోని శ్రీవారి దేవాలయం అభివృద్ధి పనులువంటి అంశాలపై సమీక్షలో సుదీర్ఘంగా చర్చించారు. తిరుమల ప్రతిష్ట పెంచడం, తిరుమల క్షేత్రాన్ని భక్తులకు మరింత దగ్గర చేయడం, సులభమైన, సౌకర్యవంతమైన సేవలకు సంబంధించి సీఎం పలు సూచనలు చేశారు.



## అవసరమైన పనులే చేయండి

ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ "తిరుమల దేవాలయంలో సేవలు బాగుంటే ప్రభుత్వానికీ మంచి పేరు వస్తుంది. గత ప్రభుత్వానికి ఈ ప్రభుత్వానికీ ఇప్పటికే మార్పు కనిపించింది. అయితే మార్పు నూరుశాతం ఉండాలి. అప్పుడే భక్తుల, ప్రజల అంచనాలను మనం అందుకోగలం. పెరుగుతున్న రద్దీ నేపథ్యంలో వచ్చే 50 ఏళ్ల అవసరాలకు అనుగుణంగా టీటీడీని తీర్చిదిద్దాలి. ఏ పనులు అవసరమో ఆ పనులు మాత్రమే చేయాలి. శ్రీవారి డబ్బులు ఇష్టారీతిన ఖర్చు పెట్టవద్దు. మనం దేవాలయానికి ధర్మకర్తలం, నిమిత్తమాత్రులం మాత్రమే. శ్రీవారికి భక్తులు ఇచ్చే కానుకల సొమ్మును ఇష్టారీతిన ఖర్చుపెట్టే అధికారం ఎవరికీ లేదు. ఏడుకొండల వాడి సొమ్ము ఒక్క రూపాయి దుర్వినియోగం కాకూడదు. వందల కోట్ల నిధులను అనేక కార్యక్రమలకు టీటీడీ ఖర్చు చేస్తోంది. దీనిపై ఇంటర్నల్ ఆడిటింగ్‌తో పాటు.. కాగ్ ద్వారా ఆడిట్ జరిపితే మంచిది. భక్తులు ఇచ్చే వితరణ, విరాళాలు ప్రతి రూపాయి సక్రమంగా ఖర్చు అవ్వాల్సిన అవసరం ఉంది. జవాబు దారీతనం ఉండాలి" అని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. "టీటీడీలో సమూల ప్రక్షాళన జరపుతానని ఎన్నికల ముందు చెప్పాను. చెప్పిన విధంగానే అధికారంలోకి వచ్చిన తరువాత అనేక మార్పులు జరిగాయి. అయితే ఈ మార్పులు నూరుశాతం ఉండాలి. ఎక్కడా పాతవాసనలు, పాత వ్యక్తులు కొనసాగకూడదు. అనుభవజ్ఞుల పేరుతో పాతవారిని ఇంకా కొనసాగించ వద్దు. ప్రక్షాళన అనేది నూరుశాతం జరగాల్సిందే. దీనిలో మినహాయింపులు లేవు" అని సీఎం అధికారులకు సూచించారు.

## అలిపిరిలో బేస్ క్యాంప్

సమీక్ష సందర్భంగా టీటీడీ బోర్డు తీసుకున్న పలు నిర్ణయాలను, పలు ప్రతిపాదనలను అధికారులు సీఎం దృష్టికి తీసుకువచ్చారు. అలిపిరిలో భక్తుల కోసం బేస్ క్యాంప్ నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. 25 వేల మందికి సౌకర్యవంతంగా ఉండేలా ఈ బేస్ క్యాంప్ నిర్మాణం చేపడుతున్నట్లు అధికారులు తెలిపారు. అదే విధంగా 60 అనుబంధ దేవాలయాల అభివృద్ధికి మాస్టర్ ప్లాన్ రూపొందిస్తున్న విషయాన్ని, రాష్ట్రం వెలుపల ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న శ్రీవారి ఆలయాల పురోగతిని వివరించారు. శ్రీవారి సేవకుల విషయంలో కొత్తవారు 90 శాతం మంది ఉంటున్నారని అధికారులు చెప్పగా.. సగం మంది పాతవారిని నియమించుకోవడం ద్వారా నాణ్యమైన సేవలు అందించవచ్చని తెలిపారు. తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయానికి రోజుకు 25 వేల మంది వరకూ భక్తులు వస్తారని అధికారులు తెలపగా.. దీనికి మరింత అభివృద్ధి చేయాలని సీఎం సూచించారు. బర్డ్ ఆసుపత్రికి డైరెక్టర్ నియామకం, జేఈవో, సివిఎస్వో, ఎస్వీబీసీ చైర్మన్ నియామకాలను త్వరలో చేపడతామని సీఎం చెప్పారు. టీటీడీ నుంచి 15 రకాల సేవలు వాట్సాప్‌లో అందిస్తామని అధికారులు చెప్పగా... వెంటనే వాట్సాప్ సేవలు ప్రారంభం కావాలని సీఎం సూచించారు. ప్రతి సేవకు ఆధార్, సెల్ ఫోన్ నెంబర్‌ను లింక్ చేయడం ద్వారా ఎక్కడా అక్రమాలు జరగకుండా ఉండటానికి అవకాశం ఉంటుందని సీఎం చెప్పారు. మరోవైపు పారిశుధ్య నిర్వహణపైనా దృష్టి పెట్టాలని సీఎం అన్నారు. తిరుమలలో పేరుకుపోయిన చెత్తను తొలగించేందుకు ఉన్న అన్ని అవకాశాలను వినియోగిచుంకోవాలన్నారు. టీటీడీ పరిధి మొత్తం 2,675 హెక్టర్లలో విస్తరించి ఉండగా.... ఇందులో ప్రస్తుతం 68.14 శాతం పచ్చదనం ఉంది. దీనిని 80 శాతానికి తీసుకువెళ్లాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

## టీటీడీ సేవలపై సంతృప్తి

రథసప్తమి, వైకుంఠ ఏకాదశి వంటి ప్రత్యేక సందర్భాల్లో తిరుమలలో టీటీడీ అందించిన సేవలపై ఫీడ్‌బ్యాక్ సర్వేలో భక్తుల నుంచి అత్యధిక స్థాయిలో సంతృప్తి వ్యక్తమైందని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. రథసప్తమి రోజున భక్తుల రద్దీ క్రమ బద్ధీకరణ, అన్నప్రసాదం, పరిశుభ్రత, సాంస్కృతిక కార్యక్రమాలు తదితర అన్ని అంశాలపై 76 శాతం మంది భక్తులు ఏర్పాట్లు అద్భుతంగా ఉన్నాయని చెప్పగా, మరో 22 శాతం మంది బావున్నట్టు వెల్లడించారు. కేవలం 1శాతం పర్వాలేదని, 1 శాతం మంది మాత్రమే బాగోలేదని తెలిపారు. వైకుంఠ ఏకాదశి రోజు 74శాతం మంది భక్తులు ఏర్పాట్లు అద్భుతంగా ఉన్నాయని చెప్పగా, మరో 22శాతం మంది బావున్నట్టు వెల్లడించారు. కేవలం 3శాతం పర్వాలేదని, 1 శాతం మంది మాత్రమే బాగోలేదని తెలిపారు.

మార్చి 9 నుంచి 14 వరకు సాధారణ రోజుల్లో తిరుమల వచ్చిన భక్తుల నుంచి ఐవీఆర్‌ఎస్ విధానంలో చేసిన సర్వేలోనూ అత్యధిక స్థాయి సంతృప్తి వ్యక్తమైంది. క్యూలైన్ నిర్వహణ, సౌకర్యాలపై 65 శాతం మంది బాగుంది అని చెప్పగా, 28శాతం పర్వాలేదని, 7 శాతం మంది బాగోలేదని సమాధానం ఇచ్చారు. అలాగే వసతి, శుభ్రత బాగుందని 74 శాతం, పర్వాలేదని 19 శాతం, బాగోలేదని 7 శాతం మంది చెప్పారు. లడ్డు రుచి-నాణ్యత బావుందని 77 శాతం, పర్వాలేదని 17 శాతం, బాగోలేదని 6 శాతం మంది చెప్పారు. ఇంకా అన్నదానం, కల్యాణకట్ట, టీటీడీ ఉద్యోగుల ప్రవర్తన, లగేజ్ కలెక్షన్-డెలివరీ వంటి అంశాలపైనా ఇదే స్థాయిలో అభిప్రాయాలు వెల్లడించారు. మొత్తంగా ఐవీఆర్‌ఎస్ సర్వేలో 61 శాతం మంది భక్తులు టీటీడీ సేవలు బావున్నాయని మెచ్చుకున్నారు. 27 శాతం పర్వాలేదన్నారు. 12 శాతం మంది భక్తులు బాగోలేదన్నారు.

## టీటీడీ అనుబంధ ఆలయాల అభివృద్ధి

అమరావతి రాజధానిలోని వెంకటపాలెంలో నిర్మించిన శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానాన్ని మరింత అభివృద్ధి చేయనున్నారు. చుట్టూ ప్రాకారం నిర్మాణంతోపాటు ఒక రాజగోపురం, మూడు గోపురాలు నిర్మించనున్నారు. దీనికి సంబంధించి త్వరలోనే టెండర్లు పిలుస్తారు. అలాగే ఒంటిమిట్ట శ్రీ కోదండ రామస్వామి ఆలయాన్ని విస్తరణ పనులతో పాటు సుందరంగా తీర్చిదిద్దనున్నారు. కరీంనగర్, కొడంగల్, నవీ ముంబై, బాంద్రా, ఉలుందుర్పేట, కొయంబత్తూరులో చేపట్టిన శ్రీవారి ఆలయాల నిర్మాణం-అభివృద్ధి కార్యక్రమాలపైనా ముఖ్యమంత్రి సమీక్షించారు. సమీక్షలో దేవాదాయ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, టీటీడీ చైర్మన్ బిఆర్ నాయుడు, ఈవో శ్యామలరావు, అడిషనల్ ఈవో వెంకయ్య చౌదరి, చీఫ్ విజిలెన్స్ అధికారి, తిరుపతి జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు, టీటీడీ అధికారులు పాల్గొన్నారు.

# ఆవిష్కరణలకు ఏపీ వేదిక



- వచ్చే ఐదేళ్లలో 20 వేల స్టార్టప్‌ల స్థాపనే లక్ష్యం
- రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌లో భాగస్వాములుకండి
- 'ఇంటికో ఎంట్రప్రెన్యూర్' సంకల్పాన్ని నిజం చేయండి
- పారిశ్రామికవేత్తలు, మేధావులకు సీఎం చంద్రబాబు పిలుపు

అమరావతి (చైతన్య రథం): రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టిన 'రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్'ని తీర్చిదిద్దేందుకు... 'వన్ ఫ్యామిలీ-వన్ ఎంట్రప్రెన్యూర్' సంకల్పాన్ని నిజం చేసేందుకు పారిశ్రామికవేత్తలు, కార్పొరేట్ సంస్థలు, ప్రొఫెసర్లు, మేధావులు ముందుకురావాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చారు.
ఆంధ్రప్రదేశ్‌నుంచి కొత్తగా పారిశ్రామికవేత్తలు రావాలని, నూతన ఆవిష్కరణలకు ఏపీ హబ్ కావాలని, అదేస్థాయిలో పెట్టుబడులు కూడా ఆశిస్తున్నామన్నారు. అందిరిలో స్ఫూర్తి నింపేందుకే ఇన్నోవేషన్ హబ్‌కు రతన్ టాటా వంటి గొప్ప వ్యక్తి పేరు పెట్టామని చెప్పారు. బుధవారం సచివాలయంలో పలువురు ప్రముఖ పారిశ్రామికవేత్తలు, విద్యావంతులతో 'రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్' గురించి ముఖ్యమంత్రి సమావేశమయ్యారు. ఆర్టీఐహెచ్ వైస్ చైర్మన్‌గా వ్యవహరిస్తున్న టాటా గ్రూపు, టాటా సన్స్ చైర్మన్ ఎన్ చంద్రశేఖరన్ సహా మరికొందరు ప్రముఖులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశంలో పాల్గొన్నారు.

## నాటి సంస్కరణలతో సత్ఫలితాలు

భారతీయులు దేశవిదేశాల్లో ఎంట్రప్రెన్యూర్లుగా ఎదిగారని, అలాగే తలసరి ఆదాయంలోనూ విదేశీయులు కన్నా ఎక్కువ ఆర్జిస్తున్నారని, వారిలో 30 శాతం తెలుగు ప్రజలు ఉన్నందుకు తనకు గర్వంగా ఉందని ముఖ్యమంత్రి అన్నారు. నిజానికి ఇప్పుడు తెలుగు ప్రజలు ఈ స్థాయికి చేరుకోవడానికి తాను మొదటిసారి ముఖ్యమంత్రి అయినప్పుడు తీసుకువచ్చిన సంస్కరణల ఫలితమని చెప్పారు. సీఐఐ సమావేశాలు నిర్వహించడం, ఇంజినీరింగ్ కాలేజీలు నెలకొల్పడం, మైక్రోసాఫ్ట్ సహా ప్రముఖ కంపెనీలు ఏర్పాటయ్యేలా చూడటంతో హైదరాబాద్ దశ-దిశ మారిపోయిందన్నారు. నాడు హైదరాబాద్‌ను ఐటీ హబ్ చేసినట్టుగానే, ఇప్పుడు అమరావతిని క్వాంటమ్ వ్యాలీ చేయాలనేది తన సంకల్పంగా చెప్పారు. అలాగే 'వన్ ఫ్యామిలీ - వన్ ఐటీ ప్రొఫెషనల్' అని గతంలో తాను చేసిన ప్రయత్నాలు మంచి ఫలితాలు ఇచ్చాయని గుర్తు చేశారు. భారతీయులు ఎక్కడ ఉన్నా ఆయా ప్రాంతాలను, అక్కడ పరిస్థితులను ఆకళింపు చేసుకుని ప్రతిభతో రాణిస్తున్నారని అన్నారు. దూరం అనేది ప్రపంచంలో ఒక సమస్య కాదన్నారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ నుంచి స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ వైపు అడుగులు వేశామని చంద్రబాబు ఉద్ఘాటించారు.

## పీ-4లో భాగస్వాములుకండి

గతంలో తమ ప్రభుత్వం పీ-3 కార్యక్రమాన్ని చేపట్టిందని దాంతో కొన్ని కుటుంబాలు ఆర్థికంగా నిలదొక్కుకున్నాయని... ఈసారి జీరో పావర్టీ-పీ4 కార్యక్రమాన్ని ప్రవేశపెట్టినట్టు ముఖ్యమంత్రి చెప్పారు. సమాజంలో ఉన్నతవర్గాలు,అట్టడుగున ఉన్న పేదలకు అండగా నిలవడమేనన్నారు.అంబేద్కర్, అబ్దుల్ కలాం వంటివారు ఇతరులసహాయంతోనే పైకి వచ్చారని ముఖ్యమంత్రి వివరించారు.మీరందరూ కూడా సమాజంలో సమానతల కోసం, పేదరిక నిర్మూలనకు కదిలిరావాలని,అందరూ పీ4 కార్యక్రమంలో భాగస్వాములు కావాలని ముఖ్యమంత్రి చంద్రబాబు కోరారు.

## 'ఇంటికో ఎంట్రప్రెన్యూర్' మంచి ఆలోచన


'వన్ ఫ్యామిలి-వన్ ఎంట్రప్రెన్యూర్', జీరో పావర్టీ-పీ4 కార్యక్రమాలు ఎంతో ఉన్నతమైనవని... ముఖ్యమంత్రి ఆశయంపై సమావేశానికి హాజరైన పలువురు హర్షం వ్యక్తం చేశారు. మరోవైపు వచ్చే ఏడాది కల్లా అమరావతిలో బిట్స్ పిలానీ క్యాంపస్ ఏర్పాటు చేసి ఫస్ట్ బ్యాచ్ అడ్మిషన్లు చేపడతామని బిట్స్ పిలానీ వైస్ చాన్సలర్ వి రామగోపాలరావు, అలాగే అమరావతి క్వాంటమ్ వ్యాలీలో కూడా తాము భాగస్వామి కావాలనుకుంటున్నామని చెప్పారు. విశాఖపట్నంలో జీఎంఆర్ ఐటీ ఇన్నోవేషన్ సెంటర్ ఏర్పాటు చేస్తామని జీఎంఆర్ సంస్థల అధినేత జీఎంఆర్ అన్నారు.

## వచ్చే ఐదేళ్లలో 20,000 స్టార్టప్‌లు

వచ్చే ఐదేళ్లలో 20,000 స్టార్టప్‌లు ఏర్పాటయ్యేలా చూడాలనేది ప్రభుత్వ లక్ష్యం. దీంతో లక్షమందికి ఉద్యోగాలు లభిస్తాయి. 10 సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లు వస్తాయి. రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌గా అమరావతి ఉంటుంది. దీనికి గ్రూపు లీడర్‌గా టాటా గ్రూపు ఉంటుంది. ఎల్ అండ్ టీ, ఎఎంఎన్ఎస్ పార్టనర్లుగా వ్యవహరిస్తాయి. అమరావతి హబ్‌కు రాష్ట్రంలో 5 స్పోక్స్ అనుబంధంగా ఉంటాయి. స్పోక్స్ లీడ్ పార్టనర్లుగా అనంతపురానికి- జెఎస్‌డబ్లు, తిరుపతికి-అదానీ గ్రూపు, విజయవాడకు-మేఘా గ్రూపు, రాజమహేంద్రవరానికి-గ్రీన్‌కో, విశాఖపట్నానికి-జీఎంఆర్ గ్రూపు వ్యవహరిస్తాయి.
ఆర్టీఐహెచ్‌లో ఇంక్యుబేటర్, ఎంఎస్ఎంఈ ఫెసిలిటేషన్ సెంటర్, బ్యాంకింగ్ లింకేజ్, ట్రైనింగ్, వీసీ ఫండింగ్ హ్యాండ్ హెూల్డింగ్, సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్, హైపెర్ఫార్మెర్స్ కంప్యూటింగ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్, మార్కెట్ లింకేజ్, రా మెటీరియల్ సోర్సింగ్ సపోర్ట్, ప్రోటోటైపింగ్ సెంటర్, ఔట్ డేటింగ్ టెస్టింగ్ ట్రాక్స్, హైస్పీడ్ ఇంటర్నెట్ ఉంటాయి.

# సంతోషంగా ఉంది

## ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు



అమరావతి (చైతన్య రథం): పెట్టుబడి దారులకు అనుకూలమైన విధానాలు ఆంధ్రప్రదేశ్‌ను పెట్టు బడులు, ఆవిష్కరణలకు ప్రధాన గమ్యస్థానంగా మారుస్తూనే ఉన్నాయని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ప్రకాశం జిల్లా పీసీ పల్లి మండలం దివాకరపల్లి సమీపంలో రిలయన్స్ సంస్థ ఏర్పాటు చేయనున్న కంప్రెస్డ్ బయో గ్యాస్ ప్లాంట్ (సీబీజీ)కు శంకుస్థాపన చేయడం సంతోషంగా ఉందన్నారు. ఇది బయో ఇంధన రంగానికి ఒక ముఖ్యమైన ముందడుగన్నారు. రాబోయే ఐదేళ్లలో రిలయన్స్ 500 సీబీజీ ప్లాంట్లను స్థాపించి, బంజరు భూమిని ఆకుపచ్చ ఎరువులతో ఉత్పాదక వ్యవసాయ భూమిగా మారుస్తుందన్నారు. ఈ ప్రాజెక్టు 2.5లక్షల మందికి ఉపాధిఅవకాశాలను సృష్టిస్తుందన్నారు. ఇది ఆంధ్రప్రదేశ్ యువతకు పెద్ద ప్రోత్సాహాన్ని అందిస్తుందని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు.



గన్నవరం విమానాశ్రయంలో రిలయన్స్ ఇండస్ట్రీస్ డైరెక్టర్ పిఎంఎస్ ప్రసాద్‌కు మంత్రి నారా లోకేష్, సిఎస్ విజయానంద్ స్వాగతం పలుకుతున్న దృశ్యం. అనంతరం రిలయన్స్ బృందంతో కలిసి హెలికాప్టర్‌లో మంత్రి నారా లోకేష్ కనిగిరి బయలుదేరారు.

# పీ-4కు సీబీజీతో నాంది





- సీఎం చంద్రబాబు సంకల్పానికి ఇక్కడినుంచి శ్రీకారం
- పేదరికం లేని ప్రకాశం ఆవిష్కరణే మా లక్ష్యం
- ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాల కల్పనే సింగిల్ టార్గెట్
- కనిగిరి ప్రాంతంలోనే 50 సీబీజీ ప్లాంట్లు ఏర్పాటు చేస్తాం
- త్వరలోనే కనిగిరి ట్రిపుల్ ఐటీకి శంకుస్థాపన చేస్తా
- రిలయన్స్ సీబీజీ ప్లాంట్లతో 2.5 లక్షలమందికి ఉద్యోగాలు
- మంచి పనులకు మోకాలడ్డితే.. రెడ్‌బుక్‌లోకి ఎక్కిస్తా...
- కనిగిరిలో రిలయన్స్ సీబీజీ ప్లాంట్‌కు మంత్రి లోకేష్ భూమిపూజ

కనిగిరి (చైతన్యరథం): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చెప్పిన పీ-4 విధానానికి రిలయన్స్ సీబీజీ ప్లాంట్స్ నాంది కాబోతున్నాయి. పేదరిక నిర్మూలనకు ఇదొక ముఖ్యమైన అడుగుకానుందని రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ మంత్రి నారా లోకేష్ అన్నారు. ప్రకాశం జిల్లా కనిగిరి నియోజకవర్గం పీసీ పల్లి మండలం దివాకరపురంలో రిలయన్స్ సంస్థ ఏర్పాటు చేయనున్న కంప్రెస్డ్ బయోగ్యాస్ ప్లాంటుకు మంత్రి లోకేష్ భూమి పూజ చేశారు. కార్యక్రమంలో లోకేష్ మాట్లాడుతూ... ఎటువంటి నీటివసతిలేని మెట్ట ప్రాంతంలోని రైతులకు ప్లాంట్స్ ద్వారా పెద్దఎత్తున మేలు జరుగుతుందన్నారు. 'నైపర్ గడ్డితో గ్యాస్ తయారు కాబోతోంది. ప్రభుత్వ భూములకు 15వేలు, రైతుల భూములకు 31వేలు కౌలు కూడా ఇవ్వబోతున్నారు. రైతులే గడ్డి పెంచి ఇస్తే టన్నుకు నిర్ణీత ధరచెల్లిస్తారు. రిలయన్స్‌సంస్థ ఏర్పాటు చేసే సీబీజీ ప్లాంట్లన్నీ పూర్తిస్థాయిలో పనిచేస్తే ఏటా 110లక్షల మెట్రిక్ టన్నుల ఆర్గానిక్ ఎరువు తయార వుతుంది. ఈ ప్లాంట్ల ద్వారా గ్రామీణ యువతకు పెద్ద ఎత్తున ఉద్యోగాలు రాబోతున్నాయి. నేను ప్రకాశం జిల్లా వచ్చిన ప్రతిసారి మీరు చూపించే ప్రేమ, ఆప్యా యత మర్చిపోలేను. ప్రకాశం జిల్లాలో పేదరికం లేకుండా చెయ్యడమే మా లక్ష్యం. రానున్న ఐదేళ్లలో ఆ లక్ష్యాన్ని సాధించి తీరుతామని లోకేష్ ప్రకటించారు.

## సీబీజీ హబ్‌గా మారనున్న కనిగిరి

ఆంధ్రప్రదేశ్‌లో కంప్రెస్డ్ బయో గ్యాస్ ప్లాంట్స్ పెట్టడానికి రిలయన్స్ ముందుకొచ్చింది. ఈ రంగంలో రూ.65వేల కోట్ల పెట్టుబడితూ 500ప్లాంట్లు పెట్టడానికి ముందుకొచ్చింది. దీని ద్వారా 2.5లక్షల మందికి ఉద్యోగావకాశాలు రాబోతున్నాయి. ప్రకాశం, అనంతపురం, చిత్తూరు, కడపలో 5లక్షల ఎకరాల బీడును వినియోగంలోకి తేనున్నాం. యువగళంలో ప్రకాశం జిల్లాకు ఇచ్చిన హామీ నిలబెట్టుకున్నాను. రిలయన్స్ మొదటి సీబీజీ ప్లాంట్‌ను కనిగిరిలో ప్రారంభించాను. ప్రకాశం జిల్లాలో ఐదు వేల ఎకరాలు బీడు భూములిచ్చాం. కనిగిరిలో 497ఎకరాలు కేటాయించాం. కనిగిరి ప్లాంట్‌రిలయన్స్ సీబీజీ ప్లాంట్ హబ్‌గా మారబోతుంది. ఇక్కడే ఐదు ప్లాంట్స్ రాబోతున్నాయని మంత్రి లోకేష్ వెల్లడించారు.

## ప్రకాశం జిల్లా నా గుండెల్లో ఉంటుంది

ఉమ్మడి ప్రకాశం జిల్లా అంటే నాకు మొదట గుర్తొచ్చేది పౌరుషం, ప్రేమ. ఇక్కడి ప్రజలకు పౌరుషం ఎక్కువే, ప్రేమ ఎక్కువే. ప్రకాశం జిల్లా ప్రజలకు టీడీపీ అన్నా, చంద్రబాబు అన్నా ఎనలేని ప్రేమ. 2019లో ఎదురుగాలి ఉన్నా టీడీపీని నాలుగు సీట్లలో గెలిపించా రు. 2024లో 10సీట్లలో టీడీపీ అభ్యర్థులకు ఘనవిజయాన్ని చేకూర్చారు. యువగళం పాదయాత్ర చేసినప్పుడు ఇక్కడ ప్రజల కష్టాలు చూసాను. ప్రకాశం జిల్లాలో యువగళం ఒక ప్రభంజనంగా మారింది. నేను ఆ రోజే చెప్పా, మీరు చూపించిన ప్రేమకు రెండింతలు తిరిగి ఇస్తానని. ప్రకాశం జిల్లా నా గుండెల్లో ఉంటుంది అని. 2014లో రాష్ట్ర విభజన జరిగింది. కట్టు బట్టలతో మనం ప్రయాణం ప్రారంభించాం. అందరి ఆమోదంతో అమరావతిని రాజధానిగా ప్రకటించాం. ఒకే రాజధాని, అభివృద్ధి వికేంద్రీకరణ ఎజెండాగా పనిచేసాం. అనంతపురాన్ని ఆటోమొబైల్ హబ్ చేసాం. చిత్తూరు, కడపలో ఎలక్ట్రానిక్స్ తయారీ కంపెనీలు తీసుకొచ్చాం. కర్నూలుకు రెన్యూవబుల్ ఎనర్జీ కంపెనీలు తీసుకొచ్చాం. ప్రకాశం జిల్లాకు అతిపెద్ద పేపర్ మిల్ తీసుకొస్తే ఆ కంపెనీని గత ప్రభుత్వం రానివ్వలేదు. ఉభయగోదావరి జిల్లాలను ఆక్వా రంగంలో నంబర్ 1గా నిలబెట్టాం. ఉత్తరాంధ్రను ఐటి, ఫార్మా హబ్‌గా తయారు చేశామని లోకేష్ వివరించారు.

## గత ఐదేళ్ల పాలనంతా విధ్వంసమే!

2019 నుండి 2024 వరకూ ఏంజరిగిందో మీరంతా చూసారు. రాష్ట్రంలో విధ్వంస పాలన సాగింది. కొత్త కంపెనీలు తీసుకురాకపోగా ఉన్న కంపెనీలను తరిమేసారు. లులూ, అమర్ రాజా, హెచ్‌ఎస్బిసి, జాకీలాంటి అనేక కంపెనీలను బెదిరించి బయటకు పంపేసారు. నేను ఆ రోజే ఛాలెంజ్ చేసా. మీరు తెచ్చిన ఒక్క కంపెనీ పేరు చెప్పండి అని. ఇప్పటి వరకూ ఆ సైడ్ నుండి సౌండ్ లేదు. దేశంలో ఏ పార్టీ చేయని సాహసం మేం చేసాం. ఎన్నికల ముందు 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పిన దమ్మున్న పార్టీ టీడీపీ. ఆ హామీ ఇచ్చే నేను అనేకమందితో మాట్లాడాను. అందరూ నీ ధైర్యం ఏంటి? అని అడిగారు. నా ధైర్యం ఒక్కటే .. నా బ్రాండ్ ఒక్కటే దటీజ్ సీబీఎన్ అని చెప్పా. 2024లో సైకో పాలనకు బైబై చెప్పి రాష్ట్ర ప్రజలు ప్రజాప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకున్నారు. గెలిచిన మొదటి రోజు నుండే ఉద్యోగాల వేట మొదలుపెట్టాం. యువగళం పాదయాత్ర నాలో మార్పు తెచ్చింది. జీడీ నెల్లూరు నియోజకవర్గంలో పాదయాత్ర సమయంలో ఒక కుగ్రామంలో ఒక తల్లి రోడ్డుపై బోండాలు వేస్తోంది. ఆకలివేస్తోంది, బోండాలు పెట్టమని అడిగా. ఆమెను ఏం కావాలని అడిగాను. మద్యానికి బానిసై నా భర్త చనిపోయాడు, 30ఏళ్లుగా టిఫిన్ కొట్టుపెట్టుకుని జీవనం సాగిస్తున్నా. ఇద్దరు బిడ్డలను చదివిస్తున్నా, వారికి ఉద్యోగాలు కావాలని కోరింది. మరుసటిరోజే సీఎం చంద్రబాబుకు ఫోన్ చేసి మ్యానిఫెస్టోలో మొదటిహామీగా 20లక్షల ఉద్యోగాలు పెట్టాలని కోరాను అని లోకేష్ గత అనుభవాన్ని నెమరువేసుకున్నారు.



## సీబీఎన్ బ్రాండే మా ధైర్యం!

మొన్నే ఢిల్లీలో ఒక ఇంటర్వ్యూకి వెళ్ళా. అక్కడ యాంకర్ ఒక ప్రశ్న అడిగారు. తెలంగాణకు హైదరాబాద్ ఉంది. తమిళనాడుకి చెన్నై ఉంది. కర్ణాటకకు బెంగుళూరు ఉంది. ఆంధ్రప్రదేశ్‌కు ఏముంది? అని. ఆంధ్రప్రదేశ్‌కు చంద్రబాబు ఉన్నారని చెప్పా. ఇప్పటికే 8లక్షల కోట్ల పెట్టుబడులు, వాటిద్వారా 5 లక్షల ఉద్యోగాలు కల్పనకు ఒప్పందాలు చేసుకున్నాం. రిలయన్స్, ఎన్టీపీసీ, ఆర్సెలర్ మిట్టల్, బీపీసీఎల్, టాటా పవర్, టీసీఎస్, ఎల్జీ ఎలక్ట్రానిక్స్.. ఇలా అనేక కంపెనీలు రాష్ట్రానికి క్యూకట్టాయి. నా లక్ష్యం ఒక్కటే. కుటుంబంలో ఒక్క ఉద్యోగం వస్తే ఆ కుటుంబ పరిస్థితులు మారిపోతాయి. పేదరికం లేకుండా చెయ్యాలంటే ఉద్యోగాలు కల్పించాలి. ఐదేళ్లలో రాష్ట్రంలో యువతకు 20 లక్షల ఉద్యోగాలు కల్పించడమే నా సింగిల్ టార్గెట్ అని లోకేష్ స్పష్టం చేశారు.

## రిలయన్స్‌తో బాబుకు ప్రత్యేకమైన అనుబంధం

రిలయన్స్ ఫౌండర్‌ఛైర్మెన్ ధీరూభాయ్ అంబానీతూ ముఖ్యమంత్రికి మంచి అనుబంధముంది. జాంనగర్‌లో ఉన్న రిలయన్స్ రిఫైనరీ చూడటానికి వెళ్ళినప్పుడు చంద్రబాబు టెలికాం రంగంలో విప్లవం రాబోతుందని ధీరూభాయ్ అంబానీకి చెప్పారు. చంద్రబాబుపై నమ్మకంతో ఆ రోజుల్లోనే ధీరూభాయ్ అంబానీ టెలికాం రంగంలో పెట్టుబడులు పెట్టారు. ఆ తరువాత ఆ అనుబంధం రిలయన్స్ ఛైర్మెన్ ముకేష్ అంబానీతో కూడా కొనసాగుతుంది. రాష్ట్రంలో ప్రజాప్రభుత్వం ఏర్పడిన తరువాత

- (మిగతా వివరాలు 5లో)

# పీ-4కు సీబీజీతో నాంది



(4వ పేజీ తరువాయి)

నేను ముఖేష్ అంబానీ,అనంత్ అంబానీ,రిలయన్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పిఎంఎస్ ప్రసాద్‌లను కలిసి రాష్ట్రంలో పెట్టుబడులుపెట్టాలని ఆహ్వానించాను. ఏపీ ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ కాదు...స్పీడ్ ఆఫ్ డూయింగ్‌లో ముందుందని చెప్పాను. 21రోజుల్లో ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ పాలసీ(ఐస్) తీసుకొస్తానని హామీ ఇచ్చాను, కానీ 30రోజులు పట్టింది. అడిగిన వెంటనే ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులుపెట్టడానికి అంగీకరించిన ముఖేష్ అంబానీ, అనంత్ అంబానీ, రిలయన్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పిఎంఎస్ ప్రసాద్‌కు కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను అని లోకేష్ ప్రకటించారు.

## కనిగిరి ట్రిపుల్ ఐటీకి త్వరలోనే శంకుస్థాపన

ప్రకాశం జిల్లాకు ఎప్పుడొచ్చినా నా పాదయాత్ర గుర్తొస్తుంది, నాపై చూపిన ప్రేమ, అభిమానం ఎప్పుడూ మర్చిపోను. కనిగిరిలో ట్రిపుల్ ఐటీకి త్వరలోనే శంకుస్థాపన చేస్తా. కనిగిరి రైల్వే ప్రాజెక్టుకు ఏప్రిల్‌లో అవసరమైన నిధులిస్తాం, ఆగస్టులో సీఎంను రప్పించి రైల్వేప్రాజెక్టు పనులు ప్రారంభిస్తాం. మిగిలిపోయిన వెలుగొండ పనులు పూర్తిచేసి చివరి ఎకరాకు సైతం సాగునీరు అందిస్తాం, తాగునీటి శాఖ మంత్రి, నా సోదరుడు పవనన్న, కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించి ఆగిపోయిన జల్ జీవన్ మిషన్ పనులను ప్రారంభించారు, రాబోయే రోజుల్లో ప్రతిగడపకు తాగునీరు అందిస్తాం. వైకాపా నాయకుల దుష్ప్రచారం చూస్తుంటే జాలివేస్తోంది, వారు చేయరు, చేసేవాళ్లను చేయనీయరు. బయోగ్యాస్ ప్లాంటుపై అపోహలు సృష్టిస్తున్నారు. అనవసరంగా అడ్డుపడితే ఎర్రబుక్ లోకి ఎక్కుతారు. నేను మంచి పనిచేయడానికి వచ్చా. అధికారంలోకి వచ్చిన 10 నెలల్లోనే ప్రతిష్టాత్మక ప్రాజెక్టుతో ప్రకాశం జిల్లాకు వచ్చా. తప్పుడు ప్రచారం చేస్తే ఎవరినీ వదిలిపెట్టను. ఆనాడు బీసీ గర్జన పేరుతో మేం ప్రకాశం జిల్లాలో కార్యక్రమం పెడితే ఉదయభాను యాంకర్‌గా వచ్చారు. ఆనాడు బీసీ సోదరులపై దాడులను నిలదీశాం. ఉదయభానును ట్రోల్ చేశారు. బీసీ నేతలపై దొంగ కేసులు పెట్టారు, నాపై కూడా 23కేసులు పెట్టారు. తగ్గేదే లేదని చెప్పాను. 94శాతం సీట్లతో మీరు మమ్మల్ని గెలిపించారు, మీకు అండగా నిలుస్తామని లోకేష్ స్పష్టం చేశారు.



## కనిగిరి నియోజకవర్గంలోనే 50 ప్లాంట్లు

పాదయాత్ర సమయంలో సాయంత్రం సరదాగా కూర్చుని మాట్లాడుకునేవాళ్లం. మన ప్రాంతంలో ఏం మార్పుతేవాలనే విషయమై చర్చించేవాళ్లం. మా ప్రాంతంలో వలసలకు చెక్ పెట్టాలని ఉగ్రనరసింహారెడ్డి చెప్పారు. అది గుర్తుపెట్టుకొని నేను, గొట్టిపాటి మొదటి సిబిజి ప్లాంట్ కనిగిరిలో ఏర్పాటు చేయాలని నిర్ణయించాం. రిలయన్స్ ఆధ్వర్యాన మొదటి వంద సీబీజీ ప్లాంట్లు ప్రకాశం జిల్లాకు తేవాలని నిర్ణయించాం. ఈ ప్రాంత రైతులు 50వేల ఎకరాలు కౌలుకు ఇస్తారని ఉగ్ర చెప్పారు. చెప్పిన ప్రకారం భూములిస్తే ఇక్కడే 50ప్లాంట్లు ఏర్పాటు చేస్తాం. గత పదిరోజులుగా ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి అవిశ్రాంతంగా పనిచేశారు. కనిగిరి ప్రజలకోసం ఆయన కష్టపడ్డారు. ఇక్కడ ప్రజలు ఇతర ప్రాంతాలకు వలసవెళ్లకుండా ఇక్కడే ఉద్యోగాలు కల్పించాలని ఆయన కృషిచేస్తున్నారని లోకేష్ ప్రశంసించారు.




కార్యక్రమంలో మంత్రులు గొట్టిపాటి రవికుమార్, ఆనం రాంనారాయణ రెడ్డి, డోలా బాల వీరాంజనేయ స్వామి, చీఫ్ సెక్రటరీ విజయానంద్, ప్రకాశంజిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా, ట్రాన్స్ కో ఎండి కీర్తి చేకూరి, ఎమ్మెల్యేలు ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి, ముత్తుముల అశోక్‌రెడ్డి, కందుల నారాయణరెడ్డి, బిఎన్ విజయకుమార్, ఇంటూరి నాగేశ్వరరావు, ఎంఎం కొండయ్య, ఏలూరి సాంబశివరావు, కాకర్ల సురేష్, టూరిజం కార్పొరేషన్ చైర్మన్ నూకసాని బాలాజీ, మారిటైమ్ బోర్డు చైర్మన్ దామచర్ల సత్య, 20సూత్రాల కార్యక్రమం అమలు చైర్మన్ లంకా దినకర్, అగ్రికల్చర్ మిషన్ వైస్ చైర్మన్ మర్రెడ్డి శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, యర్రగొండపాలెం ఇన్ ఛార్జి ఎరిక్షన్ బాబు, దర్శి ఇన్ ఛార్జి గొట్టిపాటి లక్ష్మి, రిలయన్స్ ఇండస్ట్రీస్ డైరక్టర్ పిఎంఎస్ ప్రసాద్, ఆర్ఐఎల్ మెంటర్ పీవీఎల్ మాధవరావు, రిలయన్స్ బయో ఎనర్జీ సీఈఓ హరీంద్ర కే త్రిపాఠి, నెడ్ క్యాప్ విసి అండ్ ఎండి కమలాకర్ బాబు, సర్పంచ్ తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.










చైతన్యరథం



# నీటి ప్రాజెక్టులన్నీ టీడీపీ చలవే

## 43ఏళ్ల టీడీపీ ఉజ్వల చరిత్ర -గుణపాఠాలు 4

### విశ్వాస పరీక్ష -171 ఓట్లతో విజయం

- ప్రొటెం స్పీకర్‌గా మహేంద్రనాథ్‌ను నియమించడమైనది.
- 20 సెప్టెంబర్ 1984న అసెంబ్లీలో జరిగిన విశ్వాస పరీక్షలో ఎన్టీఆర్‌కు మద్దతుగా 171 ఓట్లు వచ్చాయి.

### వెంకట రత్నం స్పీకర్‌గా ఎన్నికయ్యారు.

- పోలీసు రక్షణ కోరిన నాదెండ్లకు రక్షణనిచ్చి ఇంటికి వెళ్లే ఏర్పాటు జరిగింది.
- కుట్ర రాజకీయాలకు అల్పాయుష్షు మాత్రమే వుంటుందని నాదెళ్ల ఉదంతం స్పష్టం చేస్తున్నది.

### ముందస్తు లోక్‌సభ ఎన్నికలు- 30 సీట్లతో ప్రధాన ప్రతిపక్షమైన టీడీపీ


- 31.10.1984న తన సెక్యూరిటీ గార్డులచే తన నివాసంలో ఇందిరాగాంధి హత్యకు గురయ్యారు.
- అదే రోజు రాత్రి 10 గంటలకు రాజీవ్‌గాంధీ ప్రధానిగా ప్రమాణ స్వీకారం చేశారు.
- ఇందిరాగాంధీ హత్యతో ఉత్పన్నమైన సానుభూతిని ఉపయోగించుకోవడానికి లోక్‌సభకు ముందస్తు ఎన్నికలు జరిపారు.
- 24-27 డిసెంబర్ 1984 మధ్య లోక్‌సభ ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో ఆంధ్రప్రదేశ్ మినహా దేశవ్యాప్తంగా కాంగ్రెస్ గొప్ప విజయం సాధించింది.
- ఏపీలో 42 సీట్లకుగాను 6 లోక్‌సభ సీట్లలోనే కాంగ్రెస్ గెలిచింది. పోటీ చేసిన 34 సీట్లలో టీడీపీ 30సీట్లు గెలిచి లోక్‌సభలో ప్రధాన ప్రతిపక్షమైంది. మిత్రపక్షాలు 8 సీట్లలో పోటీ చేశాయి.
- ప్రాంతీయ పార్టీ లోక్‌సభలో ప్రధాన ప్రతిపక్ష పాత్ర పోషించడం ఒక చరిత్ర.

### ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ రద్దు - తిరిగి ఘన విజయం సాధించిన టీడీపీ

- ప్రజాస్వామ్య ద్రోహులతో కూర్చొని అసెంబ్లీ నడపడం భావ్యంకాదని భావించి ఎన్టీఆర్ మంత్రివర్గం 22.11.1984న సమావేశమై అసెంబ్లీ రద్దు తీర్మానాన్ని ఆమోదించారు.
- గవర్నర్‌కు క్యాబినెట్ తీర్మానం పంపగా వారు అసెంబ్లీ రద్దు తీర్మానాన్ని వెంటనే ఆమోదించారు. 03.05.1985న అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి.
- టీడీపీ 249 సీట్లలోనూ, మిత్రపక్షాలైన బీజేపీ, ఉభయ కమ్యూనిస్టు పార్టీలు, జనతా పార్టీ కలిపి 45 సీట్లలో పోటీ చేశాయి.
- నాదెండ్ల పార్టీ 220 సీట్లకు పోటీ చేయగా ఒక్క సీటు కూడా గెలవలేదు. రెండు స్థానాలలో తప్ప మిగిలిన అన్ని సీట్లలో డిపాజిట్ కోల్పోయారు.
- తెలుగుదేశం 202 సీట్లలోను, మిత్రపక్షాలు మరో 22 స్థానాలలో మొత్తం 224 సీట్లల్లో గెలవడమైంది. 1983 కన్నా 22 సీట్లు అధికంగా గెలిచారు.
- కాంగ్రెస్ 1983లో 60 సీట్లలో గెలవగా 1985లో 50 సీట్లకు పడిపోయింది.
- టీడీపీకి ద్రోహం చేసి నాదెండ్లతో వెళ్లిన వారందరూ ఓడిపోగా, కుట్ర చేసిన కాంగ్రెస్ కూడా 10 స్థానాలు కోల్పోయింది. కుట్రదారులు, ద్రోహులకు ప్రజలు ఇలా బుద్ధి చెప్పారు.
- 09.03.1985న లక్షలాదిమంది సమక్షంలో పెరేడ్ గ్రౌండ్స్‌లో ముఖ్యమంత్రిగా ఎన్టీఆర్ ప్రమాణ స్వీకారం చేశారు.

### రెండవ దశ పాలన (1985-89)

- 15.11.1985న కాంగ్రెస్ నేత కుముద్ బెన్ జోషి గవర్నర్‌గా నియామకం జరిగింది.
- ఆమె గవర్నర్‌గా కాకుండా కాంగ్రెస్ నేతగా వ్యవహరించారు. 26.11.1985 నుండి 30.9.1987 మధ్య 23 జిల్లాల పర్యటనలు చేసి 1200 సభల్లో ఉపన్యాసాలు చేశారు. రాజ్‌భవన్‌ను కాంగ్రెస్ కార్యాలయంగా మార్చేశారు.
- ఈ కాలంలో ఏపీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా జలగం వెంగళరావు, నేదురుమల్లి జనార్ధనరెడ్డి పనిచేశారు. కాంగ్రెస్ శాసనసభా పక్ష నేతగా బాగారెడ్డి పనిచేశారు.
- ప్రధాని రాజీవ్‌గాంధీ రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా వ్యవహరించారు.
- చంద్రబాబును ఎన్నికల్లో పోటీ చేయమని ఎన్టీఆర్ కోరినప్పటికీ సున్నితంగా తిరస్కరించి పార్టీ నిర్మాణ పటిష్టత కోసం పనిచేస్తానని చెప్పారు.



- **1985లో పార్టీ జనరల్ సెక్రటరీగా నియమించబడ్డారు. పార్టీ శిక్షణా తరగతులు నిర్వహించారు. పార్టీ కమిటీలు ఏర్పాటు తదితర సంస్థాగత నిర్మాణ పటిష్ట చర్యలు విజయవంతంగా నిర్వహించారు.**
- ఈ కాలంలో ఎన్టీఆర్ ప్రభుత్వం మాండలిక వ్యవస్థను ప్రవేశపెట్టింది. సింగిల్ విండో వ్యవస్థ తెచ్చారు. తిరుమలలో నిత్యాన్నదానం, తెలుగు విశ్వవిద్యాలయం, వైద్య విశ్వ విద్యాలయం, మహిళా విశ్వ విద్యాలయం, భూమిశిస్తు రద్దులాంటి గొప్ప పనులు చేశారు.
- శ్రీకాకుళంలో మద్దివలస ప్రాజెక్టు, పులిచింతల, శ్రీరామ్‌సాగర్, పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ నిర్మాణం, తెలుగుగంగ, హంద్రీనీవా, గాలేరు నగరి లాంటి ఎన్నో ప్రాజెక్టుల నిర్మాణాలు జరిగాయి.
- పార్లమెంట్‌లో ప్రతిపక్షంగా మంచి కృషి జరిగింది.

### కాంగ్రెస్ కుట్రలు, కుతంత్రాలు

- చారిత్రాత్మక తెలుగుగంగ ఒప్పందం 18.4.1983న జరిగింది. పైపుల ద్వారా మద్రాసుకు తాగునీరు తీసుకెళ్లాలనేది కేంద్రం, తమిళనాడు ఆలోచన. ఎన్టీఆర్ దీనికి అంగీకరించలేదు.
- కెనాల్స్ ద్వారా అయితే అటు రాయలసీమ, నెల్లూరు, కాళహస్తి ఏరియాకు సాగు, తాగునీటికి ఉపయోగపడుతుందని టీడీపీ అందర్నీ ఒప్పించింది. ఇది టర్నింగ్ పాయింట్.
- పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ నిర్మాణం చేపట్టింది. 198లో గాలేరు నగరి, హంద్రీ నీవా ప్రాజెక్టులు చేపట్టుటకు కార్యాచరణ ప్రారంభమైంది.
- అనేక మీడియం, మైనర్ ఇరిగేషన్ ప్రాజెక్టులు ప్రారంభించారు.



-గురజాల మాల్యాద్రి,
చైర్మన్, టీడీపీ నాలెడ్జ్ సెంటర్

- కాంగ్రెస్ పాలనలో రాయలసీమ సాగునీటి ప్రాజెక్టులకు ప్రాధాన్యత ఇవ్వలేదు.
- టీడీపీ ప్రభుత్వం చేపట్టిన ప్రాజెక్టులకు ప్రజల్లో మంచి పేరు రావడం కాంగ్రెస్ నేతలు సహించలేకపోయారు.
- నికర జలాల పేరిట ప్రాంతీయ చిచ్చు కుట్ర : 1988 ఆగస్టులో రాయలసీమ కాంగ్రెస్ 12మంది ఎమ్మెల్యేలు అసెంబ్లీ ముగిసిన పిదప స్పీకర్ పోడియం దగ్గర నిరాహార దీక్ష ప్రారంభించారు. అక్కడ మార్షల్స్ తొలగించగా ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో 13 రోజులు నిరాహార దీక్ష చేశారు.
- 370 టీఎంసీ నీటి కేటాయింపులు కావాలని, నికర జలాల పేరుతో ప్రజల్ని రెచ్చగొట్టారు.
- 1 నవంబర్ 1988, రాష్ట్ర అవతరణ కార్యక్రమాలు ముగించుకొని వచ్చే ఎన్టీఆర్‌ను సెక్రటేరియేట్ గేటువద్ద 400మంది సీమ కాంగ్రెస్ వారు అడ్డగించారు.
- సమస్యలు చెప్పమన్నా వినలేదు. ఎన్టీఆర్ రోడ్డుపైనే బైఠాయించారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో 4 వేలమంది ఎన్టీఆర్‌పై దాడికి ప్రయత్నించారు.
- నికర జలాల పేరుతో ప్రాంతీయ చిచ్చు రెచ్చగొట్టడమే లక్ష్యంగా చేశారు.
- కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉండి కూడా తెలుగుగంగకు అనుమతి ఇవ్వకున్నా దాన్ని సాధించేందుకు వైఎస్ గ్యాంగ్ పనిచేయలేదు.
- వై.ఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రి అయిన తరువాత ఆయన డిమాండ్ చేసిన 370 టీఎంసీ నికర జలాలు సాధించలేదు. పైగా కృష్ణాలో మిగులు జలాలపై హక్కు కోరబోమని బ్రిజేష్ ట్రిబ్యునల్‌కు వైఎస్ ప్రభుత్వం లేఖ ఇచ్చింది.
- జగన్ జలయజ్ఞాన్ని ధనయజ్ఞం చేశారు. రాయలసీమ లిఫ్ట్ పేరుతో జల జగడం సృష్టించి కృష్ణ, తుంగభద్ర, గోదావరి నదీ జలాలపై రాష్ట్ర ప్రత్యేక హక్కులు కేంద్రానికి ధారాదత్తం చేశారు.
- నేడు రాయలమీలోను, రాష్ట్రంలోనూ ఉన్న ప్రధాన సాగునీటి ప్రాజెక్టులన్నీ ఎన్టీఆర్ ప్రారంభించగా, చంద్రబాబు భారీగా నిధులు కేటాయించి నిర్మించారు.
- సాగునీటి ప్రాజెక్టులపై టీడీపీ చేసిన కృషిని, కాంగ్రెస్ కుట్రల్ని లోతుగా ప్రజల్లో టీడీపీ బ్రాండ్ చేయలేకపోవడం జరిగింది.
- వంగవీటి రంగా హత్యపై కుల చిచ్చు కుట్ర: రెండు గ్యాంగుల మధ్య జరిగిన హత్యను కుల చిచ్చు పెట్టడంలో వైఎస్ ముఠా జయప్రదమైంది. ఒక వర్గంపై దాడులు చేయించారు.
- చివరకు ఆ రెండు గ్యాంగులను కాంగ్రెస్‌లో చేర్చుకున్నారు.
- వంగవీటి రంగా కుమారుడు తన తండ్రి హత్య నెహ్రూకు సంబంధించేగాని కులాలకు సంబంధం లేదని ఇటీవల ప్రకటించారు.
- ఎన్జీవోల సమ్మెను వాడుకున్న కాంగ్రెస్: పని పరిస్థితుల మెరుగుదలకు రుస్తుంజీ కమిషన్ వేయడం జరిగింది. దీనిపై ఎన్జీవోల్లో వ్యతిరేకత వచ్చింది.
- 1986లో పే కమిషన్ సిఫార్సులను ప్రభుత్వం అమలు చేయడానికి సమ్మతించింది. అయినా కాంగ్రెస్ నేతలు వారిని రెచ్చగొట్టి 53 రోజులు సమ్మె చేయించారు.
- ఇలా కుల, మత, ప్రాంతీయ చిచ్చుతో, దుష్ప్రచారాలతో కాంగ్రెస్ ప్రజల్ని ప్రభుత్వంపై రెచ్చగొట్టడంలో జయప్రదమయ్యారు. కారంచేడు హత్యల్ని టీడీపీకి అంటగట్టి కాంగ్రెస్ దుష్ప్రచారం చేసింది. దీనివల్ల దళితులలో నష్టం జరిగింది. కారంచేడుకు మించిన చుండూరు దళిత హత్నల్ని టీడీపీ తగుస్థాయిలో ఎక్స్‌పోజ్ చేయలేదు. 33 మంది మంత్రుల్ని ఒకేసారి మార్చడంవల్ల పార్టీలోను, పబ్లిక్‌లోనూ నష్టం జరిగింది. గుర్తేడులో నక్సల్స్ 7గురు ఐఏఎస్‌లను కిడ్నాప్ చేశారు.
- పార్టీ కార్యకర్తలు ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమం బ్రాండ్ చేయలేకపోయింది. పైకారణాల వల్ల 1989 ఎన్నికల్లో టీడీపీ ఓడిపోయింది.

**చారిత్రాత్మక తెలుగుగంగ ఒప్పందం 18.4.1983న జరిగింది. పైపుల ద్వారా మద్రాసుకు తాగునీరు తీసుకెళ్లాలనేది కేంద్రం, తమిళనాడు ఆలోచన. ఎన్టీఆర్ దీనికి అంగీకరించలేదు. కెనాల్స్ ద్వారా అయితే అటు రాయలసీమ, నెల్లూరు, కాళహస్తి ఏరియాకు సాగు, తాగునీటికి ఉపయోగపడుతుందని టీడీపీ అందర్నీ ఒప్పించింది. ఇది టర్నింగ్ పాయింట్.**


చెన్నైకి జలాలు తీసుకెళ్లే తెలుగు గంగ

# అడగకుండానే వరమిచ్చారు

- మంత్రి లోకేష్‌పై ప్రజా ప్రతినిధుల ప్రశంసలు
- ప్రకాశం జిల్లా చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగ్గ రోజు
- వైసీపీ పాలనలో పరిశ్రమలను పొరుగు రాష్ట్రాలకు తరిమివేశారు
- 10 నెలల్లోనే ఎన్నో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టాం
- దివాకరపల్లి సభలో ప్రజాప్రతినిధుల ప్రసంగ సారాంశం











కనిగిరి (చైతన్య రథం): ప్రకాశం జిల్లా చరిత్రలోనే సువర్ణాక్షరాలతో లిఖించదగ్గ రోజని దివాకరపల్లి సభలో పలువురు ప్రజాప్రతినిధులు పేర్కొన్నారు. సీబీజీ ప్లాంట్‌కు భూమి పూజ అనంతరం ఏర్పాటు చేసిన సభలో సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి మాట్లాడుతూ.. ప్రకాశం జిల్లాలో పరిశ్రమల సాధనలో కృషిచేసిన మంత్రి నారా లోకేష్, విద్యుత్ మంత్రి గొట్టిపాటి రవికుమార్, సీఎస్ విజయానంద్‌కు, రిలయన్స్ ప్రతినిధులకు ధన్యవాదాలు తెలిపారు. రిలయల్స్ తన మొదటి సీబీజీ ప్లాంట్‌ను ప్రకాశం జిల్లాలో స్థాపించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. ఇందుకు మన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చొరవ మరువలేనిదన్నారు. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ వల్లే ఇది సాధ్యమైంది. 20 లక్షల ఉద్యోగాల కల్పనను కూటమి ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. గత వైసీపీ ప్రభుత్వం ఉన్న పరిశ్రమలను పొరుగు రాష్ట్రాలకు తరిమివేసింది. నేడు అనేకమంది పారిశ్రామికవేత్తలు ఏపీవైపు చూస్తున్నారంటే అందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కృషే కారణం. ఇప్పటికే 5 లక్షలకు పైగా ఉద్యోగ అవకాశాలు కల్పించేలా కూటమి ప్రభుత్వం ముందడుగు వేసింది. సూపర్ సిక్స్ హామీలను నెరవేరుస్తున్నాం. రెండొందల పెన్షన్‌ను రూ.2వేలు చేశాం. జగన్‌రెడ్డి వెయ్యి రూపాయలు పెంచడానికి ఐదేళ్లు పట్టింది. నేడు పెన్షన్ రూ.4వేలు చేయడం జరిగింది. త్వరలోనే డీఎస్సీ నోటిఫికేషన్ రానుంది. ఎస్సీ వర్గీకరణ పూర్తిచేసి ఈ నెలలోనే నోటిఫికేషన్ ఇవ్వనున్నాం. దీపం-2 పథకం ద్వారా మహిళలకు అండగా నిలుస్తున్నాం. విద్యాసంవత్సరం ప్రారంభంనాటికి ఎంతమంది పిల్లలుంటే అంతమందికి తల్లికి వందనం అందజేస్తాం. ప్రకాశం జిల్లా సర్వతోముఖాభివృద్ధికి కూటమి ప్రభుత్వం విశేషంగా కృషిచేస్తోంది. పేదల సేవలో ముఖ్యమంత్రి ఉన్నారు. ఇంటి నిర్మాణానికి నిధులిస్తున్నాం. గత ప్రభుత్వంలో మంజూరైన ఇళ్లకు కూడా సాయం పెంచడం జరిగిందని అన్నారు.

విద్యుత్ మంత్రి గొట్టిపాటి రవికుమార్ మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం వచ్చిన 9 నెలల్లోనే దేశంలో ఏ రాష్ట్రంలో ఇవ్వని పెన్షన్‌లను ఇస్తున్నాం. ఒక్క పెన్షన్‌లకే ఏడాదికి రూ.30వేల కోట్లు ఖర్చుపెడుతున్న రాష్ట్రం ఆంధ్రప్రదేశ్. ఇచ్చిన హామీల ప్రకారం ప్రతి ఇంటికి మూడు గ్యాస్ సిలిండర్లు ఇస్తున్నాం. అన్న క్యాంటీన్లను తిరిగి ప్రారంభించాం. ఉచిత ఇసుకను అందిస్తున్నాం. తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ మే నెలలో అందిస్తాం. యువతకు ఉద్యోగాలు కల్పించేందుకు మంత్రి నారా లోకేష్ కృషిచేస్తున్నాం. మారుమూల ప్రాంతమైన కనిగిరికి రిలయన్స్ సీబీజీ ప్లాంట్ తీసుకువచ్చారు. డీఎస్సీ ద్వారా 16వేల ఉద్యోగాలు కల్పించడం జరుగుతోంది. గుజరాత్ తర్వాత ఏపీలోనే రిలయన్స్ అత్యధికంగా లక్ష కోట్ల పెట్టుబడి పెడుతోంది. తద్వార గ్రామీణ ప్రాంతాల్లో యువతకు ఉపాధి లభిస్తుంది. నిరుపయోగ భూమిని ఉపయోగంలోకి తీసుకురావడం జరుగుతుంది.

కనిగిరి ఎమ్మెల్యే ముక్కు ఉగ్రనరసింహారెడ్డి మాట్లాడుతూ.. కనిగిరి ప్రాంతంలో సీబీజీ ప్లాంట్‌ను పెట్టాలని రిలయన్స్ సంస్థను మంత్రి లోకేష్ కోరారు. అడక్కుండానే మాకు వరం ఇచ్చారు. లోకేష్ కాబోయే ముఖ్యమంత్రి. ఇలాంటి సంబరం చేసుకుంటామని ఊహించలేదు. యువగళం పాదయాత్రలో ప్రజలు విశేష ఆదరణ చూపారు. దానిని గుర్తుపెట్టుకుని సీబీజీ ప్లాంట్‌ను మా ప్రాంతానికి తీసుకువచ్చినందుకు ధన్యవాదాలు. రిలయన్స్‌కు ప్రత్యేక ధన్యవాదాలు. ఈ వెనుకబడిన ప్రాంతాన్ని గుర్తుపెట్టుకోవాలని కోరుతున్నా అని పేర్కొన్నారు.

రిలయన్స్ ఇండస్ట్రీస్ డైరెక్టర్ పీఎంఎస్ ప్రసాద్ మాట్లాడుతూ.. ఈ కార్యక్రమంలో భాగస్వామ్యమైనందుకు సంతోషంగా ఉంది. ఏపీ ప్రభుత్వంతో కలిసి పనిచేయడం గౌరవంగా భావిస్తున్నాం. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నాయకత్వంలో ఏపీ అభివృద్ధి పథంలో ముందుకెళ్తోంది. ఏపీ ఉజ్వల భవిష్యత్ కోసం మంత్రి నారా లోకేష్ గారు కృషిచేస్తున్నారు. గ్యాస్ ఉత్పత్తి కోసం కాకినాడలో ఇటీవల రిలయన్స్ సంస్థ రూ.40వేల కోట్ల పెట్టుబడి పెట్టడం జరిగింది. దేశ ఇంధన భద్రత కోసం సీబీజీ ప్లాంట్ల నిర్మాణం మరో ముందడుగు. ఏపీవ్యాప్తంగా 500 సీబీజీ ప్లాంట్లను నెలకొల్పుతాం అన్నారు.

రిలయన్స్ బయో ఎనర్జీ సీఈవో హరీంద్ర కే.త్రిపాఠి మాట్లాడుతూ.. ఇది మనందరం గర్వించాల్సిన విషయం. బయో ఫ్యూయల్ ఎకానమీలో ఇదొక మైలురాయిగా నిలుస్తుంది. గత పదేళ్లలో బయో ఫ్యూయల్ మార్కెట్ శరవేగంగా వృద్ధి చెందుతోంది. ఇప్పుడు 25 లక్షల కోట్లకు చేరుకుంది. గుజరాత్ తర్వాత ఏపీలోనే రిలయన్స్ అత్యధికంగా లక్ష కోట్ల పెట్టుబడులు పెట్టడం పెట్టడం జరుగుతోంది. ఏపీలో పారిశ్రామిక అనుకూల వాతవారణం ఉంది. వచ్చే 2 ఏళ్లలో ఈ ప్రాంత రూపురేఖలు మారనున్నాయని అన్నారు.











# తొలి అడుగుపడింది!





- దివాకరపల్లి వద్ద రిలయన్స్ సీబీజీ ప్లాంట్‌కు శంకుస్థాపన
- సంస్థ ప్రతినిధులతో కలిసి శంకుస్థాపన చేసిన మంత్రి లోకేష్
- రాష్ట్రంలో రూ.65వేల కోట్ల పెట్టుబడి పెట్టనున్న రిలయన్స్
- 2.5 లక్షల మందికి ఉపాధి అవకాశాలు
- వెనుకబడిన ప్రకాశంలో పారిశ్రామిక వెలుగులకు శ్రీకారం

కనిగిరి (చైతన్య రథం): రాష్ట్రంలో వెనుకబడిన ప్రకాశం జిల్లాలో పారిశ్రామిక వెలుగులకు కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ప్రకాశం జిల్లా కనిగిరి నియోజకవర్గం పీసీ పల్లి మండలం దివాకరపల్లి గ్రామ సమీపంలో రిలయన్స్ న్యూ ఎనర్జీ సంస్థ ఏర్పాటు చేయనున్న ఇంటిగ్రేటెడ్ కంప్రెస్డ్ బయో గ్యాస్ (సీబీజీ) ప్లాంట్‌కు విద్య, ఐటీ మంత్రి నారా లోకేష్ శంకుస్థాపన చేశారు. రిలయన్స్ ఇండస్ట్రీస్ డైరెక్టర్ పీఎంఎస్ ప్రసాద్, రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ ఏపీ, టీఎస్ మెంటర్ పీవీఎల్ మాధవరావు, రిలయన్స్ బయో ఎనర్జీ సీఈవో హరీంద్ర కె త్రిపాఠితో కలిసి భూమిపూజ చేశారు. దివాకరపల్లి వద్ద 475 ఎకరాల్లో రూ.139 కోట్ల పెట్టుబడితో 100 టన్నుల సామర్థ్యంతో రిలయన్స్ సంస్థ సీబీజీ ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తోంది. రిలయన్స్ రాష్ట్రవ్యాప్తంగా నెలకొల్పనున్న 500 సీబీజీ ప్లాంట్లలో భాగంగా తొలిప్లాంటుకు బుధవారం మంత్రి నారా లోకేష్ శంకుస్థాపన చేశారు. రిలయన్స్ సంస్థ రాష్ట్రంలో రూ.65వేల కోట్ల పెట్టుబడితో ఈ ప్లాంట్లను స్థాపించనుంది. తద్వారా 2.5 లక్షలమందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. రిలయన్స్ దేశంలో 4 సీబీజీ హబ్‌లను ఏర్పాటు చేయనుండగా అందులో ఒకటి ప్రకాశం జిల్లాలో ఏర్పాటు చేస్తోంది. ముందుగా ప్లాంట్ ఆవరణలోకి చేరుకున్న మంత్రి నారా లోకేష్‌కు కూటమి ప్రజాప్రతినిధులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు. ప్రతి ఒక్కరికీ అభివాదం చేసుకుంటూ మంత్రి నారా లోకేష్ ముందుకు సాగారు.

కార్యక్రమంలో మంత్రులు గొట్టిపాటి రవికుమార్, డోలా బాలవీరాంజనేయస్వామి, సీఎస్ కె విజయానంద్, కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా, కనిగిరి ఎమ్మెల్యే ముక్కు ఉగ్రనరసింహారెడ్డి, గిద్దలూరు ఎమ్మెల్యే ఎమ్ అశోక్‌రెడ్డి, చీరాల ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య యాదవ్, కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, దర్శి ఇంఛార్జ్ గొట్టిపాటి లక్ష్మి, దర్శి మాజీ ఎమ్మెల్యే ఎన్ పాపారావు, మారిటైం బోర్డు ఛైర్మన్ దామచర్ల సత్య, టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ నూకసాని బాలాజి, స్టేట్ అగ్రికల్చర్ మిషన్ వైస్ ఛైర్మన్ మర్రెడ్డి శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.











# విశాఖలో ప్రేమోన్మాది ఘాతుకం

- తల్లి మృతి.. ప్రమాదస్థితిలో కుమార్తె
- సీఎం చంద్రబాబు దిగ్భ్రాంతి
- బాధిత యువతికి మెరుగైన వైద్యానికి ఆదేశం



అమరావతి (చైతన్య రథం) విశాఖపట్నంలో యువతిపై ప్రేమోన్మాది దాడిలో ఒకరు ప్రాణాలు కోల్పోవడం, మరొకరు ప్రాణాపాయ స్థితిలో ఉండటంపై ముఖ్యమంత్రి చంద్రబాబు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. దాడిని అడ్డుకునే ప్రయత్నంలో నిందితుడి చేతిలో యువతి తల్లి నక్కా లక్ష్మి ప్రాణాలు కోల్పోవడం విచారకరమన్నారు. ఘటనపై సీఎం ఆవేదన వ్యక్తం చేశారు. తీవ్ర గాయాలతో చికిత్స పొందుతున్న యువతి ఆరోగ్య పరిస్థితిపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. బాధిత యువతికి మెరుగైన వైద్యం అందించాలని అధికారులకు సూచించారు. నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశించారు.

స్థానికుల సమాచారం ప్రకారం.. మధ్యాహ్నం 12.30 గంటల సమయంలో ఓ యువకుడు బాధితురాలు దీపిక ఇంట్లోకి చొరబడి యువతి, ఆమె తల్లిపై కిరాతకంగా కత్తితో దాడి చేసి పారిపోయాడు.

ఈ ఘటనలో తల్లి లక్ష్మి (43) అక్కడికక్కడే మృతి చెందగా.. తీవ్ర గాయాలైన దీపికను స్థానికులు ఆసుపత్రికి తరలించారు. ఆమె పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. దీపిక డిగ్రీ చదువుకొని ఇంట్లోనే ఉంటోంది. యువతిని ప్రేమించిన నవీన్ అనే వ్యక్తి ఈ దాడి చేసినట్లు పోలీసులు ప్రాథమికంగా నిర్ధరణకు వచ్చారు. దర్యాప్తులో భాగంగా బృందాలుగా ఏర్పడిన పోలీసులు నవీన్ కోసం గాలింపు చేపట్టారు. నిందితుడిని శ్రీకాకుళం సమీపంలో అదుపులోకి తీసుకొని విశాఖ తరలిస్తున్నట్టు సీపీ శంఖబ్రత బాగ్చీ తెలిపారు. ఘటన జరిగిన కొన్ని గంటల్లోనే నిందితుడిని పోలీసులు పట్టుకున్నారు.

### స్పందించిన హోంమంత్రి అనిత

ఈ ఘటనపై హోంమంత్రి అనిత దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. విశాఖ సీపీ శంఖబ్రత బాగ్చీతో ఫోన్లో మాట్లాడి.. బాధితురాలు దీపిక ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. యువతికి మెరుగైన వైద్యం అందించాలన్నారు. నిందితుడిని కఠినంగా శిక్షించాలని పోలీసులను మంత్రి ఆదేశించారు.

# గ్లోబల్ స్థాయికి కళ, వారసత్వ సంస్కృతి

## సీఎం చంద్రబాబు నాయుడు




అమరావతి (చైతన్య రథం): కళాకారులు, సాంస్కృతిక వారసత్వ పరిరక్షణకు ఎన్డీయే ప్రభుత్వం కృషి చేస్తుందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చారు. అలాగే, కళారంగాన్ని గ్లోబల్ స్థాయికి తీసుకెళ్లేందుకు కృషి చేస్తామన్నారు. రాజమండ్రిలో ఏప్రిల్ 4న జరగనున్న అమరావతి చిత్రకళ వీధి కార్యక్రమానికి మద్దతు ప్రకటిస్తూ.. "అమరావతి" అంశంపై రూపొందిన చిత్రలేఖనానికి కుంచెతో రంగులద్దారు. అమరావతి చిత్రకళ వీధి వంటి వేదికల ద్వారా కళాకారుల ప్రతిభను ప్రదర్శించే అవకాశాన్ని అందించేందుకు ప్రభుత్వం అన్ని విధాలుగా సహాయపడుతుందని హామీ ఇచ్చారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు కృషి చేస్తున్న సాంస్కృతిక కమిషన్ ఛైర్‌పర్సన్ తేజస్విని అభినందించారు. ప్రభుత్వ పాఠశాలలు, బడుగు పిల్లలకు వారి కళను ప్రదర్శించే అవకాశాన్ని కల్పించాల్సిన అవసరం ఉందని ప్రస్తావిస్తూ.. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన కళాకారులకు ఆహ్వానం పలికారు. చిత్రానికి రంగులద్దే సమయంలో.. చిన్నతనంలో చివరిసారి చిత్రలేఖనం చేసిన అనుభూతిని గుర్తుచేసుకుంటూ, మళ్లీ ఆ అనుభూతి కలిగిందన్నారు. తేజస్వి మాట్లాడుతూ, కళాకారులకు ఇది బంగారు యుగంగా అభివర్ణించారు. సీఎం చంద్రబాబు నాయుడు నాయకత్వంలో కళలు, సాంస్కృతిక వారసత్వానికి విశేష ఆదరణ లభిస్తోందని పేర్కొన్నారు.



**ఏపీ సీఎం చంద్రబాబును జనసేన నేత నాగబాబు మర్యాదపూర్వకరంగా కలిశారు. శాసనమండలి చైర్మన్ కార్యాలయంలో ఎమ్మెల్సీగా ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం సచివాలయంలో కుటుంబసమేతంగా ముఖ్యమంత్రిని కలిశారు. ఈ సందర్భంగా నాగబాబును సీఎం చంద్రబాబు అభినందించారు.**

# రక్షణ రంగంలో ప్రాజెక్టులు పూర్తి చేయండి

**కేంద్రమంత్రి రాజ్‌నాథ్‌కు టి.జి.భరత్ విజ్ఞప్తి**

**ప్రాజెక్టుల పురోగతిపై చర్చించిన మంత్రి**



ఢిల్లీ: ఆంధ్రప్రదేశ్‌లో రక్షణ రంగానికి సంబంధించిన ప్రాజెక్టుల పనులు చురుగ్గా కొనసాగించాలని రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌ను పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసె సింగ్ శాఖ మంత్రి టి.జి.భరత్ కోరారు. ఢిల్లీలో కేంద్ర మంత్రిని కలిసి ఏపీకి సంబంధించిన ప్రాజెక్టులపై ఆయన చర్చించారు. పెండింగ్ ప్రాజెక్టులు వేగవంతం చేయాలని కోరినట్లు మంత్రి తెలిపారు. రక్షణ రంగానికి సంబంధించిన ప్రాజెక్టుల ఏర్పాటు విషయంలో ఉన్న సమస్యలను పరిష్కరించాలని కేంద్ర మంత్రిని కలిసినట్లు చెప్పారు. పెండింగ్ ప్రాజెక్టులపై ఆయన సానుకూలంగా స్పందించినట్లు వివరించారు. ఆంధ్ర ప్రదేశ్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధిలో ముందుకు తీసుకెళ్లేందుకు సీఎం చంద్రబాబు ఎంతో కృషి చేస్తున్నారని, ఆయనతో అనుబంధాన్ని కేంద్రమంత్రి గుర్తుచేశారని చెప్పారు. ఇక ఏపీకి సంబంధించిన ప్రాజెక్టులపై పురోగతిని పర్యవేక్షించేందుకు ప్రత్యేకంగా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ప్రతి 15 రోజులకు ఒకసారి అధికారులతో సమీక్షిస్తానని చెప్పారని వివరించారు. ఏపీలో ఏ రంగంలోనైనా పెట్టుబడులు పెట్టేందుకు అవకాశాలు ఉన్నాయని, పెట్టుబడి దారులతో నిత్యం సమీక్షిస్తూ ప్రాజెక్టులకు సంబంధించిన అనుమతులు మంజూరు చేయడంతో పాటు సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నామని భరత్ వివరించారు.

# హస్త కళలకు మరింత ప్రాచుర్యం

- **రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి సవిత వెల్లడి**
- **ఏపీహెచ్‌డీసీ, ఎన్ఐడి మధ్య రెండు కీలక ఒప్పందాలు**
- **బనానా ఫైబర్, గుర్రపు డెక్కల కళారూపాల తయారీపై శిక్షణ**
- **అనంతపురం, మచిలీపట్నంలో శిక్షణా కేంద్రాల ఏర్పాటు**

అమరావతి (చైతన్య రథం): రాష్ట్రంలో హస్త కళలకు మరింత ప్రాచుర్యం తీసుకొస్తున్నట్లు రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. ఇందుకోసం హస్త కళాకారులకు నూతన డిజైన్లు, సరికొత్త ఆకృతుల తయారీపై శిక్షణతోపాటు ఉత్పత్తులకు మార్కెట్ సదుపాయం కల్పించనున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా ఏపీ, అహ్మదాబాద్‌కు చెందిన నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజైన్ (ఎన్.ఐ.డి.)తో రెండు ఒప్పందా లు చేసుకున్నామని మంత్రి సవిత తెలిపారు. ఈమేరకు బుధవారం అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో ఆంధ్రప్రదేశ్ హస్తకళల అభివృద్ధి సంస్థ (ఏపీహెచ్డీసీ), నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజైన్ మధ్య రెండు ఒప్పందాలు కుదిరాయి. మంత్రి సవిత, చేనేత, జౌళి శాఖ ప్రధాన కార్యదర్శి యువరాజ్ సమక్షంలో ఒప్పంద పత్రాలపై సంతకాలు చేసి, మార్చుకున్నారు. ఈ ఒప్పందాలపై లేపాక్షి ఎండీ విశ్వ, ఎన్.ఐ.డి అహ్మదాబాద్ డైరెక్టర్ డాక్టర్ అశోక్ మండల్, ఏపీ డైరెక్టర్ డాక్టర్ బవుమిక్ నగర్ సంతకాలు చేశారు. ఈ ఒప్పందాల ప్రకారం, రెండేళ్ల పాటు బనానా ఫైబర్, గుర్రపు డెక్కలతో ఉత్పత్తుల తయారీపై హస్త కళా కారులకు శిక్షణ ఇవ్వనున్నారు. తయారుచేసిన కళారూపాలకు మార్కెట్ సదుపాయం కూడా కల్పించనున్నారు. దీంతో పాటు ప్యాకింగ్, బ్రాండింగ్ ఇమేజ్ పెంపుదలపైనా శిక్షణలో అవగాహన కల్పించనున్నారు. దీనిలో భాగంగా అనంతపురంలో బనానా ఫైబర్ క్రాఫ్ట్ తయారీపైనా, కృష్ణా జిల్లా మచిలీపట్నంలో గుర్రపు డెక్కలతో కళారూపాల తయారీపైనా శిక్షణ ఇవ్వనున్నారు. మూడు నుంచి ఆరు



నెలల పాటు అందించే ఈ శిక్షణా కార్యక్రమాల్లో కళాకారుల నైపుణ్యాలను పెంపొందించడం, వినూత్న ఉత్పత్తుల రూపకల్పనపై అధునాతన నేత పద్ధతుల్లో శిక్షణ ఇవ్వనున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి సవిత మాట్లాడుతూ, రాష్ట్రంలో హస్త కళలకు మరింత ప్రాచుర్యం కల్పించడానికి నిర్ణయించా మన్నారు. ఇందులో భాగంగా హస్త కళాకారులకు నూతన అభిరుచులకు అనుగుణంగా శిక్షణ అందజేయనున్నామన్నారు. అదే సమయంలో ఈ ఒప్పందాలు రాష్ట్ర సాంస్కృతిక వారసత్వాన్ని కాపాడడంతో పాటు గ్రామీణ ఉపాధి అవకాశాలను మెరుగుపరిచి, కళాకారుల జీవనోపాధిని మెరుగుపరుస్తాయని మంత్రి సవిత తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో హస్తకళల రంగం వృద్ధిలో ఈ అవగాహన ఒప్పందాలు కీలక పాత్ర పోషిస్తాయని, ఆంధ్రప్రదేశ్ హస్తకళల పరిశ్రమ ఉనికి ప్రపంచమార్కెట్‌లో బలోపేతమవుతుందని మంత్రి సవిత ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఏపీ, అహ్మదాబాద్ కు చెందిన ఎన్ఐడీ సంస్థలకు చెందిన ప్రతినిధులు, ఆంధ్రప్రదేశ్ హస్తకళల అభివృద్ధి సంస్థ అధికారులు పాల్గొన్నారు.

# సంచార జాతుల అభివృద్ధే సీఎం ధ్యేయం

## - రాష్ట్ర బీసీ సంక్షేమ మంత్రి సవిత

అమరావతి (చైతన్య రథం): రాష్ట్రంలో ఎంబీసీ కులాల అభివృద్ధికి సీఎం చంద్రబాబు చిత్తశుద్ధితో ఉన్నారని, ఇళ్ల స్థలాలతో పాటు ఆధార్ కార్డులు, గుర్తింపు కార్డులు అందజేస్తామని రాష్ట్ర బీసీ సంక్షేమ మంత్రి ఎస్.సవిత తెలిపారు. ఎంబీసీలకు ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చనున్నట్లు తెలిపారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో ఎంబీసీ కుల సంఘాల నాయకులతో మంత్రి సవిత భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఆమె ఆ కులాల ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మంత్రి సవిత మాట్లాడుతూ, కూటమి విజయంలో ఎంబీసీ కులాలు ముఖ్యపాత్ర పోషించాయన్నారు. సంచార జాతులను ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా అభివృద్ధి చేయాలన్నదే సీఎం చంద్రబాబు లక్ష్యమన్నారు. సమావేశంలో తన దృష్టికి తీసుకొచ్చిన ప్రతి అంశాన్నీ సీఎం చంద్రబాబుకు వివరిస్తానన్నారు. ఎంబీసీ సమస్యలపై సీఎం చంద్రబాబుకు పూర్తి అవగాహన ఉందన్నారు. గత ఎన్నికల సమయంలో సంచార జాతులకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చుతామని స్పష్టంచేశారు. సంచార జాతులకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందజే స్తామన్నారు. ఇళ్ల స్థలాలతోపాటు ఆధార్ కార్డులు, గుర్తింపు కార్డులు మంజూరు చేస్తామన్నారు. కుల ధ్రువీకరణ పత్రాల జారీలో ఉన్న ఇబ్బందులను తొలగిస్తామన్నారు. కళాకారులకు పెన్షన్ల మంజూరు విషయమై సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లనున్నట్లు తెలిపారు. సంచార జాతుల పిల్లలకు రెసిడెన్షియల్ స్కూల్లో అడ్మిషన్లు కల్పిస్తామన్నారు. ఆదరణ పథకంలో భాగంగా సంచార జాతులకు అవసరమైన పరికరాలు సమకూర్చుతామన్నారు.



### *బెగ్గింగ్ నిర్మూలనే చంద్రబాబు ధ్యేయం*

రాష్ట్రంలో బెగ్గింగ్ అనే మాటే వినబడకూడదని సీఎం చంద్రబాబు లక్ష్యంగా పెట్టుకున్నారని మంత్రి సవిత తెలిపారు. అందుకోసమే ఎంబీసీకి చెందిన సంచార జాతులతో స్వయం ఉపాధి పథకాల్లో భాగంగా యూనిట్లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ప్రతి ఇంటి నుంచి ఒకరిని వ్యాపారవేత్తగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పెట్టుకున్నారన్నారు. 2014–19 మధ్య బ్యాంకులతో సంబంధం లేకుండా 90 శాతం సబ్సిడీతో సంచార జాతులకు సీఎం చంద్రబాబు రూ.30 వేల మేర ఆర్థిక చేయూత అందించారన్నారు. అదే మాదిరిగా ఎంబీసీలకు కూటమి ప్రభుత్వం ఆర్థిక భరోసా అందజేయనుందన్నారు. గతంలో కంటే అదనంగా ఆర్థిక సాయమందించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు.

### *సంచార జాతుల్లో విద్యకు ప్రాధాన్యం*

నిరక్షరాస్యత కారణంగానే సంచార జాతులు అభివృద్ధిని నోచుకోలేకపోతున్నాయని మంత్రి సవిత ఆవేదన వ్యక్తంచేశారు. సంచార జాతుల వారు తమ పిల్లలను విద్యకు దూరం చేయొద్దని సూచించారు. విద్యతోనే ఆర్థికంగా, సామాజికంగా గుర్తింపు లభిస్తుందన్నారు. ఎన్ని కష్టాలు ఎదురైనా పిల్లలను బడులకు పంపాలని, సీఎం చంద్రబాబునాయుడు, మంత్రి లోకేశ్ అండగా నిలుస్తారని భరోసా ఇచ్చారు. రెసిడెన్షియల్ స్కూళ్లో సంచార జాతుల పిల్లలకు నేరుగా అడ్మిషన్లు ఇచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఇదే విషయమై మంత్రి నారా లోకేశ్ దృష్టికి తీసుకెళ్లనున్నట్లు తెలిపారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల మాదిరిగా విద్యా సంస్థల్లో రాయితీపై సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళతానన్నారు. అర్హులైన సంచార జాతుల విద్యార్థులకు విదేశీ విద్యా పథకం కింద అవకాశం కల్పిస్తామన్నారు. ఈ సందర్భంగా ఎంబీసీ నాయకులు మాట్లాడుతూ, గత టీడీపీ ప్రభుత్వ హయాంలోనే తమకు న్యాయం జరిగిందని, మరోసారి సీఎం చంద్బరాబునాయుడు అధికారంలోకి రావడంతో, తమ బతుకులకు భరోసా లభించిందని ఆశాభావం వ్యక్తంచేశారు. అనంతరం మంత్రి సవితను ఎంబీసీ నాయకులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శి సత్యనారాయణ, డైరెక్టర్ మల్లికార్జున, కార్పొరేషన్ చైర్మన్ వీరంకి వెంకట గురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

# అధికారం పోయినా.. అహం తగ్గలేదు

- ఐదేళ్లూ అబద్ధాలు, మోసాలతో పాలన
- ఎన్నికల్లో బెదిరించి గెలిచే సంస్కృతి వైసీపీదే
- గత స్థానిక ఎన్నికల్లో ఎలా గెలిచారో తెలుసు
- నేడు కూటమి ప్రభుత్వంపై దుష్ప్రచారం
- మేము అలా చేస్తే 39 స్థానాలు మీకు వచ్చేవా?
- మీ స్థానాల్లో మీరు గెలిస్తే బిల్డప్ ఎందుకు?
- వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు



అమరావతి (చైతన్యరథం): అధికారం పోయాక పెళ్లిళ్ల చావులకు వారానికి ఓసారి బెంగళూరు ప్యాలెస్ నుంచి తాడేపల్లి ప్యాలెస్‌కు వలస వచ్చి వెళుతూ ప్రజారంజక పాలన సాగిస్తున్న చంద్రబాబు ప్రభుత్వంపై జగన్‌రెడ్డి బురద జల్లుతున్నాడు. ఐదేళ్ల పాటు అబద్ధాలు మోసాలతో పాలన సాగించిన జగన్ రెడ్డి ఇంకా అదే తోవలో పయనిస్తూ... సీఎం చంద్రబాబు పై తప్పుడు విమర్శలు చేయడం సిగ్గుచేటు. ప్రతిపక్ష హోదా లేకుండా వైసీపీని చిత్తుచిత్తుగా ఓడగొట్టినా జగన్ రెడ్డికి ఇంకా బుద్ధి మారలేదు. ఉప ఎన్నికలు నిర్వహించిన 53 స్థానాలు గతంలో వైసీపీ బెదిరించి భయపెట్టి గెలిచినవే. ఇప్పుడు ఏదో విజయం సాధించినట్టు జగన్ రెడ్డి బీరాలు పలుకుతున్నారు. మేం నిజంగా పోలీసులతో బెదిరించి భయపెట్టి ఉప ఎన్నికలు నిర్వహించి ఉంటే మీరు 39 స్థానాల్లో విజయం సాధించేవారా? ఆ ఉద్దేశం మాకు లేదు కాబట్టే మీకు ఆ 11 స్థానాలు అయినా ఉన్నాయన్నద్ది గుర్తుపెట్టుకోవాలి. అధికారం పోయినా ఇంకా జగన్ రెడ్డి వక్రబుద్ధి మాత్రం మారలేదు.

అధికార అహంకారంతో 2019 -2024 మధ్య వైసీపీ ఎలా ఎన్నికల్లో విజయం సాధించిందో రాష్ట్ర ప్రజలంతా చూశారు. అధికారాన్ని అడ్డుపెట్టుకొని పోలీస్ వ్యవస్థను చేతిలోపెట్టుకొని గత స్థానిక సంస్థల ఎన్నికల్లో టీడీపీ నేతలను నామినేషన్లు వేయనివ్వలేదు. వేసిన నామినేషన్లు ఉపసంహరించుకోమని అభ్యర్థులను బెదిరించారు. కర్రలు రాడ్లతో దాడులు చేశారు. చంపేస్తామని బెదిరించారు. తప్పుడు కేసులు బనాయించి నానా ఇబ్బందులకు గురిచేశారు. ఇది మీ చరిత్ర... ఐదేళ్ల పాటు చేయాల్సిన తప్పుడు పనులు అన్నీ చేసి... ఇప్పుడు ఈ సుద్ధపూస కబుర్లు దేనికి జగన్ రెడ్డి. అధికారంలోకి వచ్చిన 9 నెలల్లోనే ఇచ్చిన మాట ప్రకారం సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నాం. సూపర్ సిక్స్ పథకాలను ఇప్పటికే ఆచరణలో పెట్టాం. ఈ నెలలో డీఎస్సీ, వచ్చే నెలలో అన్నదాత సుఖీభవ, తల్లికి వందం వంటి పథకాలు అమలు చేయబోతున్నాం. బడ్జెట్‌లో భారీగా నిధులు కూడా కేటాయించాం. ఇకనైనా కూటమి ప్రభుత్వంపై తప్పుడు ఆరోపణలు చేయడం మానుకుంటే జగన్ రెడ్డికి మంచిది. లేదంటే ఈ సారి ఆ 11 స్థానాలు కూడా వైసీపీ వచ్చేపరిస్థితి ఉండదు.

## నేడు సీబీజీ.. రేపు ఇండోసోల్..తర్వాత బీపీసీఎల్

*- విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్*

- ప్రకాశం జిల్లాలో ప్లాంట్ల ఏర్పాటుకు చర్యలు
- రూ.1.50 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులు
- లోకేష్ పాదయాత్రలో చెప్పారు..9 నెలల్లో చేశారు
- కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తుంది



కనిగిరి (చైతన్యరథం): లోకేష్ పాదయాత్ర సందర్భంగా వెనుకబడిన ప్రకాశం జిల్లాకు ఏదో ఒకటి చేయాలన్న తపనతో ఇచ్చిన మాటకు కట్టుబడి అధికారంలోకి వచ్చిన కేవలం 9 నెలల్లోనే రూ.650 కోట్లతో రిలయన్స్ సీబీజీ ప్లాంట్‌ను కనిగిరికి తెచ్చారని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ పేర్కొన్నారు. ప్రకాశం జిల్లా కనిగిరిలో రిలయన్స్ సీబీజీ ప్లాంట్ శంకుస్థాపన కార్యక్రమంలో మంత్రి నారా లోకేష్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. అనంతరం సభలో మాట్లాడుతూ చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉంటేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని తెలిపారు. ఆర్థిక, కులాల మధ్య అసమానతలు తొలగాలనే పీ4 వంటి కార్యక్రమాలు తీసుకువస్తున్నారని వివరించారు. అందరూ సమానంగా జీవించాలనేదే సీఎం చంద్రబాబు ఆశయమన్నారు. వైసీపీకి ఒక్క అవకాశం ఇచ్చినందుకు రాష్ట్రం 20 సంవత్సరాలు వెనక్కి పోయిన విషయాన్ని ప్రజలందరూ గమనించాలని కోరారు. 9 నెలల్లోనే ఇంత అభివృద్ధి జరిగితే..ఐదేళ్లలో ఎంత అభివృద్ధి జరుగుతుందో మాటల్లో చెప్పాల్సిన పనిలేదని ప్రజలే చూస్తారని స్పష్టం చేశారు. అడవి లాంటి ప్రాంతాల్లో రైతుల మేలు కోరి రిలయన్స్ సీబీజీ ప్లాంట్ ఏర్పాటు చేయడం కూటమి ప్రభుత్వం వల్లే అవుతుందన్నారు. రాబోయే ఐదేళ్లలో ప్రజామద్దతు కావాలని కోరారు. కందుకూరు నియోజకవర్గ పరిధిలో కూడా త్వరలో రూ.50 వేల కోట్లతో ఇండోసోల్ ప్లాంట్ ఏర్పాటు చేస్తామని, ఆ తర్వాత రూ.లక్ష కోట్ల పెట్టుబడితో బీపీసీఎల్ ప్లాంట్ కూడా ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేస్తుందని స్పష్టం చేశారు. 20 లక్షల ఉద్యోగాల హామీ అమలు దిశగా అనేక చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ప్రకాశం జిల్లా బంజరు భూముల్లో ప్లాంట్ల నిర్మాణంతో నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయన్నారు. అదేవిధంగా ప్రైవేటు భూములకు రూ.31 వేలు, ప్రభుత్వ భూములకు రూ.15 వేలు కౌలును రిలయన్స్ సంస్థ చెల్లిస్తుందని వివరించారు. గత ప్రభుత్వం పెట్టుబడిదారులను, సోలార్ ప్లాంట్ల నిర్మాణదారులను భయభ్రాంతులకు గురి చేసి రాష్ట్రం నుంచి తరిమి కొట్టిందని ధ్వజమెత్తారు. రాష్ట్ర అభివృద్ధికి సీఎం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం అనేక చర్యలు చేపట్టిందని వివరించారు. డీఎస్సీ ద్వారా త్వరలోనే 16 వేల టీచర్ పోస్టులను భర్తీ చేస్తామని తెలిపారు. అదేవిధంగా తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ పథకాలను త్వరలోనే అమలు చేస్తామని తెలిపారు. భవిష్యత్తు తరాలను దృష్టిలో పెట్టుకుని బాటలు వేసే నాయకుడే సీఎం చంద్రబాబు అని.. హత్యలు, అత్యాచారాలు చేసే వాళ్లు కూడా సీఎం చంద్రబాబును విమర్శించడం హాస్యాస్పదంగా ఉందని ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రి డోలా బాలవీరాంజనేయ స్వామి, కనిగిరి ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి, కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు, గిద్దలూరు ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, సీఎస్ విజయానంద్, ట్రాన్స్‌కో జేఎండీ కీర్తి చేకూరి, రిలయన్స్ సంస్థ ప్రతినిధులు పీఎంఎస్ ప్రసాద్, మాధవరావు, హరింద్ర కె.త్రిపాఠి, కూటమి నేతలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## కర్నూలు-విజయవాడ మధ్య విమాన సర్వీసులు

*- మంత్రి రామ్మోహన్‌ను కోరిన టి.జి భరత్*



ఢిల్లీ: కర్నూలు నుండి విజయవాడకు విమాన సర్వీసులు ప్రారంభించాలని పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడును కోరినట్లు రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టి.జి భరత్ తెలిపారు. ఢిల్లీలో కేంద్ర మంత్రిని కలిసి కర్నూలు – విజయవాడ విమాన సౌకర్యంపై చర్చించినట్లు పేర్కొన్నారు. ఈ విషయంపై సంబంధిత అధికారులతో సంప్రదింపులు జరుపుతున్నానని కేంద్ర మం త్రి తెలిపినట్లు చెప్పారు. త్వరలోనే దీనికి సంబంధించి అడుగులు పడే అవకాశం ఉం దని చెప్తారన్నారు. కర్నూలు – విజయవాడ విమాన సౌకర్యం కల్పించేందుకు కేంద్ర మంత్రి ఎంతో కృషి చేస్తున్నారని వివరించారు. ఓర్వకల్లు ఇండస్ట్రియల్ హబ్‌లో పరిశ్రమలను ఏర్పాటు చేసేందుకు తమ ప్రభుత్వం కృషి చేస్తుందని చెప్పారు. ఇక్కడ అన్ని రకాల పరిశ్రమలు పెట్టేందుకు అనుకూలమైన పరిస్థితులు ఉన్నాయని తెలిపారు. విమా న సర్వీసు కూడా అందుబాటులోకి వస్తే పారిశ్రామికవేత్తల రాకపోకలకు సౌకర్యంగా ఉంటుందని చెప్పారు.

## అండగా ఉంటాం.. అద్భుతాలు సృష్టించండి

*- క్రీడాకారులతో శాప్‌చైర్మన్ రవినాయుడు*

*- పతకాలు సాధించిన వారికి అభినందన*



విజయవాడ (చైతన్యరథం): రాష్ట్రంలోని క్రీడాకారులకు శాప్ అండగా ఉంటుందని, ఎవరూ అధైర్యపడకుండా అద్భుతాలు సృష్టించాలని శాప్ చైర్మన్ రవినాయుడు సూచించారు. విజయవాడ శాప్ కార్యాలయంలో పలువురు క్రీడాకారులు బుధవారం రవినాయుడును మర్యాదపూర్వకంగా కలిశారు. తొలుత విజయవాడకు చెందిన ఆర్టిస్టిక్ రోలర్ స్కేటర్ పి.చైత్రదీపిక కలిసి మార్చి 24 నుంచి 30 వరకూ జరిగిన తైవాన్ ఆర్టిస్టిక్ రోలర్ స్కేటింగ్ ఓపెన్ కాంపిటీషన్‌లో భాగంగా పెయిర్ స్కేటింగ్‌లో గోల్డ్ మెడల్, ఇన్‌లైన్‌లో బ్రాంజ్ మెడల్, కపుల్ డ్యాన్స్‌లో సిల్వర్ మెడల్ సాధించినట్లు వివరించారు. అనంతరం ఏఎంఎఫ్ అకాడమీకి చెందిన పారా స్పోర్ట్స్ క్రీడాకారులు, కడప జిల్లాకు చెందిన వాలీబాల్ క్రీడాకారిణి సరిత, హై స్కేటర్ వై.చందన, ఆర్టిస్టిక్ రోలర్ స్కేటర్ కైవల్య తదితరులు కలిసి సాధించిన పతకాల గురించి వివరించారు. వారిని రవినాయుడు అభినందిస్తూ క్రీడా పరంగా ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం ఉంటుందని, అందుకు అనుగుణంగా రాణించి రాష్ట్ర ఖ్యాతిని పెంచాలని సూచించారు.

## లీజుకు 933 ఎకరాల వక్ఫ్ భూములు

- అద్దె సవరణకు రెంట్ రివ్యూ కమిటీ
- ముస్లింలకు ఉచిత విద్యకు నూతన పథకం
- కమర్షియల్ భూముల అభివృద్ధికి చర్యలు
- ఏపీ వక్ఫ్‌బోర్డ్ చైర్మన్ షేక్ అబ్దుల్ అజీజ్
- ప్రవేశపెట్టిన అజెండాలపై ఏకగ్రీవ తీర్మానం



విజయవాడ (చైతన్యరథం): నగరంలోని కాళేశ్వరరావు మార్కెట్ దగ్గర ఏపీ వక్ఫ్ బోర్డ్ కార్యాలయంలో ఏపీ వక్ఫ్‌బోర్డ్ చైర్మన్ అబ్దుల్ అజీజ్ అధ్యక్షతన బుధవారం 3వ బోర్డ్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ప్రవేశ పెట్టిన అజెండాలపై ఏకగ్రీవ తీర్మా నం చేశారు. పలు మేనేజింగ్ కమిటీలు, పలు ముతవల్లీలను నియమించారు. ఈ సందర్భంగా అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ ముస్లింలకు ఉచిత విద్య అందించేందుకు నూతన పథకాన్ని ప్రారంభిస్తున్నామని, అతి త్వరలో వివరాలు తెలియజేస్తామని చెప్పారు. వక్ఫ్ ఆస్తుల అద్దెల సవరణకు రెంట్ రివ్యూ కమిటీని నియమించామని తెలిపారు. 2025-26 నుంచి 2027-28 సంవత్సరాలకు డైరెక్ట్ మేనేజ్‌మెంట్‌లో ఉన్న 933 ఎకరాల వక్ఫ్ ఆస్తులను లీజుకు ఇవ్వనున్నామని తెలిపారు. రాష్ట్రంలో వాణిజ్య ప్రయోజ నాలకు ఉపయోగపడే వక్ఫ్ భూములను అభివృద్ధి చేయడానికి జాతీయ, అంతర్జాతీయ స్థాయి డెవలపర్లు, సంస్థలు, పారిశ్రామిక వేత్తలను దీర్ఘకాలిక లీజు లేదా పబ్లిక్ – ప్రైవేట్ భాగస్వామ్యం (పీపీపీ) ద్వారా ఎక్స్‌ప్రెషన్ ఆఫ్ ఇంటరెస్ట్ కింద ఆహ్వానిస్తున్నామని తెలి పారు. ఈ భూములపై సౌర విద్యుత్ ప్రాజెక్టులు, పారిశ్రామిక సంస్థలు, వాణిజ్య కాంప్లె క్సులు, విద్యా సంస్థలు, ఆసుపత్రులు, ఇతర వాణిజ్య ప్రాజెక్టులు అభివృద్ధి చేసే అవ కాశం ఉందని వివరించారు. ఈ సమావేశంలో బోర్డ్ సభ్యులైన శాసనమండలి సభ్యులు మహమ్మద్ రుహుల్లా, ఎమ్మెల్యేలు మహమ్మద్ నసీర్, ఖాజా, అక్రమ్, ఇస్మాయిల్ బేగ్, ఆఫియా, ముక్రం హుస్సేన్, దావూద్ బాషా బఖావి, బేపారి జాకీర్ అహమ్మద్, సీఈఓ మొహమ్మద్ అలీ, వక్ఫ్ అధికారులు పాల్గొన్నారు.

చైతన్యరథం

# టీడీపీతోనే బీసీలకు సామాజిక న్యాయం

- యాదవులకు పదవుల్లో ప్రాధాన్యం ఇచ్చారు
- జగన్‌రెడ్డి మోసగించినందుకే గుణపాఠం
- వ్యవసాయ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు
- యాదవ కార్పొరేషన్ పాలకవర్గంతో ప్రమాణం
- పాల్గొన్న మంత్రులు మండిపల్లి, కొలుసు, సవిత



విజయవాడ(చైతన్యరథం): యాదవ కార్పొరేషన్ చైర్మన్ జి.నరసింహ యాదవ్, డైరెక్టర్లతో వ్యవసాయ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు బుధవారం ప్రమాణస్వీకారం చేయించారు. విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో మంత్రులు కొలుసు పార్థసారథి, రాంప్రసాద్‌రెడ్డి, సవితతో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు. అచ్చెన్నాయుడు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్, యువ నేత లోకేష్ ఆధ్వర్యంలో బలహీన వర్గాలకు పెద్దపీట వేస్తున్నారని తెలిపారు. యాదవ కార్పొరేషన్ చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేసిన నరసింహ యాదవ్ తనకు అత్యంత ఆప్తుడని, బలహీన వర్గాల కోసం కూటమి ప్రభుత్వ బ్రహ్మాండమైన కార్యక్రమాన్ని చేస్తుందని తెలిపారు. పసుపు చొక్కాతోనే కనిపిస్తారని, సీఎం చంద్రబాబుకు అత్యంత సన్నిహితుడని పేర్కొన్నారు. యాదవులకు, బీసీ వర్గాలకు మంచి అవకాశం ఇచ్చి పారిశ్రామికంగా తయారు చేసే విధంగా చర్యలు తీసుకుంటుందని తెలిపారు. రాజశేఖర్‌రెడ్డి, జగన్‌రెడ్డి ఆధ్వర్యంలో బలహీన వర్గాలకు ఒక్క పైసా కూడా ఇవ్వకుండా మోసం చేశారని, అందుకే ప్రజలు గొప్ప గుణపాఠం చెప్పారని తెలిపారు. ఎన్టీఆర్ పార్టీ స్థాపించిన తర్వాత బడుగు బలహీన వర్గాలకు పైకి తెచ్చారని వివరించారు. టీడీపీ 43 వసంతాలు పూర్తి చేసుకున్న సుదీర్ఘ ప్రయాణంలో బీసీ వర్గం పార్టీని ఎప్పుడూ అంటిపెట్టుకునే ఉందని గుర్తుచేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు న్యాయకత్వంలో బలహీన వర్గాలకు ప్రాధాన్యం ఇచ్చి సమస్యలను తెలుసుకుని న్యాయం చేసే విధంగా ప్రభుత్వం పనిచేస్తుందని వివరించారు. పదవు లు, నిధులు ఇచ్చి బలహీన వర్గాలకు న్యాయం చేకూరే విధంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని తెలిపారు.

**యాదవులను వ్యాపారులు చేస్తాం**

మంత్రి సవిత మాట్లాడుతూ యాదవులకు రాజకీయంగా, ఆర్థికంగా ఎదిగేలా చేసిం ది టీడీపీ మాత్రమేనని తెలిపారు. ప్రస్తుత కేబినెట్‌లో 8 మంది బీసీలను మంత్రులుగా సీఎం చంద్రబాబు అవకాశమి చ్చారని పేర్కొన్నారు. వారిలో సత్యకుమార్ యాదవ్, కొలుసు పార్థసారథి యాదవులేనని తెలిపారు. టీడీపీ రాష్ట్ర అధ్యక్ష బాధ్యతలు పల్లా శ్రీని వాస యాదవ్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా యాదవ సామాజిక వర్గానికి చెందిన విజయానంద్‌ను నియమించారని గుర్తుచేశారు. యాదవులకు గొర్రెలు, మేకలు, గోవుల యూనిట్లు అందజేయడానికి స్వయం ఉపాధి పథకాలు అమలు చేస్తున్నామన్నారు. యాదవులను వ్యాపారులుగా తీర్చిదిద్దే లక్ష్యంతో సీఎం చంద్రబాబు ప్రణాళికలు రూపొందించారన్నారు. ఊరిలోనే ఉండి పశువుల మేత ఆర్థికంగా లబ్ధి కలిగేలా పశుగ్రాసం సాగుతో పాటు పశువుల దాణా కూడా అందజేసేలా చర్యలు తీసుంటున్నట్లు వివరించారు. యాదవ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన నర్సింహా యాదవ్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

**చంద్రబాబుతోనే బీసీలకు న్యాయం**

మంత్రి పార్థసారథి మాట్లాడుతూ సీఎం చంద్రబాబుతోనే బీసీలకు న్యాయం జరుగుతుందని తెలిపారు. జగన్ ఐదేళ్ల పాలనలో వెనుకబడిన వర్గాలకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. కార్పొరేషన్ల పాలక వర్గాలకు నిధులు లేవు సరికదా కుర్చీలు కూడా సమకూర్చలేదన్నారు. బీసీలను కేవలం ఓటు బ్యాంకుగానే జగన్ చూశారని మండిపడ్డారు. మరో మంత్రి రాంప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ, టీడీపీలో కష్టపడే వారికి ప్రాధాన్యముంటుందని మరోసారి నిరూపితమైందన్నారు. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ టీడీపీకి బీసీలు ఎప్పుడూ బ్యాక్ బోన్‌గానే ఉంటారనారు. ఈ కార్యక్రమంలో కొనకళ్ల నారాయణరావు, వీరంకి గురుమూర్తి, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, సీనియర్ కూటమి నాయకులు, రాష్ట్రంలో వివిధ ప్రాంతాలకు చెందిన యాదవులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి షాపింగ్ కాంప్లెక్స్







- అక్రమార్కులకు అధికారుల సహకారం
- లంచాలు తీసుకొని పట్టించుకోవడం
- ప్రజావినతుల్లో కడప జిల్లా వాసి ఫిర్యాదు
- అర్జీలు స్వీకరించిన ఆలపాటి, స్వామినాయుడు

మంగళగిరి (చైతన్యరథం): వైసీపీ నేతలు ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి షాపింగ్ కాంప్లెక్స్ నిర్మిస్తుంటే అధికారులు వారిపై చర్యలు తీసుకోకుండా వారి వద్ద నుంచి లంచాలు తీసుకొని పట్టించుకోవడం లేదని కడప జిల్లా ఉప్పరపల్లి గ్రామానికి చెందిన పొట్ట శివప్రసాద్ ఫిర్యాదు చేశాడు. దీనిపై ఎంక్వైరీ వేసి ప్రభుత్వ స్థలంలో అక్రమ నిర్మా ణాలను తొలగించి అక్రమార్కులకు సహకరిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో బుధవారం నిర్వహించిన ప్రజా వినతుల స్వీకరణ కార్యక్రమంలో వినతిపత్రం అందజేశారు. ఎమ్మెల్సీ ఆలపాటి రాజా, అమలా పురం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ స్వామినాయుడు అర్జీలు స్వీకరించారు.



తమ భూములను ఆక్రమించుకుని అందులోకి వెళితే చంపేస్తామని కరెడ్ల గంగా ధర్, కరెడ్ల నీలిమ, తోట ఆదినారాయణ, సూరవరపు సూర్యనారాయణలు బెదిరిస్తు న్నారని తూర్పుగోదావరి జిల్లా గోపాలపురం మండలం చిట్యాల గ్రామానికి చెందిన ఆదిలక్ష్మి అనే మహిళ వాపోయింది. వారిపై చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయా లని వేడుకున్నారు.

శ్రీ అపరాజిత అగ్రి బయోటెక్ సంస్థ నుంచి ఉద్యానవన శాఖ వారికి 2019 -2020 మధ్య సమగ్ర సస్యరక్షణ ఉత్పత్తులను సరఫరా చేశామని.. దానికి సంబంధించిన బిల్లు రూ.18 లక్షలు నేటికీ ఇవ్వలేదని గుంటూరుకు చెందిన ఎం.శ్రీనివాస్ తెలిపారు. తమకు రావాల్సిన బకాయి డబ్బులు ఇప్పించాలని విజ్ఞప్తి చేశాడు.

గత 20 సంవత్సరాలుగా తాము విజయవాడలో సొంత ఇల్లు లేక అద్దె ఇంట్లో ఉంటున్నామని తమకు ఇల్లు మంజూరు చేసి ఆదుకోవాలని మాదురి అనే మహిళ అర్జీ ఇచ్చి అభ్యర్థించింది.

తన నానమ్మ తనకు 85 సెంట్ల భూమి రాసి ఇవ్వగా ఆన్‌లైన్‌లో తక్కువగా నమో దు చేసి చూపుతున్నారని, తప్పును సరిచేసి ఎక్కించాలని తూర్పుగోదావరి జిల్లా చాగల్లుకు చెందిన తాళ్లూరి శ్రీనివాస్ విజ్ఞప్తి చేశాడు.

తమ గ్రామంలో బందిలి బాలయ్య, బందిలి సురేష్, బందిలి కుమార్ అనే వ్యక్తు లు ప్రభుత్వ భూమిని ఆక్రమించి అంగన్‌వాడీ కేంద్రానికి దారి లేకుండా చేశారని తిరుప తి జిల్లా వరదయ్యపాలెం మండలం కంచరపాలెం గ్రామానికి చెందిన దశరథన్ ఫిర్యాదు చేశాడు. వారు ఆక్రమించుకున్న భూమిని విడిపించి అంగన్‌వాడీ కేంద్రానికి దారి ఏర్పాటు చేయాలని విన్నవించారు.

## ప్రేమోన్మాది దాడిలో మహిళ మృతి దురదృష్టకరం: డోలా

అమరావతి (చైతన్య రథం): విశాఖలో ప్రేమోన్మాది దాడిలో మహిళ మృతి, యువతి గాయపడిన ఘటన దురదృష్టకరమని రాష్ట్ర సాంఘిక సంక్షేమ మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అన్నారు. ఈమేరకు బుధవారం పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఘటన జరిగిన 3 గంటల్లోనే నిందితులను అరెస్టు చేశాం. మహిళల రక్షణపట్ల మా ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధికి ఇదే నిదర్శనమన్నారు. ఘటన జరిగిన వెంటనే విశాఖ జిల్లా ఇన్చార్జి మంత్రిగా తాను, హెూంమంత్రి సీపీతో మాట్లాడి చర్యలకు ఆదేశించామని పేర్కొన్నారు. ఘటనను సీఎం చంద్రబాబు స్వయంగా పర్యవేక్షిస్తున్నారని, దాడిలో గాయపడిన యువతికి కార్పొరేట్ హాస్పటల్లో మెరుగైన వైద్యం అందిస్తున్నామన్నారు.

చైతన్యరథం







# ఐదుగురు ఎమ్మెల్సీల ప్రమాణ స్వీకారం

అమరావతి (చైతన్యరథం): ఇటీవల రాష్ట్ర శాసన మండలికి ఎంపికైన ఐదుగురు శాసనమండలి సభ్యులు సోము వీర్రాజు, బీటి నాయుడు, కొణిదెల నాగేంద్రరావు (నాగబాబు) పేరాబత్తుల రాజశేఖర్, ఆలపాటి రాజేంద్రప్రసాద్‌లతో బుధవారం అసెంబ్లీ భవనంలోని చైర్మన్ చాంబర్‌లో శాసనమండలి అధ్యక్షుడు కొయ్యే మోషేన్‌రాజు ప్రమా ణం చేయించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మంత్రి కె.అచ్చన్నాయుడు, అసెంబ్లీ సెక్రటరీ జనరల్ సూర్యదేవర ప్రసన్నకుమార్, ఉప కార్యదర్శి రాజ్ కుమార్, ఇతర అధికారులు, పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# ప్రధాని మోదీ పర్యటనకు ఏర్పాట్లు

- పీ4 ప్రారంభ ప్రాంతంలోనే వేదిక
- సమగ్ర నివేదికను సిద్ధం చేయాలి
- అధిరానేలరే సీఎస్ విజయానంద్ ఆదేశం

అమరావతి(చైతన్యరథం): అమరావతి ప్రజా రాజధాని నిర్మాణ పనుల పున: ప్రారం భంతో పాటు పలు ఇతర అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలకు ఈ నెల లో ప్రధాని నరేంద్ర మోదీ అమరావతికి రానున్న నేపథ్యంలో అందుకు సంబంధించి చేయాల్సిన ఏర్పాట్లపై బుధవారం సచివాలయంలో అధికారులతో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ ప్రాథమిక సమీక్ష నిర్వహించారు. ప్రధాని పర్యటన ఖరారు కాగానే పూర్తిస్థాయిలో ఏర్పాట్లపై సమీక్షించడం జరుగుతుందని, ఈలోగా సంబంధిత శాఖల పరంగా చేయాల్సిన ఏర్పాట్లపై ఇప్పటి నుండే పూర్తిస్థాయిలో దృష్టి పెట్టాలని ఆదేశించారు. ఇటీవల పీ-4 కార్యక్రమాన్ని ప్రారంభించిన ప్రాంతంలోనే ప్రధాని పర్యట న కార్యక్రమం ఉండే విధంగా ఆ ప్రాంతాన్ని 50 ఎకరాలకు పైగా విస్తీర్ణంలో చదును చేయడంతో పాటు తగిన పార్కింగ్ తదితర ఏర్పాట్లు చేయాల్సి ఉందని, ఆ దిశగా ఇప్ప టి



నుండే తగిన కసరత్తు మొదలు పెట్టాలని సూచించారు. డీజీపీ, సీఆర్‌డీఏ అధికారు లు, గుంటూరు జిల్లా కలెక్టర్, ఎస్పీ, వైద్య ఆరోగ్య శాఖ కమిషనర్ వీర పాండియన్ తదితర అధికారులు వెంటనే ఆ ప్రాంతాన్ని సందర్శించి ఒక సమగ్ర నివేదికను సిద్ధం చేయాలని ఆదేశించారు. అంతేగాక గతంలో రాష్ట్రంలో ప్రధానమంత్రి పర్యటనలో చురుగ్గా పనిచేసిన అధికారుల సేవలను పూర్తిస్థాయిలో వినియోగించేందుకు ఆయా అధి కారుల జాబితాను సిద్ధం చేయాలని ఆదేశించారు. ప్రస్తుత వేసవి దృష్ట్యా కార్యక్రమానికి వచ్చే వీవీఐపీలు, వీఐపీలు, ప్రజలు తదితరులు అందరికీ తగిన పూర్తి వసతులు కల్పించే విధంగా ఏర్పాట్లు చేయాల్సి ఉందని చెప్పారు. ప్రధాని పర్యటన ఖరారు కాగానే పూర్తి స్థాయిలో మరొకసారి శాఖల వారీ ఏర్పాట్లపై సమీక్షించడం జరుగుతుందని తెలిపారు. సాధారణ పరిపాలన శాఖ ముఖ్యకార్యదర్శి ముకేశ్‌కుమార్ మీనా మాట్లాడుతూ గతంలో అమరావతి రాజధాని నిర్మాణానికి శంకుస్థా పన చేసేందుకు ప్రధానమంత్రి వచ్చినపుడు వివిధ పనుల నిర్వహణ, పర్యవేక్షణకు అధికారులు, మంత్రులు తదితరులతో పలు కమిటీలను ఏర్పాటు చేయడం జరిగిందని, ఇప్పుడు కూడా కమిటీలు వేయాల్సి ఉందని చెప్పారు. ఈ సమీక్షలో మున్సిపల్ పరిపాలన శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్.సురేష్‌కుమా ర్, సీఆర్‌డీఏ కమిషనర్ కె.కన్నబాబు, ఐజీ ఎస్పీఎఫ్ హాఫీజ్ అరీఫ్, సీఆర్‌డీఏ అదనపు కమిషనర్లు ప్రవీణ్‌చంద్, నవీన్, వైద్య ఆరోగ్యశాఖ కమిషనర్ వీరపాండియన్, వర్చువల్ గా డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా, ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు, ఎన్టీఆర్, గుంటూ రు జిల్లాల కలెక్టర్లు లక్ష్మీష, నాగలక్ష్మి, ఎస్పీ, తదితర అధికారులు పాల్గొన్నారు.

# ఇంటి వద్దే 47 రకాల డయాగ్నోస్టిక్ పరీక్షలు

- దేశంలో తొలిసారిగా రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం
- 108, 104 సేవలకు కొత్త సర్వీస్ ప్రొవైడర్
- ప్రజారోగ్య పరిరక్షణకు వినూత్న నిర్ణయం



అమరావతి (చైతన్యరథం): ఇప్పటివరకూ సమస్యాత్మకంగా కొనసాగుతున్న 104, 108 సేవలకు జవసత్వాలు కల్పించి ప్రజలకు మెరుగైన సేవలు అందించడానికి కూట మి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఈ సేవలు అందిస్తున్న ప్రస్తుత సర్వీస్ ప్రొవైడర్ స్థానం లో ప్రభుత్వం కొత్త ఏజెన్సీని గుర్తించింది. ఈ ప్రక్రియలో భాగంగా దేశంలో ఎక్కడాలేని విధంగా ప్రజల ఆరోగ్య స్థితి నిర్ధారణకు 47 రకాల డయాగ్నోస్టిక్ పరీక్షలను 104 వాహ నాల ద్వారా ఇళ్లల్లోనే పరీక్షలు చేపట్టేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఎంఎస్ భవ్య హెల్త్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ సారథ్యంలో ఎంఎస్ఎస్ఆర్ఐటీ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌ను భాగస్వామిగా ఉన్న కన్సార్టియంను ఇకనుంచి ఈ సేవలను అందించే ఏజెన్సీగా టెండరు ప్రక్రియ ద్వారా ప్రభుత్వం గుర్తించింది. రాష్ట్ర ప్రజల వ్యక్తిగత ఆరోగ్య స్థాయి వివరణాత్మక ప్రొఫైలింగ్ ద్వారా ఎలక్ట్రానిక్ హెల్త్ రికార్డులు (ఈహెచ్ఆర్) రూపొందించడానికి ఈ పరీక్షలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీని ద్వారా రాష్ట్రంలో ప్రస్తుత, భవిష్యత్ వ్యాధుల భారాన్ని అంచనా వేయడం వీలవుతుంది. తద్వా రా అవసరాలకనుగుణంగా ప్రభుత్వం తగు చర్యలు చేపట్టడానికి మార్గం ఏర్పడుతుంది. ప్రస్తుతం 104 అంబులెన్స్‌ల ద్వారా కేవలం మధుమేహం, బీపీ వ్యాధులను గుర్తించడా నికి మాత్రమే 'ర్యాపిడ్ కిట్' పరీక్షలు చేస్తున్నారు. దీనికి భిన్నంగా నూతన విధానంలో నిర్దిష్ట ఫలితాలనిచ్చే 47 రకాల పరీక్షలు చేయడం జరుగుతుంది. బ్లడ్ గ్లూకోజ్ టెస్ట్, కంప్లీట్ బ్లడ్ పిక్చర్, రీజనల్ ఫంక్షన్ టెస్ట్‌లు, లివర్ ఫంక్షన్ టెస్ట్‌లు, కంప్లీట్ లిపిడ్ ప్రొఫైల్, యూరిన్ అనాలిసిస్, ఆర్టీరియల్ బ్లడ్ గ్యాస్‌లకు సంబంధించి 20 పరీక్షలు లబ్ధిదారులకు చేయడం జరుగుతుంది. నిర్దిష్ట వ్యాధులకు సంబంధించి మరో 27 పరీక్ష లు చేస్తారు. కొత్తగా ఈ సేవల బాధ్యతలను స్వీకరించనున్న సర్వీస్ ప్రొవైడర్ సాధారణ 20 పరీక్షలు ఒక్కొక్కరికి రూ.195 ఖర్చుతో చేయడానికి అంగీకరించింది. అంతేకాక ఇతర వ్యాధి పరీక్షలకు కూడా మార్కెట్ రేట్లతో పోలిస్తే సహేతుకమైన ఛార్జీలను ప్రతిపా దించారు. ప్రతి 104 వాహనం ద్వారా రోజుకు దాదాపు 35 మందిని పరీక్షిస్తారు. ఈ కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా విస్తరించే ముందు మొబైల్ మెడికల్ యూనిట్ల డేటా యొక్క విశ్వసనీయతను తనిఖీ చేసేందుకు ఈ నిర్ధారణ పరీక్షలు పైలెట్ ప్రాతిపదికన ప్రభుత్వం చేపడుతుంది. ఈ పరీక్షలు నిర్వహించడానికి కొత్త ఏజెన్సీ ఆయా పరికరాలు ప్రతి 104 వాహనంలో సెమీ-ఆటోమేటిక్ బయోకెమిస్ట్రీ ఎనలైజర్, సీబీసీ మెషిన్ 3 పార్ట్ ఎనలైజర్, మైక్రోస్కోప్, ఇంక్యుబేటర్ వంటి పరికరాలను ఏర్పాటు చేస్తారు. ప్రతి వాహనంలో ఒక ల్యాబ్ టెక్నీషియన్‌ను కూడా ఉంటారు. 108, 104 సేవలతో పాటు అత్యవసర ప్రతిస్పందన కేంద్రాన్ని (ఎమర్జెన్సీ రెస్పాన్స్ సెంటర్) నిర్వహించడానికి ప్రభుత్వం ప్రస్తుతం నెలకు రూ.28 కోట్లు చెల్లిస్తోంది. కొత్త టెండర్ కింద ఈ ఖర్చు నెలకు రూ.31 కోట్లకు చేరుతుంది. ఇది టెండర్ ధరలో కేవలం 11 శాతం లోపు మాత్ర మే పెరుగుదల ఉంటుంది. ఈ పెరుగుదలకు ప్రధాన కారణం ప్రధానంగా కొత్త ఏజెన్సీ 190 కొత్త 108 వాహనాలను కొని ఏర్పాటు చేయడమే. మొత్తం మీద 731 వాహనాలు 108 సేవలు అందిస్తాయి. సేవల ధర స్వల్పంగా పెరగడానికి పెరిగిన ఇంధన ధరలు, సిబ్బందికి వేతనాలు కూడా కొంతమేరకు కారణం. 2020 సంవత్సరంలో ప్రస్తుతం అమలులో ఉన్న టెండర్ ఖరారు చేసినప్పుడు డీజిల్ ధర లీటరుకు రూ.70 మాత్రమే ఉండగా ఇప్పుడది లీటరుకు రూ.97.47లకు పెరిగింది. 108 అంబులెన్స్‌ల డ్రైవర్లకు నెలకు రూ.2,000 అదనంగా చెల్లించాలని ప్రభుత్వం నిర్ణ యించిం ది. ద్రవ్యోల్బణంతో పాటు పెరిగిన పరికరాల ధరలు, వాహనాల నిర్వహణా ఖర్చులు కూడా ఇతర కారణాలు. 108 సేవలకు సంబంధించి సర్వీస్ ప్రొవైడర్‌కు రెండు కొత్త షరతులు పెట్టా రు. ఇందులో ఒకటి కాల్ వచ్చినప్పటి నుంచి రోగిని ఒక గంటలోపు ఆసుపత్రికి తీసు ెకళ్లాలి. దీనిని 'గోల్డెన్ అవర్' అని అంటారు. రెండోది ఎటువంటి అత్యవసర కాల్స్ స్వీకరించకుండా ఉండకూడదు. ఈ సేవలు అందిస్తున్న ప్రస్తుత సంస్థ రోజుకు దాదాపు 200 ఎమెర్జెన్సీ కాల్స్‌ను నిర్లక్ష్యం చేసిన నేపథ్యంలో ఈ షరతులు పొందుపర్చారు.

# పెనుగొండ, మొగల్తూరులో చెత్త సమస్యకు పరిష్కారం

- రెండు గ్రామాల్లో తొలగింపు ప్రక్రియకు శ్రీకారం
- పారిశుధ్య పరిరక్షణ, చెత్త నిర్వహణకు ప్రణాళికలు
- నిర్వహణ కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదనలు
- సమస్యలపై ప్రత్యేకంగా దృష్టి సారించిన ప్రభుత్వం
- చెత్తతో సంపద సృష్టి దిశగా అడుగులు

అమరావతి (చైతన్యరథం): ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ దృఢ సంకల్పంతో మొగల్తూరు, పెనుగొండ గ్రామాలలో సమస్యలు పరిష్కారానికి అడుగులు పడుతున్నా యి. గత నెల 28న ఆ గ్రామాల్లో చేపట్టిన గ్రామ అభివృద్ధి సభల్లో అధికారుల దృష్టికి వచ్చిన సమస్యలు పవన్‌కళ్యాణ్ చొరవతో యుద్ధప్రాతిపదికన పరిష్కారం అవుతున్నాయి. ఇప్పటికే పాఠశాలల అభివృద్ధికి నిధులు పెనుగొండ హైస్కూల్‌కు రూ.2.05 కోట్లు, మొగల్తూరు హైస్కూల్‌కు రూ.1.71 కోట్లు మంజూరు కాగా ఇప్పుడు పారిశుధ్యంపై దృష్టి సారించారు. గ్రామాల అభివృద్ధి సభల్లో... ఏళ్ల తరబడి గ్రామాల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించాలని గ్రామస్తులు ఉప ముఖ్యమంత్రి పేషీ అధికారులను కోరారు. మొగల్తూరు, పెనుగొండ గ్రామాల అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకున్న పవన్‌కళ్యాణ్ సమస్యను గ్రామీణాభివృద్ధి శాఖతో పాటు కాలుష్య నియంత్రణ మండలి దృష్టికి తీసుకువెళ్లారు. చెత్త నిల్వ సమస్యను పరిష్కరించి ఆయా ప్రాంతాల్లో పారిశు ధ్యంతో పాటు సుందరీకరణ పనులు చేపట్టే విధంగా ఆదేశాలు జారీ చేశారు. దాంతో సంబంధి త అధికారులు తక్షణం చర్యలకు పూనుకు న్నారు. పెనుగొండ గ్రామ పంచాయతీలో గత తొమ్మిదేళ్లుగా 200 మెట్రిక్ టన్నుల చెత్త పేరుకుపోయింది. దీనిని రీ సైక్లింగ్ కేంద్రాలకు తరిలించే చర్యలు ప్రారంభించారు. చెత్త తొలగిస్తున్న ప్రదేశంలో భవిష్యత్తులో పారిశుధ్యం నిర్వహణతో పాటు పచ్చదనాన్ని అభివృద్ధి చేసే దిశగా ప్రణాళికలు సిద్ధం చేసింది. మొగల్తూరు గ్రామపంచాయతీలో గత 10 సంవత్సరాల్లో 400 మెట్రిక్ టన్నుల చెత్త పేరుకుపోయింది. ఈ చెత్తను సంపద సృష్టి కేంద్రాలకు తరలింపు ప్రక్రియ ప్రారంభించారు. భవిష్యత్తులో చెత్త నిర్వహణ ప్రక్రియలో ఇబ్బందులు కలగకుండా గ్రామంలో పారిశుధ్య పరిరక్షణ, చెత్త నిర్వహణకు ప్రణాళిక లకు రూపకల్పన చేస్తున్నారు. ప్రత్యేకంగా ప్రభుత్వం నుంచి భూమి కేటాయించి శాశ్వత చెత్త నిర్వహణ కేంద్రాలు పక్కాగా ఏర్పాటు చేయాలని గ్రామ అభివృద్ధి సభల్లో ప్రతిపా దించారు. ఉపముఖ్యమంత్రి గారి ఆదేశాల మేరకు మొగల్తూరు, పెనుగొండ గ్రామాల్లో చెత్త సమస్య పరిష్కారంతో పాటు ఆరోగ్యకరమైన వాతావరణం సృష్టించే దిశగా నిరంత రాయంగా చర్యలు కొనసాగించేందుకు ఆయా గ్రామ పంచాయతీలు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాయి.

## మంగళగిరి నియోజకవర్గంలో

# దశాబ్ధాల సమస్యకు 10 నెలల్లో పరిష్కారం

- యువనేత చొరవతో 3 వేల మందికి శాశ్వత పట్టాలు
- నేడు ఉండవల్లిలో తొలి పట్టా ఇవ్వనున్న నారా లోకేష్
- మొదటి విడతలో ప్రభుత్వ స్థలాల్లో నివసిస్తున్న వారికి మేలు
- ఆయన సాయాన్ని జీవితాంతం మర్చిపోమంటున్న లబ్ధిదారులు

అమరావతి (చైతన్యరథం): దశాబ్ధాలుగా మంగళగిరి నియోజకవర్గ ప్రజలు ఎదు ర్కొంటున్న ఒక జఠిల సమస్యకు 10 నెలల్లోనే పరిష్కారం చూపారు మంత్రి నారా లోకే ష్. తాను మాటల మనిషిని కాదు.. చేతల మనిషినని నిరూపించుకుంటున్నారు. తొలి విడతలో 3 వేల మందికి శాశ్వత హక్కు పత్రాలను అందించబోతున్నారు. మంగళగిరి నియోజకవర్గంలో వేలాదిమంది ప్రజలు దశాబ్ధాలుగా ప్రభుత్వ స్థలాల్లో చిన్న ఇళ్లు నిర్మించుకుని నివాసం ఉంటున్నారు. వీరంతా రెక్కాడితేగానీ డొక్కాడని పేద కుటుంబా లకు చెందినవారు. కాయకష్టం చేసుకుని ఇళ్లు నిర్మించుకున్నప్పటికీ పట్టాలు లేకపోవ డంతో వారికి ఎటువంటి అధికారిక హక్కులు లేవు. తమకు పట్టాలు ఇప్పించాలని ఏళ్ల తరబడి ప్రజాప్రతినిధుల చుట్టూ తిరిగినా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. ఎన్నికల సమయంలో ప్రజలు తాము ఎదుర్కొంటున్న సమస్యను యువనేత లోకేష్ దృష్టికి తెచ్చారు. తాము ఉంటున్న స్థలాలకు శాశ్వత హక్కు కల్పించాలని విన్నవించారు. అధికారంలోకి వచ్చిన వెంటనే సమస్యకు పరిష్కారం చూపుతానని ఆనాడు హామీ ఇచ్చా రు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మరు క్షణం నుంచే ఇచ్చిన హామీ అమలు కోసం మంత్రి లోకేష్ కార్యాచరణ ప్రారంభించారు.

### సమస్య పరిష్కారానికి లోకేష్ నిరంతర చర్చలు

గత పదినెలలుగా అటవీ, రెవెన్యూ, ఇరిగేషన్, రైల్వే శాఖల అధికారులతో మంత్రి లోకేష్ నిరంతరం చర్చలు జరిపారు. ఢిల్లీ పర్యటనకు వెళ్లినపుడు సైతం రైల్వేశాఖ మంత్రి అశ్వనీవైష్టవ్, ఇతర రైల్వే అధికారులతో మాట్లాడి తమ నియోజకవర్గంలో నిరుపయోగంగా ఉన్న రైల్వే భూములను పేదలకు ఇవ్వాల్సిందిగా పదేపదే విజ్ఞాపనలు చేస్తూ వచ్చారు. ఇతర శాఖల నిబంధనల మేరకు భూమికి భూమి ఇస్తామని, పేదలు దీర్ఘకాలంగా నివసిస్తున్న స్థలాలను వారికి ఇవ్వాలని ఉత్తర ప్రత్యుత్తరాలు జరిపారు. మంత్రి లోకేష్ చొరవతో దీర్ఘకాలంగా పేదలు ఎదుర్కొంటున్న మొండి సమస్యకు తొలిదశ పరిష్కారం లభించింది. ఏప్రిల్ 3న మొదటి పట్టాను ఉండవల్లి గ్రామంలో ఉదయం 10.59 గంటలకు అందజేయనున్నారు. నారా లోకేష్ స్వయంగా లబ్ధిదారుల నివాసానికి వెళ్లి పట్టా అందజేసి మన ఇల్లు - మన లోకేష్ కార్యక్రమాన్ని ప్రారంభించ నున్నారు. ఏప్రిల్ 4 నుంచి మంగళగిరి డాన్ బాస్కో స్కూల్‌ను అనుకుని ఉన్న ఖాళీ స్థలంలో ఏర్పాటు చేస్తున్న వేదికపై లబ్ధిదారులకు నారా లోకేష్ ఇళ్ల పట్టాలు అందజే యనున్నారు. ఏప్రిల్ 4న యర్రబాలెం, నీరుకొండ, కాజా గ్రామాలకు చెందిన లబ్ధిదారు లకు నారా లోకేష్ పట్టాలు అందజేయనున్నారు. ఏప్రిల్ 7న పెనుమాక, ఉండవల్లి, ఇప్ప టం, కొలనుకొండ, పద్మశాలి బజార్ ప్రాంతాలకు చెందిన లబ్ధిదారులకు పట్టాలు అం దజేస్తారు, ఏప్రిల్ 8న రత్నాల చెరువు, మహానాడు-2కు చెందిన లబ్ధిదారులకు పట్టాలు అందజేస్తారు, ఏప్రిల్ 11న సీతానగరం, సలాం సెంటర్, డ్రైవర్స్ కాలనీకు చెందిన లబ్ధిదారులకు, ఏప్రిల్ 12న మహానాడు-1, ఉండవల్లి సెంటర్ ప్రాంతాలకు చెందిన లబ్ధిదారులకు లోకేష్ పట్టాలు అందజేయనున్నారు. గతంలో ఎప్పుడు ఎవరి ఇళ్లపైకి ఎక్స్‌కవేటర్లను పంపుతారో తెలియక తీవ్ర భయాందోళనలతో బిక్కుబిక్కుమంటూ కాలం గడిపిన మంగళగిరి ప్రజలు ఇప్పుడు స్వేచ్ఛావాయువులు పీల్చుకుంటున్నారు. దీర్ఘకాలిక మొండి సమస్యకు పరిష్కారం చూపడమేగాక శాశ్వత హక్కు సైతం కల్పిస్తుండటంతో ఆనందంతో పొంగిపోతున్నారు. తమ కోసం ప్రత్యేక శ్రద్ధవహిస్తున్న లోకేష్ తమ శాసన సభ్యుడిగా రావడం అదృష్టంగా భావిస్తున్నారు.

### లోకేష్ సాయాన్ని జీవితాంతం గుర్తుంచుకుంటాం

**- రాజమండ్రి గోవిందు, అమరారెడ్డినగర్/ఉండవల్లి**

రాజమండ్రి గోవిందు, సీతామహాలక్ష్మి అనే దంపతులు ఇద్దరు బిడ్డలతో ఉండవల్లిలో నివాసం ఉంటున్నారు. 15 ఏళ్ల క్రితం ఉండవల్లి అమరారెడ్డినగర్‌లోని కొండ పోరం బోకు స్థలంలో ఇల్లు నిర్మించుకున్నారు.




రజక కులానికి చెందిన గోవిందు డ్రైవర్‌గా పనిచేస్తుండగా, భార్య సీతామహాలక్ష్మి దుస్తులు ఉతకడం, ఇస్త్రీ పనిచేసి బిడ్డలను పోషిం చుకుంటున్నారు. తాము ఉంటున్న స్థలానికి పట్టా ఇప్పించాలని గతంలో ఎందరో ప్రజా ప్రతినిధుల చుట్టూ తిరిగినా ప్రయోజనం లేకుండా పోయింది. మంత్రి లోకేష్ గురువారం గోవిందు, సీతామహాలక్ష్మిల ఇంటికి వెళ్లి వారికి శాశ్వత హక్కు పత్రం అందించ నున్నారు. విషయం తెలుసుకున్న గోవిందు కుటుంబం ఆనందంతో పొంగిపోతోంది. రాజమండ్రి గోవిందు మాట్లాడుతూ లోకేష్ చేస్తున్న ఈ సాయాన్ని మేం జీవితంలో మర్చి పోలేం. ఏళ్ల తరబడి మేం ఎదుర్కొంటన్న కష్టాన్ని గుర్తించి కుటుంబసభ్యుడి మాదిరిగా సమస్య పరిష్కరించి మేం ఉంటున్న స్థలంపై హక్కు కల్పిస్తున్నారు. ఆయనకు జీవితాం తం రుణపడి ఉంటాం. గతంలో ఎంతమంది చుట్టూ తిరిగినా పట్టించుకోలేదని చెప్పారు.

# మీ సహకారం కొనసాగాలి

***శరవేగంగా అమరావతి నిర్మాణానికి ప్రభుత్వం రెడీ - సింగపూర్ ప్రతినిధుల బృందంతో భేటీలో సీఎస్***




అమరావతి (చైతన్య రథం): అమరావతి రాజధాని నిర్మాణానికి సంబంధించి గతంలో మాదిరిగానే సింగపూర్ ప్రభుత్వం ఏపీ ప్రభుత్వానికి పూర్తి సహాయ సహకారాలను అందించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె విజయానంద్ విజ్ఞప్తి చేశారు. ఈమేరకు సింగపూర్ ప్రతినిధుల బృందంతో బుధవారం రాష్ట్ర సచివాలయంలో సిఆర్డిఏ, మున్సిపల్ శాఖ అధికారులతో కలిసి సమావేశమై పలు అంశాలను చర్చించారు. 2014-2019లో అమరావతి ప్రజా రాజధాని నిర్మాణానికి సింగపూర్ ప్రభుత్వం ఒక కీలక భాగస్వామిగా ఉందని.. అదే స్థితిని ప్రస్తుతం కొనసాగించాలని ఆకాంక్షించారు. ఈ ప్రభుత్వం తిరిగి అధికారానికి వచ్చిన రోజునుండే అమరావతి రాజధాని నిర్మాణంపై ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. ఇప్పటికే అమరావతి రాజధానికి సంబంధించి కేంద్ర నిధులతోపాటు ప్రపంచ బ్యాంకు, హడ్కో, ఏడీబీ వంటి సంస్థలతో పెద్దఎత్తున నిధులు సమన్వయం చేసిందని.. నిధులకు ఎలాంటి సమస్య లేదని పేర్కొన్నారు. ఈనెలలో ప్రధాని నరేంద్ర మోడి అమరావతి రాజధాని నిర్మాణ పనులను పున:ప్రారంభించేందుకు రానున్నారని సిఎస్ తెలిపారు. గతంలో మాదిరే సింగపూర్ ప్రభుత్వం పూర్తిగా సహకరించేందుకు కృషి చేయాలని కోరారు. గురువారం రాష్ట్ర ముఖ్యమంత్రితో సమావేశం ఉన్నందున అన్ని అంశాలపై మరింత స్పష్టత వస్తుందని సిఎస్ విజయానంద్ చెప్పారు.

రాష్ట్ర మున్సిపల్ పరిపాలన శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్ సురేశ్‌కుమార్ మాట్లాడుతూ అమరావతి రాజధానిని శరవేగంగా పూర్తి చేసేందుకు ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉందన్నారు. అమరావతి మాస్టర్ ప్రణాళికను గతంలోనే సిద్ధం చేయడం జరిగిందని గుర్తు చేశారు. అమరావతి రాజధానిని ప్రపంచంలోనే ఒక ఉత్తమ సస్టెయినబుల్ అండ్ అత్యంత లివబుల్ సిటీగా నిర్మించేందుకు అన్ని ప్రయత్నాలు జరుగుతున్నట్టు తెలిపారు.

అంతకుముందు ఏపీ సిఆర్డిఏ కమీషనర్ కె కన్నబాబు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ చేస్తూ 217 చ.కి.మీల విస్తీర్ణంతో అమరావతి ప్రజా రాజధానిని నిర్మించేందుకు ఈ ప్రభుత్వం తిరిగి శరవేగంగా అడుగులు వేస్తోందని చెప్పారు. దానిలో భాగంగానే అమరావతి గవర్నమెంట్ కాంప్లెక్సు, పలు ట్రంక్ రోడ్ల నిర్మాణం, ఇతర నిర్మాణాలు, సౌకర్యాల కల్పనకు సంబంధించిన పనులకు పెద్దఎత్తున నిధులు సమీకరించి పనులు చేపట్టేందుకు టెండర్లు కూడా పిలిచామన్నారు. ఈనెలలోనే ప్రధానమంత్రి సుమారు లక్ష కోట్ల పనుల పున:ప్రారంభం, పనులు శంఖుస్థాపనలు, ప్రారంభోత్సవాలకు శ్రీకారం చుట్టనున్నారని వివరించారు. ఇంకా పలు అంశాలకు సంబంధించి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను సింగపూర్ ప్రతినిధి బృందం దృష్టికి తెచ్చారు.

సింగపూర్ ప్రభుత్వ ప్రతినిధి డా.ఫ్రాన్సిస్ చోంగ్ మాట్లాడుతూ గతంలో మాదిరిగానే అమరావతి రాజధాని నిర్మాణానికి సంబంధించిన భాగస్వామ్యాన్ని తిరిగి పునరుద్ధరించేందుకు ఏపీ ప్రభుత్వంతో కలిసి పని చేసేందుకు అన్నివిధాలా కృషి చేయనున్నట్టు తెలిపారు. ఈ సమావేశంలో అమరావతి డెవలప్మెంట్ కార్పొరేషన్ లిమిడెట్ సిఎండి లక్ష్మీ పార్థసారథి, సిఆర్డిఏ అదనపు కమీషనర్లు ప్రవీణ్ చంద్, నవీన్, సింగపూర్ ప్రతినిధులు ఆడ్రే టాన్, డా.ఎలీజా ఆంగ్, నాజ్నీ బేగం, వివేక్ రఘురామన్, డేన్నై టాన్, వైష్టవి వాసుదేవన్ తదితరులు పాల్గొన్నారు.

## నేటి నుంచి రాయలసీమలో ఉరుములతో వర్షాలు




అమరావతి (చైతన్యరథం): హైదరాబాద్-బెంగళూరు కారిడార్ వెంబడి ఏర్పడిన గాలుల కలయిక మండలం (విండ్ కన్వర్జెన్స్ జోన్) కారణంగా రాయలసీమ ప్రాంతంలో ఏప్రిల్ 3న రాత్రి, 4వ తేదీన తీవ్ర ఉరుములతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉంది. గరిష్ఠ వేసవి ప్రారం భమైనప్పుడు భూఉష్ణత-తేమ పరస్పర చర్యల కారణంగా ఉరుములతో కూడిన వర్షాలు అధికంగా ఏర్పడతాయి. ఏప్రిల్ 3 నుంచి 5 మధ్య కాలం వానలకు అనుకూలంగా ఉండే అవకాశం ఉంది. ముఖ్యంగా ఏప్రిల్ 3 రాత్రి, ఏప్రిల్ 4 ఉదయం అనంతపురం, కర్నూలు, నంద్యాల, వైఎస్ఆర్ కడప, అన్నమయ్య, చిత్తూరు జిల్లాల్లో భారీ ఉరుములతో కూడిన వర్షాలు కురిసే అవకాశముంది. ప్రారంభ దశలో విస్తృతంగా వర్షపాతం చోటు చేసుకునే అవకాశం ఉండగా ఏప్రిల్ 4, ఏప్రిల్ 5న రాత్రి స్థానికంగా కొద్దిపాటి వర్షాలు కురిసే అవకాశం ఉంది.

### ఇతర ప్రాంతాల్లో వర్షపాతం వివరాలు

అల్లూరి సీతారామరాజు జిల్లా (పడేరు - అరకు వ్యాలీ)లో గురువారం నుంచి రోజు వారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. విశాఖపట్నం పరిసర ప్రాంతాలు, అనకాపల్లి, విజయనగరం జిల్లాల్లో ఏప్రిల్ 4, 5 సాయంత్రం/రాత్రి వర్షం పడే అవకాశం ఉంది. విశాఖపట్నం నగరంలో భారీ వర్షం నమోదు అయ్యే అవకాశం తక్కువ ఉంది. తిరుపతి, నెల్లూరు, ప్రకాశం, గుంటూరు, ఎన్‌టిఆర్ (విజయవాడ), ఏలూరు, కాకినాడ, పల్నాడు జిల్లాల్లో ఏప్రిల్ 4, 5 తేదీల్లో అక్కడక్కడ ఉరుములతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉంది. ప్రజలు అప్రమత్తంగా ఉండి అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందని వాతావరణ కేంద్రం హెచ్చరించింది.

# ప్రజా దర్బార్‌లో వినతులు స్వీకరించిన మంత్రి కొండపల్లి



విజయనగరం (చైతన్యరథం): గజపతినగరంలో బుధవారం మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ప్రజా దర్బార్ నిర్వహించి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ప్రజా సమస్యలను పరిష్కరించడానికి అధికారులు, ఉద్యోగులు చొరవ చూపాలని వాటికి పరిష్కారం చూపించాలని ఆయన కోరారు. టీడీపీలో కష్టపడి పని చేసే నాయకులు కార్యకర్తలకు గుర్తింపు ఉంటుందని ఆయన చెప్పారు. విజయనగరంలో తన కార్యాలయంలో ఎమ్మెల్యే అదితి గజపతిరాజు ప్రజాదర్బార్ నిర్వహించి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ప్రజల నుంచి సమస్యలను విన్న ఆమె పరిష్కారం చూపిస్తామని వారికి హామీ ఇచ్చారు.

# నక్కపల్లిలో వారంసంతలో అగ్నిప్రమాదం



నక్కపల్లి (చైతన్యరథం): అనకాపల్లి జిల్లా నక్కపల్లిలో వారం సంతలో భారీ అగ్నిప్రమాదం సంభవించింది. ఈ ఘటన నక్కపల్లిలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. అక్కడ ఉన్న పాక దుకాణాలకు ప్రమాదవశాత్తు నిప్పు అంటుకుంది. దీంతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దాదాపు 50దుకాణాలు దగ్ధం అయ్యాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని మంటలను అదుపు చేశాయి. ఆస్తి నష్టం రూ.50 లక్షల పైగా ఉంటుందని సమాచారం.

# ఎయిమ్స్ అభివృద్ధికై పెమ్మసాని అడుగులు

- ఆస్పత్రి మౌలిక సదుపాయాలను పెంచాలి
- 1,054 పోస్టులను మంజూరు చేయాలి
- కేంద్ర మంత్రి నిర్మల సీతారామన్‌కు వివరించిన పెమ్మసాని



గుంటూరు/ ఢిల్లీ (చైతన్యరథం): ఆచరణలో మెలకువ, మాటకు కట్టుబడే నిబద్ధత కలిగిన కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని తన నెక్స్ట్ డెవలప్మెంట్ టార్గెట్‌ను ఆల్ ఇండియా ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ అండ్ సైన్సెస్ (ఎయిమ్స్) వైపు గురిపెట్టారు. ఆర్‌ఓబి, రహదారులు, గుంటూరు ఛానల్ వంటి అభివృద్ధి కార్యక్రమాలను నెలల వ్యవధిలోనే గుంటూరుకు సాధించుకు వచ్చిన ఆయన ఇప్పుడు తన లక్ష్యాన్ని ఎయిమ్స్ హాస్పిటల్ అభివృద్ధి వైపు మళ్ళించారు. ఎయిమ్స్ సామర్థ్యాన్ని పెంచే విధంగా 1,054 పోస్టులను భర్తీ చేయడంతో పాటు పలు మౌలిక సదుపాయాల కల్పనను కోరుతూ కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్‌ని గ్రామీణ అభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖ కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ బుధవారం ఢిల్లీ కార్యాలయంలో కలిసి వివరించారు. ప్రతిపాదనలను సావధానంగా ఆలకించిన తరువాత ఆమె సుముఖంగా స్పందించారు. అనంతరం పెమ్మసాని మాట్లాడుతూ... ఈ ప్రయత్నం ద్వారా ఏటా సుమారు రూ.250 కోట్లను ఎయిమ్స్ కు అయ్యే ఖర్చును కేంద్ర ప్రభుత్వం అదనంగా భరిస్తుందని తెలిపారు.

**మాట ఇచ్చాను - మరువను**

గడిచిన ఫిబ్రవరి 28న గుంటూరు పార్లమెంట్ పరిధిలోని నిర్మితమైన ఎయిమ్స్ ఆసుపత్రిని పెమ్మసాని గారు పరిశీలించిన అనంతరం సమీక్ష సమావేశం నిర్వహించారు. సమీక్షలో భాగంగా ఎయిమ్స్ అవసరాలు అదనపు సౌకర్యాలతో పాటు సిబ్బంది వైద్యుల లోటు అంశాలపై ఆయన క్షుణ్ణంగా సమీక్షించారు. సమీక్షలో భాగంగా ఎయిమ్స్ కు కావాల్సిన సౌకర్యాలను కేంద్రంతో మాట్లాడి ఏర్పాటు చేస్తానని మాట ఇచ్చాను, మర్చిపోనని ఆనాడే పెమ్మసాని అధికారులు, వైద్యులకు స్పష్టం చేశారు. ఇచ్చిన మాటకు అనుగుణంగా అడుగులు వేస్తున్నారు. ప్రతిపాదనలో భాగంగా ఆయన మాట్లాడుతూ ఏపీ ఆరోగ్య సంరక్షణ, మౌలిక సదుపాయాలను బలోపేతం చేయడంలో భాగంగా ఎయిమ్స్ ప్రధాన భూమిక పోషిస్తుందని విజయవాడ - గుంటూరు పరిధిలో నిర్మితమైన ఎయిమ్స్ కు ఇరు జిల్లాల ప్రజలు ఉపయోగించుకుంటున్నారని తెలిపారు. అయితే అందులో ఉన్న సిబ్బంది, సదుపాయాల కొరత ఆసుపత్రి వైద్య విధానంపై ప్రభావం చూపుతుందన్నారు. సెంట్రల్ ఇన్స్టిట్యూట్ కమిటీ ఆమోదించిన ప్రకారం 960 పడకలను అందుబాటులోకి తేవాలని కోరారు. కాబట్టి తమ ప్రతిపాదనను అత్యంత ప్రాముఖ్యతతో పరిగణించి త్వరగా అనుమతులను మంజూరు చేయాలని ఆయన కోరారు.

# విశాఖలో ప్రేమోన్మాది ఘాతుకం

- తల్లీకూతుళ్లపై కత్తితో దాడి - ఒకరు మృతి... సీఎం చంద్రబాబు దిగ్భ్రాంతి
- నిందితుడినిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశాలు



విశాఖపట్నంలో దారుణం చోటు చేసుకుంది. కొమ్మాది స్వయంకృషినగర్‌లో ప్రేమోన్మాది ఓ యువతి ఆమె తల్లిపై కత్తితో దాడి చేశాడు. ఈ దాడిలో తల్లి లక్ష్మి (43) మృతి చెందగా కుమార్తె దీపిక (20)కు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు దీపికను సమీపంలోని గాయత్రి ఆస్పత్రికి తరలించారు. తల్లి, కుమార్తెపై దాడి చేసిన యువకుడు నవీన్ పరారయ్యాడు. ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. నవీన్ అనే యువకుడు దీపిక అనే యువతీని ప్రేమిస్తున్నాను అంటూ వెంటపడ్డాడు. ఆమె నిరాకరించడంతో ఇవాళ మధ్యాహ్నం సమయంలో ఇంట్లోకి చొరబడిన నవీన్, తల్లి కుమార్తెలపై హత్యాయత్నం చేశాడు. ఈ ఘటనలో తల్లి లక్ష్మి అక్కడికక్కడే మృతి చెందగా, కుమార్తె దీపిక తీవ్ర ప్రాణాపాయ పరిస్థితుల్లో సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. డిగ్రీ పూర్తి చేసి ఇంట్లోనే ఉంటున్న దీపికను పెళ్లి కోసం నవీన్ బలవంత పెడుతున్నట్లుగా సమాచారం. ఘటనాస్థలం నుంచి పరారైన నిందితుడు నవీన్‌ను పోలీసులు శ్రీకాకుళం సమీపంలో అరెస్ట్ చేశారు.

**సీఎం చంద్రబాబు దిగ్భ్రాంతి :** శాఖలో ప్రేమోన్మాది దాడి ఘటనపై సీఎం చంద్రబాబు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బాధిత యువతికి మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు. అలాగే నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

**స్పందించిన హోంమంత్రి అనిత :** ప్రేమోన్మాది దాడి ఘటనపై హోంమంత్రి అనిత స్పందించారు. విశాఖ సీపీ శంఖబ్రత బాగ్చితో ఫోన్‌లో మాట్లాడి బాధితురాలు దీపిక ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. యువతికి మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. ప్రేమోన్మాదిని త్వరగా పట్టుకుని కఠినంగా శిక్షించాలన్నారు. యువతి తల్లి లక్ష్మి మృతిపై దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. విశాఖ పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి ఘటనాస్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు.

**ప్రేమోన్మాది నవీన్ అరెస్ట్**

మధురవాడలో దీపికాపై దాడి చేసిన ప్రేమోన్మాది నవీన్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుడు నవీన్‌ను శ్రీకాకుళం జిల్లాలోని బుర్జ వద్ద అదుపులోకి తీసుకున్నామని విశాఖపట్నం నగర పోలీస్ కమిషనర్ శంఖబ్ర బాగ్చి వెల్లడించారు. బుధవారం విశాఖపట్నంలో నగర సీపీ బాగ్చి విలేకర్లతో మాట్లాడుతూ.. దీపికా , నవీన్‌ల మధ్య గత కొన్ని ఏళ్లుగా ప్రేమ వ్యవహారం ఉందని తెలిపారు. వీరీ వివాహానికి ప్రస్తుతం ఆమె ఇంట్లోని పెద్దలు నిరాకరించారని.. ఈ నేపథ్యంలో ఈ హత్య జరిగిందని తెలిసిందన్నారు.

**అయితే ఈ హత్య చేసిన కత్తి..** క్రైమ్ సీన్‌లోనే ఉందన్నారు. దీపికతోపాటు ఆమె తల్లిపై దాడిన అనంతరం నవీన్ బైక్‌పై శ్రీకాకుళం వెళ్లిపోయాడని వివరించారు. ఇక మధ్యలో ఎవరికి దొరక్కుండా.. ఉండేందుకు దుస్తులు, బైకు మార్చేశాడని నగర సీపీ బాగ్చి తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించామన్నారు.

# డ్రైనేజీ వ్యవస్థపై దృష్టి : ఎమ్మెల్యే శంకర్



శ్రీకాకుళం (చైతన్యరథం): డ్రైనేజీ వ్యవస్థ, త్రాగునీటి సమస్యలపై పూర్తిస్థాయిలో దృష్టి సారించినట్లు శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ తెలిపారు. శ్రీకాకుళంలోని డీసీసీబీకాలనీ పరిసర ప్రాంతాల్లో నగరపాలకసంస్థ కమిషనర్, సచివాలయ సిబ్బందితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... రానున్న రెండు, మూడు నెలల్లో యుద్ధ ప్రాతిపదికన నగరంలో డ్రైనేజీ వ్యవస్థను బాగు చేసి, ప్రజలకు ఇబ్బందులు లేకుండా చేసి, సమస్యలు లేని నగరంగా తీర్చిదిద్దేందుకు కృషిచేస్తామని తెలిపారు. వాడాడలో ఉపాధి పథకం ద్వారా ఏర్పాటు చేయనున్న పశువులు మంచినీటి కుంటలు నిర్మాణానికి ఎమ్మెల్యే గొండు శంకర్ భూమి పూజ చేశారు. అలాగే ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎస్.రామమోహనరావు, ఏపీవో సంధ్యారాణి, జేఈ నారన్నాయుడు పాల్గొన్నారు.

# ఒడియా మైనార్టీల సమస్యల పరిష్కారానికి కృషి

ఇచ్ఛాపురం (చైతన్యరథం): డియా మైనార్టీల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే బెందాళం అశోక్ తెలిపారు. రాత్రి ఇచ్ఛాపురంలోని బాపూజీ ఒడియా పాఠాఘర్ అధ్యక్షుడు రఘునాథ్ గౌడో అధ్యక్షతన 90వ ఉత్కళ్ దివస్ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... అసెంబ్లీలో రెండుసార్లు ఒడియా మైనార్టీల సమస్యలపైప్రశ్నించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఒడియా డీఐదుర్గాప్రసాద్, ఉత్కళాంధ్ర జిల్లా మైనార్టీ అధ్యక్షుడు సత్యనారాయణపాడి, ఏపీ ఒడియా టీచర్స్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ బృందావన్ దొళై, శివప్రసాద్, ఎంఈవో-1, 2 అప్పారావు, విశ్వనాథం, పరపటి మంజులత, నందికి జాని, కాళ్ల దిలీప్ పాల్గొన్నారు. బెల్లుపడలో ఈనెల 19 నుంచి ఐదురోజులపాటు నిర్వహించనున్న శ్రీరామతారకమహామంత్ర సహిత పంచకుండా త్మక యజ్ఞం విజయవంతం చేయాలని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ కోరారు. మహామంత్ర సహిత పంచకుండాత్మక యజ్ఞానికి శుభరాట వేశారు. ఈ సందర్భంగా అశోక్ అన్ని శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ... ఐదురోజులు పాటు జరగనున్న యజ్ఞం విజయవంతంగా జరిగేందుకు అధికారులు సహకరించాలని తెలిపారు. యజ్ఞంలో పాల్గొవడానికి వేలాది భక్తులు రానుండడంతో వాహనాలు హైవే గుండా సుమాడిమీదుగా మళ్లించాలని పోలీసులకు సూచించారు. అనంతరం యజ్ఞం పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి, మునిసిపల్ కమీషనర్ రమేష్,విద్యుత్ శాఖ ఏఈ గోవిందరావు, గ్రామ పెద్దలు ఆశి జీవులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## 'హంద్రీనీవా'తో శుభారంభం కావాలి

**●రాష్ట్ర జల వనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు**



అమరావతి /పాలకొల్లు (చైతన్యరథం): రాష్ట్రాన్ని కరవు రహితంగా మార్చే కార్యక్రమం హంద్రీనీవా తోటే ఆరంభం కావాలని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. విజయవాడ క్యాంపు కార్యాలయంలో బుధవారం హంద్రీనీవా ప్రాజెక్టు పనుల పురోగతిపై సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కృష్ణా, గోదావరి జలాలను రాయలసీమకు తరలించి రతనాలసీమగా మార్చాలనే మహత్తర ఆశయంతో ముందుకు వెళుతున్నారని చెప్పారు. ఆయన గొప్ప ఆశయానికి హంద్రీనీవా ప్రాజెక్టు పూర్తి శుభారంభం కావాలని అధికారులకు సూచించారు. ఈ కారణంగానే మునుపెన్నడూ లేని విధంగా ఈ ఏడాది బడ్జెట్లో హంద్రీనీవాకు అత్యధికంగా రూ.3243 కోట్లు కేటాయించిన సంగతి మీరంతా గమనించాలన్నారు. ఆయన స్ఫూర్తిని మీరంతా అందిపుచ్చుకుని మీ, మీ పరిధిలోని పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలన్నారు. 2025 జూన్ కల్లా హంద్రీనీవా మొదటి దశ పనులు పూర్తి చేయాలన్న ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా చురుగ్గా పని చేయాలన్నారు. ఇరిగేషన్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ సాయిప్రసాద్, ఈఎన్‌సిఎం. వెంకటేశ్వరరావు, ప్రాజెక్టు సీఈలు, ఎస్ఈలు, ఈఈలు మరియు ఏజెన్సీ ప్రతినిధులు వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఇదే సందర్భంలో మంత్రి రామానాయుడు, వైసీపీ హయాంలో హంద్రీనీవా ప్రాజెక్టుకు సంబంధించి జరిగిన అన్యాయాన్ని ప్రస్తావించారు. 2014 -19 టీడీపీ పాలనలో హంద్రీనీవాకు రూ.4000 కోట్లు ఖర్చు పెడితే జగన్ ఐదేళ్ల కాలంలో కేవలం రూ.500కోట్లు మాత్రమే ఖర్చు పెట్టారని మంత్రి నిమ్మల విమర్శించారు. హంద్రీనీవా పూర్తి కాకపోవడానికి, ఆ పాపానికి ముమ్మాటికి జగనే కారణమని దుయ్యబట్టారు. మాట్లాడితే రాయలసీమ బిడ్డని అని చెప్పుకునే జగన్ రాయలసీమ ద్రోహిగా చరిత్రలో మిగిలిపోయారన్నారు. హంద్రీనీవా ప్రాజెక్టు పరిధిలో ఆనాడు చంద్రబాబు ఏర్పాటు చేసిన 3,850 క్యూసెక్కుల సామర్థ్యం గల మోటార్లను సైతం చేతకాని జగన్ ప్రభుత్వం వాడుకోలేకపోయింది అన్నారు. అంతెందుకు హంద్రీనీవా కరెంట్ బిల్లులు కూడా చెల్లించకుండా బకాయిలు పెట్టిన బాధ్యతారహిత ప్రభుత్వం వైసీపీదేనని మంత్రి నిమ్మల విమర్శించారు.

## ప్రజా సమస్యలపై తక్షణమే పరిష్కారం కోసం కృషి

**●ప్రజాదర్బార్‌లో ఎమ్మెల్యే సత్యానందరావు**



కొత్తపేట (చైతన్యరథం): నియోజకవర్గంలో ప్రజలు వారి సమస్యలను నేరుగా తమ దృష్టికి తేవాలని సమస్య పరిష్కరించే విధంగా చర్యలు చేపడతామని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. రావులపాలెం క్యాంప్ కార్యాలయంలో వద్ద బుధవారం ప్రజా దర్బార్ నిర్వహించారు. ప్రజలు నేరుగా వచ్చి తమ సమస్యలను విన్నవించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... ప్రజలు సమస్యలు తమ దృష్టికి తీసుకువస్తే సంబంధిత అధికారులు సంప్రదించి సమస్య పరిష్కరించే దిశగా ప్రయత్నాలు చేస్తామని ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని తెలిపారు. కూటమి ప్రభుత్వములో ప్రజా సమస్యలకే పెద్దపీట వేస్తున్నామని, ఎవరికి ఏ సమస్య వచ్చినా నిర్భయంతరంగా వారి సమస్యలను తెలపవచ్చని తక్షణమే చర్యలకు ఆదేశాలు ఇచ్చే విధంగా చర్యలు తీసుకుంటామని, సమస్యలు పరిష్కారం వెంటనే జరుగుతుందని తెలిపారు. సమస్యలు పరిష్కరించడంతో ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రజా దర్బార్‌కు అధిక సంఖ్యలో ప్రజలు వచ్చి సమస్యలపై వినతులు అందజేశారని ఎమ్మెల్యే సత్యానందరావు తెలిపారు.

## మంత్రి కందుల దుర్గేష్ జనవాణి

నిడదవోలు (చైతన్యరథం): ప్రజలకు అందుబాటులో ఉంటూ జనవాణి ద్వారా ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. బుధవారం నిడదవోలులోని జనసేన పార్టీ కార్యాలయంలో నిర్వహించిన జనవాణి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ప్రజలు, పార్టీ శ్రేణుల నుంచి నేరుగా అర్జీలను స్వీకరించారు. ప్రజల సమస్యలను స్వయంగా విన్నారు. త్వరితగతిన సమస్యలకు పరిష్కారం చూపిస్తానని హామీ ఇచ్చారు. ప్రజలకు అండగా ఉంటామని భరోసానందించారు. తామున్నదే ప్రజలకు సేవ చేయడానికని గుర్తుచేశారు.

## రాజధాని అమరావతికి రైల్వే లైన్ల అనుసంధానం

**●భద్రాచలం - కొవ్వూరు రైల్వే లైన్ ప్రాజెక్టు పూర్తికి చర్యలు**

**●ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ లోక్‌సభ లేవనెత్తిన సమస్యలకు కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ సమాధానం**



ఢిల్లీ/ ఏలూరు (చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్‌లో రైల్వే అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని, రాజధాని అమరావతికి రైల్వే లైన్లు అనుసంధానం చేస్తున్నామని, భద్రాచలం- కొవ్వూరు రైల్వే లైన్ ప్రాజెక్టు పనులు పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటున్నట్లు కేంద్ర రైల్వేలు, సమాచారం, బ్రాడ్‌కాస్టింగ్, ఎలక్ట్రానిక్స్ మరియు ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రి అశ్విని వైష్ణవ్ స్పష్టం చేశారు. ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ బుధవారం లోక్‌సభలో లేవనెత్తిన ప్రశ్నలకు కేంద్రమంత్రి సమాధానం ఇచ్చారు. రూ.2155 కోట్లతో చేపట్టిన భద్రాచలం - కొవ్వూరు రైల్వే లైన్ ప్రాజెక్టు పనులు త్వరితగతిన పూర్తి చేసేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు పార్లమెంట్ సమావేశాల సందర్భంగా ఆంధ్రప్రదేశ్‌తో పాటు ఏలూరు పార్లమెంటు నియోజకవర్గం పరిధిలోని రైల్వే సమస్యలను బుధవారం లోక్‌సభలో ఎంపీ పుట్టా మహేష్ కుమార్ ప్రస్తావించారు. భద్రాచలం- కొవ్వూరు రైల్వే ప్రాజెక్ట్ పనులు ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్నాయని, రాష్ట్ర విభజన పరిస్థితుల నేపథ్యంలో కీలకంగా మారిన ఈ ప్రాజెక్టు వల్ల అభివృద్ధికి మరింత దోహదం చేస్తుందని ఎంపీ మహేష్ కుమార్ లోక్‌సభలో ప్రస్తావించారు. ఈ ప్రాజెక్టు నిర్మాణం పూర్తయితే విశాఖపట్నం - హైదరాబాద్ మధ్య 150 కిలోమీటర్ల మేర దూరం తగ్గుతుందని, 200 గిరిజన ప్రాంతాలు, మారుమూల పల్లెలకు రవాణా సౌకర్యం మెరుగుపడుతుందని ఎంపీ మహేష్ కుమార్ కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. కేంద్ర రైల్వేలు, సమాచారం, బ్రాడ్‌కాస్టింగ్, ఎలక్ట్రానిక్స్ మరియు ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రి అశ్విని వైష్ణవ్ సమాధానమిస్తూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో చేపట్టిన భద్రాచలం - కొవ్వూరు రైల్వే ప్రాజెక్ట్ పనులు పురోగతిలో ఉన్నాయని, భద్రాచలం నుంచి సత్తుపల్లి వరకు 56 కిలోమీటర్ల మేర రైల్వే లైన్ పనులు 2022 మే నాటికి పూర్తయ్యాయని, సత్తుపల్లి - కొవ్వూరు రైల్వే లైన్ పనులు పురోగతిలో ఉన్నాయని, సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

**నిధుల మంజూరులో తగిన ప్రాధాన్యత**

దేశవ్యాప్తంగా రూ.9,450 కోట్లతో 4300 ఓవర్ బ్రిడ్జిలు, ఆర్ఓబి, ఆర్.యు.బి చేపట్టగా, ఆంధ్రప్రదేశ్‌లో చేపట్టిన 284 ఓవర్ బ్రిడ్జిలు, ఆర్ఓబి, ఆర్.యు.బిల నిర్మాణం వివిధ దశల్లో ఉందని, అలాగే ఏలూరు పార్లమెంట్ పరిధిలో ఆరుచోట్ల ప్రతిపాదించిన ఆర్ఓబి, ఆర్.యు.బి నిర్మాణాలకు నిధులు మంజూరు చేయాలని ఎంపీ మహేష్ కుమార్ లోక్‌సభలో కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. దీనికి కేంద్ర రైల్వేలు, సమాచారం, బ్రాడ్‌కాస్టింగ్, ఎలక్ట్రానిక్స్ మరియు ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రి అశ్విని వైష్ణవ్ సమాధానమిస్తూ.. ఆంధ్రప్రదేశ్‌లో రైల్వే అభివృద్ధికి ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నారని, నిధుల మంజూరులో తగిన ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. యూపీఏ ప్రభుత్వం పదేళ్లలో రైల్వే అభివృద్ధికి రూ.886 కోట్లు ఖర్చు చేయగా, ఎన్డీఏ ప్రభుత్వం రూ.9,417 కోట్లు ఖర్చు చేసిందని, యూపీఏ ప్రభుత్వం ఏడాదికి 72 కిలోమీటర్ల చొప్పున కేవలం 750 కిలోమీటర్ల మేర రైల్వే లైన్లు వేయగా, ఎన్డీఏ ప్రభుత్వంలో ప్రతి ఏటా 151 కిలోమీటర్ల చొప్పున ఇప్పటి వరకు 1510 కిలోమీటర్లు పూర్తి చేసినట్టు కేంద్ర మంత్రి బదులిచ్చారు. విశాఖపట్నంకి సౌత్ కోస్టల్ రైల్వే మంజూరు చేయగా, ఇటీవల ప్రధానమంత్రి నరేంద్ర మోడీ శంకుస్థాపన చేశారని, అలాగే రాజధాని అమరావతికి రైల్వే లైన్లు అనుసంధానిస్తున్నట్లు కేంద్రమంత్రి స్పష్టం చేశారు.

## అడ్మినిస్ట్రేషన్ బిల్డింగ్ ప్రారంభించిన ఎమ్మెల్యే వనమాడి కొండబాబు



కాకినాడ (చైతన్యరథం): ఆంధ్ర పాలిటెక్నిక్ నందు నూతనంగా నిర్మించిన నూతన పరిపాలన భవనాన్ని శాసనసభ్యులు వనమాడి కొండబాబు, శాసనమండలి సభ్యులు కర్రీ పద్మశ్రీ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కొండబాబు మాట్లాడుతూ... ఆంధ్ర పాలిటెక్నిక్ నందు సుమారు నాబోర్డ్ ఆర్.ఐ.డి.ఎఫ్. నిధులు నాలుగు కోట్ల రూపాయలతో నూతన పరిపాలన భవన నిర్మించడం జరిగిందని, గత తెలుగుదేశ ప్రభుత్వ హయంలో హాస్టల్ బిల్డింగ్ నిర్మాణానికి నిధులు మంజూరు చేసి నిర్మాణం చేపట్టిగా గత ఐదేళ్ల ఫారంలో వాటిని పూర్తి చేయలేకపోయారని, ఆంధ్ర పాలిటెక్నిక్ నందు కొన్ని బ్లాకులు శిధిలా వ్యవస్థకు చేరుకోవడం జరిగిందని, రాబోయే కాలంలో వాటి స్థానంలో నూతన భవనాలను నిర్మించడానికి చర్యలు చేపట్టడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సాంకేతిక విద్య డైరెక్టర్ పద్మారావు, ప్రిన్సిపాల్ నల్లి జనార్ధన్‌రావు, ప్రాంతీయ సంచాలకులు జే. సత్యనారాయణమూర్తి, అధ్యాపక సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## 10వేల ఇళ్లకు సోలార్ విద్యుత్ లక్ష్యం : ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్



విజయవాడ (చైతన్యరథం): ఏపీకి చంద్రబాబు ముఖ్యమంత్రి అయిన ప్రతిసారి రాష్ట్రంలో ఒక ప్రత్యేక పథకాన్ని ప్రారంభించి ప్రజల జీవితాల్లో వెలుగు నింపుతున్నారని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ తెలిపారు. 14వ డివిజన్ ఎన్ఎస్ఎం స్కూల్ సమీపంలో ఆయన పర్యటించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం డివిజన్‌లో ఇద్దరు నిరుపేద కుటుంబాలకు చెందిన కార్యకర్తలకు తన సొంత నిధులతో బడ్డీ కొట్టు, ప్లాట్‌ఫాం రిక్షాను ఆయన అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు సీఎం అయిన తొలి సారి డ్వాక్రా సంఘాలను ఏర్పాటు చేశారన్నారు. ఇప్పుడు సోలార్ విద్యుత్‌ను అందు బాటులోకి తీసుకువచ్చారన్నారు. నియోజక వర్గంలో 10 వేల ఇళ్లకు సోలార్ విద్యుత్ అమలు చేయాలనే లక్ష్యంతో ఉన్నట్లు చెప్పారు. ఈ పథకానికి ఉన్న రాయితీలను ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నేతలు ఎల్లబాబు, కార్పొరేటర్ ముమ్మనేని ప్రసాద్, నర్రా కిషోర్, నాగరాజు, గరికపాటి బద్రీ, డాంగియా కుమారి, సాంబయ్య పాల్గొన్నారు.

## పరిశ్రమలకు అనుగుణంగా విద్యార్థులు నైపుణ్యాలు నేర్చుకోవాలి

సాగర్‌నగర్ (చైతన్యరథం): లాజిస్టిక్, ఆపరేషన్ రంగంలో విస్తృత ఉద్యోగావకాశాలు ఉన్న దృష్ట్యా విద్యార్థులు పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాల్ని పెంచుకోవాలని ప్రముఖ సంస్థ అవాన్ ఇంటలెక్ట్ అధ్యక్షుడు డేవిడ్సింగ్, తదితర నిపుణులు పేర్కొన్నారు. గీతం డీమ్డ్ వర్సిటీ స్కూల్ ఆఫ్ బిజినెస్ ఆధ్వర్యంలో లాజిస్టిక్ ఆపరేషన్ సంబంధిత ప్రాధాన్యకర అంశాలపై బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని విద్యార్థులు అందిపుచ్చుకుని నైపుణ్యాల్ని విస్తృత పరచుకోవాలని వీరు సూచించారు పలు అంశాలపై దిశానిర్దేశం చేశారు. డీన్ ప్రొఫెసర్ రాజాపణి పప్పు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాదర్బార్‌కు వచ్చే అర్జీలు ఎప్పటికప్పుడు పరిష్కారం కావాలి

### ●ఆలస్యం, అలసత్వానికి బాధ్యత అధికారులదేనని చీఫ్ విప్ జీవీ హెచ్చరిక




వినుకొండ (చైతన్యరథం): ప్రతివారం బుధవారం రోజున నిర్వహించే ప్రజాదర్బార్‌కు వచ్చే అర్జీలను సకాలం పరిష్కరించాల్సి బాధ్యత అధికారులపై ఉందని, లేదంటే కఠిన చర్యలు ఎదుర్కోవాల్సి ఉంటుందని ప్రభుత్వ చీఫ్‌విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు హెచ్చరించారు. ఈ విషయంలో ఎవరు నిర్లక్ష్యంగా ఉన్నా సహించబోనని, ప్రజలు మళ్లీ మళ్లీ అదే సమస్యతో రాకుండా చూడాల్సిన బాధ్యత అధికారులదేనని స్పష్టం చేశారు. వినుకొండలోని తన కార్యాలయంలో బుధవారం ఆయన ప్రజాదర్బార్ నిర్వహించారు. నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి వినతులు స్వీకరించి, సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి చొరవ చూపారు. ఈ సందర్భంగా 80 అర్జీలు వచ్చినట్లు తెలిపారు. వీటిలో వివిధ కార్పొరేషన్ల లోన్లు, విద్యుత్, తాగునీరు, గృహాలకు సంబంధించినవి ఎక్కువగా ఉన్నాయి. ఈ సందర్భంగా చీఫ్‌విప్ జీవీ మాట్లాడుతూ "ప్రజల సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరించడమే ప్రజాదర్బార్ ప్రధాన లక్ష్యమన్నారు. అందుకే ప్రతి అర్జీని ఓపికగా పరిశీలించి, తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. బాధితులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను అర్థం చేసుకుంటూ పరిష్కారానికి అధికారులకు ఆదేశాలు ఇస్తున్నామన్నారు. తమకు వస్తున్న అర్జీలను స్కాన్ చేసి కూడా పంపడం ద్వారా అధికారుల్లో జవాబుదారీతనానిక కృషి చేస్తున్నామని, రానున్న రోజుల్లో ప్రజాదర్బార్‌ను మరింత సమర్థంగా తీర్చిదిద్దుతామని, ఈ కార్యక్రమం స్ఫూర్తిని అర్థం చేసుకుని అధికారులు క్రియాశీలకంగా పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ శాసనసభ్యులు మక్కెన మల్లికార్జున రావు, జనసేన నాయకులు నాగ శ్రీను రాయల్, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## కేడీసీసీ బ్యాంక్ పదోన్నతుల వ్యవహారంలో ఫలించిన ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు కృషి



గన్నవరం (చైతన్యరథం): కృష్ణాజిల్లా కేంద్ర సహకార బ్యాంకులో పనిచేస్తున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ-సీ కేటగిరీలకు చెందిన ఉద్యోగులకు పదోన్నతుల్లో అన్యాయం జరిగిందని, చీఫ్ మేనేజర్లుగా ప్రమోషన్లు ఇచ్చి తిరిగి రద్దు చేయడాన్ని వ్యతిరేకిస్తూ గత జనవరి నెలలో కేడీసీసీ బ్యాంకు ఎస్సీ, ఎస్టీ, బీసీ ఉద్యోగుల అసోసియేషన్ ఆధ్వర్యంలో మచిలీపట్నంలోని బ్యాంకు ఎదురుగా నిరసన చేపట్టగా, స్పందించిన ప్రభుత్వ విప్, గన్నవరం నియోజకవర్గ శాసనసభ్యులు యార్లగడ్డ వెంకట్రావు ఉద్యోగులు నిరసన తెలుపుతున్న ప్రదేశానికి వెళ్లి వారితో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పదోన్నతుల వ్యవహారంపై ప్రభుత్వంతో చర్చించి తమ డిమాండ్లను పరిష్కరిస్తానని హామీ ఇవ్వడంతో ఉద్యోగులు యార్లగడ్డను నమ్మి నిరసన విరమింప చేశారు. ఆ మేరకు యార్లగడ్డ వెంకట్రావు సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి ఉద్యోగుల సమస్యలను వివరించి పరిష్కరించవలసిందిగా సంబంధిత మంత్రిని కోరడం జరిగింది. కాగా రెండు రోజుల క్రితం ఎస్సీ, ఎస్టీ, బీసీ-సి కేటగిరీలకు చెందిన ఉద్యోగులకు చీఫ్ మేనేజర్లుగా ప్రమోషన్లు మంజూరు చేస్తూ కేడీసీసీ బ్యాంకు సీఈఓ ఉత్తర్వులు జారీ చేశారు. పదోన్నతులు పొందిన ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు చెందిన కేడీసీసీ బ్యాంకు ఉద్యోగులు మంగళవారం సాయంత్రం ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావును వారి క్యాంపు కార్యాలయంలో కలిసి తమ సమస్యల పట్ల స్పందించి, పోరాడి వారికి న్యాయం జరిగేలా చేసినందుకు కృతజ్ఞతలు తెలుపుతూ తమ హర్షాన్ని వ్యక్తం చేశారు. కేడీసీసీ బ్యాంకు అభివృద్ధికి తాను ఎల్లప్పుడూ కృషి చేస్తూనే ఉంటానని ఎప్పుడు అవసరం వచ్చిన తనను సంప్రదించవచ్చని ఈ సందర్భంగా యార్లగడ్డ వెంకట్రావు తెలియజేశారు.

## ప్రజల సమస్యల పరిష్కారం కోసం నిరంతర కృషి : భాష్యం ప్రవీణ్



పెదకూరపాడు (చైతన్యరథం): ప్రజల సమస్యల పరిష్కారం కోసమే నిరంతరం కృషి చేస్తానని నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ కుమార్ వ్యాఖ్యానించారు. బుధవారం నియోజకవర్గ ప్రజల నుండి స్వయంగా ఫిర్యాదులను స్వీకరించారు. అనంతరం సంబంధిత అధికారులకు ఫోన్ చేసి సత్వర పరిష్కారం కోసం అధికారులను ఆదేశించారు. ప్రజలను నేరుగా కలుసుకుని వారి సమస్యలను స్వయంగా విని వాటి పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి చేసేందుకు ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించినట్టు తెలిపారు. ప్రజా దర్బార్ ద్వారా ప్రతి ఒక్కరి సమస్యను పరిష్కరించే దిశగా పని చేస్తామని అన్నారు. బాధితుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించే విధంగా అధికారులు పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో పలువురు ఎన్డీయే కూటమి నేతలు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రజాదర్బార్ : తంగిరాల సౌమ్య



నందిగామ (చైతన్యరథం): ప్రజాసమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరించేందుకే ప్రజా దర్బార్ నిర్వహిస్తున్నట్లు ఏపీ ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య తెలిపారు. బుధవారం వీరులపాడు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజాదర్బార్ కార్యక్రమంలో పెద్దఎత్తున ప్రజలు వినతులు అందజేశారు. తాగునీటి సమస్యలు, రెవెన్యూ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అర్జీలు అందజేశారు. ఈ సందర్భంగా తంగిరాల సౌమ్య మాట్లాడుతూ... కూటమి ప్రభుత్వం ఏర్పడి 10 నెలలు కావస్తున్నా గత వైసీపీ పాలనలో పరిష్కారం కానీ ఎన్నో రెవెన్యూ సమస్యలతో ప్రజలు నేటికీ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. రెవెన్యూ సమస్యల పరిష్కారం కోసం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించి గ్రామసభలు నిర్వహించడం జరుగుతుందని రెవిన్యూ అధికారులు ఎక్కడా కూడా అలసత్వం వహించకుండా తక్షణమే సమస్యల పరిష్కార దిశగా పనిచేయాలని సూచించారు. ప్రజా దర్బార్ నందు వచ్చే ఫిర్యాదుల సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

## అర్హులైన ప్రతి ఒక్కరికి కార్పోరేషన్ రుణాలు

### ●గుంటూరులో ప్రజా గ్రీవెన్స్ డే నిర్వహించిన ఎమ్మెల్యే గళ్ళా మాధవి



గుంటూరు (చైతన్యరథం) : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం వివిధ కార్పొరేషన్ల ద్వారా ఇవ్వనున్న రాయితీ రుణాలకు అర్హత ఒకటే ప్రామాణికము అని, అర్హులయిన ప్రతి ఒక్కరికి రుణాలు అందుతాయని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి స్పష్టం చేశారు. బుధవారం గుంటూరు పశ్చిమ నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే గళ్ళా మాధవి ప్రజా గ్రీవెన్స్ డే నిర్వహించి, ప్రజలు మరియు పార్టీ నేతలు, కార్యకర్తల నుండి పలు అర్జీలను స్వీకరించారు. గుంటూరు కొరిటెపాడుకు చెందిన ఓ మహిళా చిట్టీల పేరుతో 2024 సంవత్సరంలో సుమారు రూ.3కోట్లతో ఉడాయించిందని తమకు న్యాయం చేయాలని పలువురు మహిళలు ఎమ్మెల్యే గళ్ళా మాధవిని కోరారు. కొత్త రేషన్ కార్డులు మంజూరు చేయాలని కొందరు విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యే గళ్ళా మాధవి బాధిత మహిళలతో మాట్లాడుతూ.. ఈ విషయం గురించి పోలీసు ఉన్నత అధికారులతో మాట్లాడి న్యాయం చేపిస్తానని ఎమ్మెల్యే గళ్ళా మాధవి హామీనిచ్చారు. అదే విధంగా కార్పొరేషన్ల ఋణాల విషయంలో రాజకీయ జోక్యం ఉండదని, ప్రతిరూపాయి అర్హులయిన పేదవారికి అందుతుందని ఎమ్మెల్యే తేల్చి చెప్పారు. అదేవిధంగా స్వర్ణాంధ్ర 2047 విజన్‌లో భాగంగా పి-4 గురించి వైసీపీ నేతలు అవాకులు చవాకులు పేలుతున్నారని, గత ప్రభుత్వంలో భారీ నీటి పారుదల శాఖ మంత్రిగా పనిచేసిన వ్యక్తి పోలవరం డయా ఫ్రమ్ వాల్, కాఫర్ డ్యాం గురించి తెలియదని చెప్పిన మతిలేని వ్యక్తి ఈ రోజు పి-4 గురించి అవహేళన చేస్తూ, చంద్రబాబునాయుడు, పవన్ కళ్యాణ్, లోకేష్ గురించి నోరు పారేసుకుంటున్నాడని, మీడియా ముందుకు వచ్చినప్పుడు విచక్షణతో వ్యవహరించాలని సూచించారు. ఈ గ్రీవెన్స్‌లో నియోజకవర్గ పరిశీలకులు సింహాద్రి కనకాచారి తదితరులు పాల్గొన్నారు.

## అనూషను అభినందించిన క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి



విజయవాడ (చైతన్యరథం): సాఫ్ట్ టెన్నిస్ క్రీడాకారిణి ఎన్.అనూషను విజయవాడలోని క్యాంప్ కార్యాలయంలో బుధవారం కలిశారు. అనూష గ్రేటర్ నోయిడాలో మార్చి 26వ తేదీ వరకూ జరిగిన ఫస్ట్ సౌత్ ఏషియన్ సాఫ్ట్ టెన్నిస్ చాంపియన్ షిప్ టీమ్ ఈవెంట్లో గోల్డ్ మెడల్, ఇండివిడ్యువల్ డబుల్స్‌లో బ్రాంజ్ మెడల్, మిక్స్ డబుల్స్‌లో బ్రాంజ్ మెడల్ సాధించారు. ఈ సందర్భంగా మంత్రి రాంప్రసాద్ రెడ్డి అనూషను అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని, ప్రభుత్వం నుంచి పూర్తి సహాయ సహకారాలను అందిస్తామని హామీ ఇచ్చారు.

## మానవత్వం చాటుకున్న ఎమ్మెల్యే నరేంద్ర వర్మ



బాపట్ల (చైతన్యరథం): బాపట్ల ఎమ్మెల్యే నరేంద్ర వర్మ ఐదేళ్ల చిన్నారి పట్ల మానవత చాటుకున్నారు. ఉదారతతో ఓ చిన్నారిని దత్తత తీసుకున్నారు. మొత్తం బాధ్యతను తీసుకుంటున్నానని ఎమ్మెల్యే నరేంద్ర వర్మ ప్రకటించారు. మానవత్వం పరిమళించి ఎమ్మెల్యే నరేంద్ర వర్మ తీసుకున్న ఈ నిర్ణయంపై సర్వత్రా హర్షం వ్యక్తమైంది. ఆదరించే వారు లేరు.. కుటుంబ సభ్యుల ప్రోత్సాహం లేదు.. చిన్నా భిన్నమైన ఆ కుటుంబంలో ఐదేళ్ల చిన్నారి పరిస్థితిని చూసి చలించి పోయారు బాపట్ల ఎమ్మెల్యే నరేంద్ర వర్మ. ఈ పాపను తాను దత్తత తీసుకుంటే ఎలా ఉంటుందనే విషయాన్ని అవిష్కృతం చేసి అక్కడికక్కడే తన ఆలోచనను అమలు చేసేశారు. ఈరోజు నుండి ఈ పాప మొత్తం బాధ్యత తాను తీసుకుంటానని వెల్లడించారు. మానవత్వం పరిమళించి ఎమ్మెల్యే తీసుకున్న ఈ నిర్ణయంతో ఆ ప్రాంత ప్రజలు ఉదారతపై ప్రశంసల వర్షం కురిపించారు. మన వార్డు.. మన ఎమ్మెల్యే కార్యక్రమంలో భాగంగా... బాపట్ల పట్టణంలోని ఒకటో వార్డు బేతని కాలనీలో పర్యటించిన నరేంద్ర వర్మ ఓ కుటుంబాన్ని పలకరించిన నేపథ్యంలో ఆ చిన్నారి కుటుంబ పరిస్థితిపై స్పందించారు. ఆ చిన్నారికి కొండంత అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. చాలాసేపు ఆ పాపతో ముచ్చటించారు. ఆ పాపతో మాట్లాడించారు. ఆ పాప కుటుంబ పరిస్థితి విన్న తర్వాత నరేంద్ర వర్మ ఆవేదన చెందారు.

# పలాయనవాదం.. కాకాణి గోవర్ధన నైజం

## తప్పులు చేయడం...పరారవడం మీకు అలవాటే కదా పోలీసులకు చిక్కకుండా ఎన్ని రోజులు దాక్కుంటావ్

## రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ షేక్ అబ్దుల్ అజీజ్ ధ్వజం



నెల్లూరు, (చైతన్యరథం): వైసీపీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్ రెడ్డి చెప్పే మాటలకు, చేసే పనులకు ఎప్పుడూ పొంతన ఉండదని తెలుగుదేశం పార్టీ నెల్లూరు జిల్లా అధ్యక్షులు, రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ షేక్ అబ్దుల్ అజీజ్ ధ్వజమెత్తారు. పైకి శ్రీరంగనీతులు చెబుతూ చేసేవన్నీ పాపాలేనని అన్నారు. పొదలకూరు మండలం తాటిపర్తి పంచాయతీ వరదాపురం రుస్తుం మైన్ వేదికగా కాకాణి గోవర్ధన్ రెడ్డి చేసిన పాపాలు ఆయనను శాపాలై వెంటాడుతున్నాయన్నారు. అరెస్టులకు అదిరేది లేదు..కేసులకు బెదిరేది లేదని మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తున్న ఆయన వారం రోజులుగా కనిపించకుండా పోయాడన్నారు. ఇప్పటికే మూడు సార్లు నోటీసులు అందించేందుకు పోలీసులు వెళితే పత్తా లేకుండా పరారయ్యాడన్నారు. హైదరాబాద్‌లో శుభకార్యం ఉందని ఫొటోలతో జిమ్మిక్కులు చేశాడన్నారు. బుధవారం పోలీసులు వెళితే ఆ ఫంక్షన్‌లో లేడన్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆ ఫంక్షన్ ఛాయలకే రాలేదన్నారు. కుటుంబ సభ్యులను ఆరా తీస్తే లాయర్ పిలిస్తే వెళ్లారని సమాధానం ఇస్తున్నారన్నారు. తప్పుల మీద తప్పులు చేయడమెందుకు...అంత భయపడుతూ బతకడమెందుకని ఎద్దేవా చేశారు. అయినా కాకాణి గోవర్ధన్ రెడ్డికి ఇవన్నీ మామూలేనన్నారు. 2016లో సోమిరెడ్డి కుటుంబానికి విదేశాల్లో వెయ్యి కోట్ల ఆస్తులన్నాయంటూ నకిలీ పత్రాలు తయారుచేయించిన ఘనుడు కాకాణి తీరా సోమిరెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కట్టుకున్న లుంగీతోనే లగెత్తి రెండు నెలలు కనిపించకుండా పోయాడన్నారు. చివరకు సుప్రీం కోర్టుకు పోయి కండీషన్ బెయిల్ తెచ్చుకుని 40 రోజుల పాటు రోజూ కానిస్టేబుల్ వద్ద సంతకాలు పెట్టివచ్చాడన్నారు. అధికారాన్ని అడ్డుగా పెట్టుకుని గత ఐదేళ్లూ అవినీతి, అక్రమాలతో చెలరేగిపోయాడన్నారు. బరితెగించి ప్రత్యర్థుల కుటుంబసభ్యులను దూషించాడన్నారు. చనిపోయిన తల్లిదండ్రులను కూడా వదిలిపెట్టలేదన్నారు. ఆనాడే వైసీపీ అధినేత జగన్ రెడ్డి ఆయన తీరును ఖండించివుంటే ఈ రోజు కాకాణి బతుకు ఇలా ఉండేది కాదన్నారు. కాకాణి గోవర్ధన్ రెడ్డి ఎన్ని జిమ్మిక్కులు చేసినా చేసిన తప్పులకు శిక్ష అనుభవించకుండా తప్పించుకోలేడు.

# రెండో పంట కోసం ఐఏబీ నిర్వహించాలి

## సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి వినతి

## ఇన్‌చార్జి మంత్రి, కలెక్టర్‌కు లేఖ



నెల్లూరు, (చైతన్యరథం): రైతుల కోరిక మేరకు రెండో పంటకు నీటి కేటాయింపులకు సంబంధించి సాగునీటి సలహా మండలి సమావేశాన్ని వెంటనే నిర్వహించేందుకు తగు చర్యలు తీసుకోవాలని మాజీమంత్రి సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి కోరారు. ఈ మేరకు జిల్లా ఇన్చార్జి మంత్రి, కలెక్టర్‌కు లేఖ రాశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ ఉమ్మడి నెల్లూరు జిల్లా పరిధిలో సోమశిల, కండలేరు జలాశయాలు ప్రధాన సాగునీటి వనరులన్నారు. ప్రస్తుతం సోమశిల జలాశయంలో 53.374 టీఎంసీలు, కండలేరు జలాశయంలో 48.517 టీఎంసీల నీటి నిల్వ ఉందని వెల్లడించారు. సోమశిల జలాశయ పరిధిలో డెడ్ స్టోరేజీ 7.5 టీఎంసీలు, తాగునీటి అవసరాలకు 3 టీఎంసీలు పోను 42.87 టీఎంసీల జలాలు అందుబాటులో ఉంటాయన్నారు. కండలేరు జలాశయంలోనూ డెడ్ స్టోరేజీ 7 టీఎంసీలు, తాగునీటి అవసరాలకు 3 టీఎంసీలు పోను 38 టీఎంసీల జలాలు అందుబాటులో ఉంటాయన్నారు. డెడ్ స్టోరేజీ, తాగునీరు, పారిశ్రామిక అవసరాలకు పోను కనీసం 60 టీఎంసీలకు పైగా జలాలు అందుబాటులో ఉంటాయన్నారు. ఈ నేపథ్యంలో సమావేశం నిర్వహించి రెండవ పంటను దృష్టిలో పెట్టుకుని అవసరాలకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకోవడం సముచితమని ఆ లేఖలో పేర్కొన్నారు.



# సీఎం హామీల అమలుకు సన్నాహాలు

## మునిసిపల్ మంత్రి నారాయణ, కందుకూరు మునిసిపాలిటీ అభివృద్ధిపై సమీక్ష

కందుకూరు, (చైతన్యరథం): కందుకూరు మున్సిపాలిటీ అభివృద్ధిపై మంత్రి నారాయణ బుధవారం సమీక్ష నిర్వహించారు. కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు, నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి, నుడా వీసీ సూర్య తేజ సమీక్షలో పాల్గొన్నారు. ఈ ఏడాది ఫిబ్రవరి 15వ తేదీన కందుకూరులో స్వచ్ఛంద్ర స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో పాల్గొన్న సీఎం చంద్రబాబు కందుకూరు మున్సిపాలిటీని 50 కోట్లతో అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. సీఎం హామీ అమలు చేయడానికి రూపొందిస్తున్న కార్యాచరణలో భాగయ గానిధులు సమకూర్చడంపై చర్చించారు. కందుకూరు మున్సిపాలిటీలో ఏయే అభివృద్ధి పనులు చేపట్టాలనే దానిపై అభిప్రాయాలు సేకరించారు. సమగ్రమైన ప్రణాళిక రూపొందించి అమలుకు అసరమైన నిధులను సమకూర్చుకోవాల్సి ఉందని మంత్రి నారాయణ పేర్కొన్నారు.



# అర్హులందరికీ ఇళ్ల పట్టాలు

## ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ

శింగనమల, (చైతన్యరథం): గార్లదిన్నె మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఆర్డీఓ కేశవ నాయుడు, మండల అధికారులతో కలిసి పాల్గొని ప్రజల నుంచి నేరుగా వివిధ సమస్యలపై ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ మాట్లాడుతూ రెవెన్యూ శాఖకు సంబంధించిన అర్జీలు అధికంగా వచ్చాయని తెలిపారు. గత ప్రభుత్వం రీ-సర్వే పేరుతో చేసిన భూ తప్పిదాలు గురించి, భూ యజమానులు కు తెలియకుండా భూ మార్పిడి, ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ, బలహీన వర్గాల భూములు పై దౌర్జన్యాలు చేసిన సంఘటనల పై వినతులు వచ్చాయని, వీటన్నింటిపై విచారణ జరిపించాలని అధికారులకు ఆదేశించారు. గత వైసీపీ ప్రభుత్వం గ్రామాల్లోని నీటి ఓవర్ హెడ్ ట్యాంక్‌లను నిర్వీర్యం చేయడంతో గ్రామాల్లో నెలకొన్న నీటి సమస్య పరిష్కారం చేయాలని ఆర్.డబ్ల్యు.యస్. అధికారులును ఆదేశించారు. గ్రామాల్లోని మురికి కాలువలు శుభ్రం గురించి, వీధి లైట్లు గురించి ప్రత్యేక శ్రద్ధ ఉంచాలని తెలిపారు. అలాగే అనర్హులకు ఇంటి పట్టాలు ఇచ్చినట్లు ప్రజలు ఫిర్యాదు చేయడంతో కాలనీలలో ఇచ్చిన ఇంటి పట్టాల గురించి విచారణ చేపట్టాలని తెలిపారు. కూటమి ప్రభుత్వం తరపున అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇంటి పట్టాలు ఇచ్చి, పక్కా గృహాలు మంజూరు చేస్తామని ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ పేర్కొన్నారు.



# దర్శిలో అన్నా క్యాంటీన్‌కు నిధులు మంజూరు

## సహకరించిన మంత్రి లోకేష్

## కృతజ్ఞతలు తెలిపిన డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ

ప్రకాశం జిల్లా, కనిగిరి నియోజకవర్గంలోని దివాకరపల్లిలో బుధవారం సీబీజీ ప్లాంట్ భూమిపూజ కార్యక్రమంలో ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ను దర్శి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా దర్శిలో అన్నా క్యాంటీన్ కు 61 లక్షలు నిధులు మంజూరు చేస్తూ నగర కమిషనర్‌కు ఆదేశాలు జారీ చేయడం పట్ల ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. దర్శిలో అన్నా క్యాంటీన్ కోసం డాక్టర్ లక్ష్మి



ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ఐటీ శాఖ మాత్యులు నారా లోకేష్, మున్సిపల్ శాఖ మాత్యులు నారాయణతో అనేక సార్లు కలిసి కోరడం జరిగింది. ఈ మేరకు అన్న క్యాంటీన్ నిర్మాణానికి అవసరమైన నిధులు మంజూరయ్యాయి. దర్శి నియోజకవర్గం కురిచేడు ప్రాంతంలో సీపీజీ ప్లాంట్ కూడా మంజూరు చేయాలని ఈ సందర్భంగా డాక్టర్ లక్ష్మి నారా లోకేష్‌ను, విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌ని కోరగా అందుకు సానుకూలంగా స్పందించినట్లు ఆమె తెలిపారు. వెనుకబడిన దర్శి ప్రాంతంలో ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా మన ప్రభుత్వం ముందుకు వెళుతుందని ఆమె వివరించారు. అదేవిధంగా డిగ్రీ కాలేజీ కి అవసరమైన శాశ్వత భవనాల ను నిర్మించుకునేందుకు అవసరమైన నిధులను కూడా మంజూరు చేయాలని లోకేష్‌ను కోరగా ఆయన సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మంత్రులు డోల బాల వీరాంజనేయ స్వామి, జిల్లాలోని శాసనసభ్యులు, ఎమ్మెల్సీలు, వివిధ నియోజకవర్గాలు ఇన్చార్జులు, కార్పొరేషన్ చైర్మన్ లు, జిల్లా పార్టీ అధ్యక్షులు నూకసాని బాలాజీ జిల్లా కలెక్టర్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

# కరువు సీమలో పరిశ్రమల స్థాపన

## భూములను పరిశీలించిన ఏపీఐఐసీ చైర్మన్, పాల్గొన్న స్థానిక ప్రజాప్రతినిధులు, పెరగనున్న ఉపాధి అవకాశాలు

మడకశిర, (చైతన్యరథం): మడకశిర మండలం ఆర్ అనంతపురం గ్రామం సమీపంలో పరిశ్రమల ఏర్పాటు కోసం ఏపీఐఐసీ చైర్మన్ మంతెన రామరాజు మడకశిర టీడీడీ ఇంచార్జ్ గుండుమల తిప్పేస్వామి, సత్యసాయి జిల్లా కలెక్టర్ చేతన్ కుమార్, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ సువాన సోనీ, ఆర్డీవో ఆనంద్ కుమార్ మండల అధికారులతో కలిసి భూములను పరిశీలించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మడకశిర పర్యటనలో ఇచ్చిన హామీలను నెరవేర్చే క్రమంలో ముందడుగు పడుతోంది. స్థానిక ఎమ్మెల్యే ఎంఎస్ రాజు మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి చొరవతో దాదాపు 4 వేల మందికి ఉపాధి అవకాశాలు కల్పించే విధంగా పరిశ్రమలు నెలకొల్పుతామని వర్షాలు లేక బీడు భూములుగా ఉండడంవల్ల రైతులకు తీవ్రమైన నష్టం జరగడం వల్ల సోలార్ పార్క్ ఏర్పాటు చేస్తే రైతులకు ఎకరాకు 30 వేల చొప్పున సంవత్సరానికి ఆదాయం వస్తుందని ఏపీఐఐసీ చైర్మన్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్ మూర్తి మండల కన్వీనర్ లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శి రంగే గౌడ్, డాక్టర్ సెల్ కృష్ణమూర్తి జిల్లా కురుబ సంఘం అధ్యక్షులు గోవిందప్ప నాయకులు పాల్గొన్నారు.



# మంత్రి సవిత ఆదేశాలతో ఆఘమేఘాల మీద గండ్ల పూడ్చివేత



## పొలాలకు తప్పిన పంటల మునక ముప్పు

పెనుకొండ, (చైతన్యరథం): సోమందేపల్లిలోని చెరువు సమీపంలో నిన్నటి రోజున హంద్రీ-నీవా కాలువ తెగిపోవడంతో కృష్ణా జలాలు రైతుల పొలాల్లోకి వెళ్ళి,పంటలు మునిగిపోవడంతో మంత్రి సవిత వెంటనే కలెక్టర్‌కు, నీటీ పారుదల అధికారులకు ఆదేశాలు ఇవ్వడంతో బుధవారం అధికారులు కాలువ పూడ్చివేత పనులు ప్రారంభించారు. కాలువ పూడ్చివేత పనులు ప్రారంభించడంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు.

## కార్యాలయాల చుట్టూ తిప్పుకోవద్దు

### అధికారులకు ఎమ్మెల్యే సింధూర హెచ్చరిక

పుట్టపర్తి, (చైతన్యరథం): ప్రజల సమస్యలపై ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ అదే పనిగా తిప్పుకోవద్దని పుట్టపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి ప్రభుత్వ అధికారులకు సూచించారు. ఓడి చెరువు మండల కేంద్రంలోని ఐటిఐ కళాశాల ఆవరణంలో బుధవారం ప్రజా ఫిర్యాదుల దినోత్సవ కార్యక్రమానికి మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి తో పాటు ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రజలు ఇచ్చిన సమస్యకు అధికారులు తక్షణ పరిష్కారం చూపాలని పేర్కొన్నారు. ప్రజా సమస్యలపై నిర్లక్ష్యం చేస్తే సంబంధిత అధికారులపై చర్యలు తప్పు అని హెచ్చరించారు. ఈ విషయంపై ఎమ్మెల్యే తీవ్రంగా స్పందించారు సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని ట్రాన్స్కో అధికారులు ఆదేశించారు. బియ్యం తక్కువగా ఇవ్వడం వల్ల రేషన్ కార్డుదారులకు సక్రమంగా బియ్యము అందించలేకపోతున్నామని ఓడి, నల్లమాడ ,ఆమడ గూరు మండలాలకు చెందిన పలువురు రేషన్ షాప్ డీలర్లు ఎమ్మెల్యే దృష్టికి తీసుకుపోయారు. ఈ విషయంపై సివిల్ సప్లై ,రెవిన్యూ ,పోలీస్ శాఖ అధికారులతో మాట్లాడి సమస్యకు పరిష్కారం చూపుతామని తెలిపారు. ఆమడగూరు, ఓడి చెరువు, నల్ల మాడ మండలాల ప్రజల నుంచి సుమారు 335 అర్జీలను స్వీకరించారు. మూడు మండలాలకు సంబంధించిన తహసిల్దార్లు ఎంపీడీవోలు పంచాయతీరాజ్ ఆరుడబ్ల్యూఎస్ విద్యుత్ హౌసింగ్ ఇరిగేషన్ మెడికల్ ఆఫీసర్లు పశువైద్యాధికారులు హార్టికల్చర్ వ్యవసాయ అధికారులు ఎన్ఆర్ఈజీఎస్ ,ఐసిడిఎస్, ఇతర శాఖల అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులుపాల్గొన్నారు.





## ఎమ్మెల్యే సునీత ఆధ్వరంలో ప్రజాదర్బార్

### మండల కన్వీనర్లు, ఇన్చార్జిలకు కార్డులు అందజేత

రాప్తాడు, (చైతన్యరథం) శాసనసభ్యురాలు పరిటాల సునీత అనంతపురం క్యాంప్ కార్యాలయంలో బుధవారం కార్యాలయంలో ప్రజా దర్బార్ - కార్యకర్తలు, ప్రజల సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. రాప్తాడు నియోజకవర్గానికి చెందిన వివిధ సమస్యలు ఉన్న వారు ఈ కార్యక్రమంలో పాల్గొని వారి సమస్యలు తెలియజేశారు. అనంతరం కార్యకర్తల సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో తెలుగుదేశం పార్టీ సభ్యత్వం కార్డులను ఆయా మండలాల కన్వీనర్లు, క్లస్టర్ ఇంచార్జీలు, ముఖ్యనాయకులకు అందజేశారు.

## ఎమ్మెల్యే దస్తగిరి ఆధ్వర్యంలో

కోడుమూరు. (చైతన్యరథ,): నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి, ఆంధ్ర ప్రదేశ్ ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు, ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి, అధికారులకు సమస్యలు పరిష్కరించాలని ఆదేశించారు.



## టీడీపీ కార్యాలయంలో ప్రజాదర్బార్

అనంతపురం, (చైతన్యరథం): ప్రజా సమస్యల పరిష్కారంలో తెలుగుదేశం ప్రభుత్వం ముందుంటుందని అనంతపురం అర్బన్ నియోజకవర్గ టిడిపి నాయకులు అన్నారు. ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ఆదేశాల మేరకు అర్బన్ టీడీపీ కార్యాలయంలో ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. వివిధ కాలనీలకు చెందిన ప్రజలు తరలివచ్చి తమ సమస్యలను చెప్పుకున్నారు. నగరంలోని పలు చోట్ల డ్రైనేజీ సమస్యల గురించి ప్రజలు అర్జీలు ఇచ్చారు. టిడ్కో ఇళ్ల సమస్య గురించి నాయకుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేకంగా దృష్టి సారించిందన్నారు. ముఖ్యంగా అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మీ ఇంటికి మీ ఎమ్మెల్యే ద్వారా నేరుగా ప్రజల వద్దకు వెళ్లి సమస్యలు తెలుసుకుంటున్నారని అన్నారు.





# నమ్మిన ప్రజల సమస్యలపై దృష్టి పెట్టండి

## ధర్మవరంలో ప్రజా దర్బార్ కార్యకర్తలు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో పరిటాల శ్రీరామ్ పిలుపు రూ.7.68 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

ధర్మవరం, (చైతన్యరథం): ప్రజలు మా కంటే ఎక్కువగా స్థానిక నాయకులైన మిమ్మల్ని నమ్మి ఓట్లు వేశారని వారి సమస్యలు తీర్చే బాధ్యత కూడా మనపై ఉంటుందని ధర్మవరం నియోజకవర్గ టీడీపీ ఇన్చార్జి పరిటాల శ్రీరామ్ కార్యకర్తలను ఉద్దేశించి అన్నారు. ధర్మవరం టీడీపీ కార్యాలయంలో జరిగిన ప్రజా దర్బార్, కార్యకర్తలు, ప్రజల సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో పాల్గొన్నారు. వివిధ కాలనీలకు చెందిన ప్రజలు కార్యకర్తలు తమ ప్రాంతాల్లో ఉన్న సమస్యల గురించి శ్రీరామ్ దృష్టికి తీసుకొచ్చారు. వీటన్నింటినీ కచ్చితంగా పరిష్కరించే విధంగా అధికారుల దృష్టికి తీసుకెళ్తామని ఆయన హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ అధికారంలోకి వచ్చి 9నెలలు గడిచిందని, ఇక నుంచి మనం క్షేత్రస్థాయిలో ప్రజల వద్దకు వెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పటికంటే అధికారంలో ఉన్నప్పుడే మనపై బాధ్యత ఎక్కువగా ఉంటుందన్నారు. ప్రజలు మీపై నమ్మకంతో ఓట్లు వేశారని... ఏదైనా సమస్య వస్తే పరిష్కరిస్తారనే నమ్మకం వారికి ఉంటుందని... ఆ నమ్మకాన్ని వమ్ము చేయకుండా మనం పని చేయాల్సిన అవసరం ఉంటుందన్నారు. పార్టీలో పదవులు ఇతర పనులు జరగడం లేదన్న ఆవేదన కొంతమందికి ఉందన్నారు. అయితే అధికార పార్టీలో ఉన్నప్పుడు మనకు కొన్ని పరిమితులు ఉంటాయని కార్యకర్తలు వాటిని అర్థం చేసుకోవాలన్నారు. పార్టీలో కష్టపడిన ప్రతి ఒక్కరికి న్యాయం జరుగుతుందని.. ఇంకా నాలుగేళ్ల సమయం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. నియోజకవర్గంలో ఎక్కువమందికి పదవులు వస్తే... అది ప్రజలకు మంచి చేయడానికి ఉపయోగపడుతుందన్నారు. ఇకనుంచి ప్రతి ఒక్కరు తమ వార్డు, గ్రామాల్లో ప్రజల వద్దకు వెళ్లాలన్నారు. వారి సమస్యలను సచివాలయ సిబ్బంది దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా చూడాలని పరిటాల శ్రీరామ్ దిశా నిర్దేశం చేశారు.

### 12మందికి రూ.7.68 సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

ధర్మవరం నియోజకవర్గంలో వివిధ కారణాలతో ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్సలు పొంది ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న 12మందికి 7లక్షల 68వేల రూపాయల సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. ధర్మవరం పార్టీ కార్యాలయంలో లబ్ధిదారులకు ఈ చెక్కులను అందించారు. వారు శ్రీరామ్‌తో పాటు ముఖ్యమంత్రి చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలియజేశారు. ముదిగబ్బ మండలంలో ముగ్గురికి, ధర్మవరం పట్టణంలోని 5మందికి, ధర్మవరం మండలంలోని నలుగురికి ఈ సాయం అందింది. ఈ సందర్భంగా శ్రీరామ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రజల ఆరోగ్యం విషయంలో ఎంత ఖర్చయినా చూడటం లేదన్నారు. సీఎంఆర్ఎఫ్ కింద సాయం అడిగిన వెంటనే స్పందిస్తున్నారన్నారు. ప్రజల సంక్షేమం కోసం ఆలోచిస్తున్న ప్రభుత్వం ఇది అని శ్రీరామ్ అన్నారు.



# ఎందుకు రాద్ధాంతం చేస్తున్నారు!

- పేద ముస్లింలు బాగోగులు పట్టవా
- విపక్షాలపై కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు ధ్వజం
- కేంద్ర ప్రభుత్వం బుధవారం లోక్ సభ ముందుకు వక్ఫ్‌సవరణ బిల్లును

తీసుకువచ్చింది. కేంద్ర మైనార్టీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు బిల్లు ప్రవేశపెట్టిన అనంతరం సభలో ప్రసంగించారు. ఈ బిల్లుపై అన్ని వర్గాల అభిప్రాయాలు తీసుకున్నామని ఆయన ఈ సందర్భంగా వెల్లడించారు. ఈ బిల్లును తీసుకురాకపోతే పార్లమెంట్ భూమిని కూడా వక్ఫ్ ఆస్తి అంటారని పేర్కొన్నారు.

ఈ బిల్లు గురించి విపక్షాలు అసత్య ప్రచారం చేశాయన్నారు. అందులోని అంశాలను లేవనెత్తి ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నాయన్నారు. 1954లో తొలిసారి వక్ఫ్‌చట్టం అమల్లోకి వచ్చిందని, అది అప్రజాస్వామికం అని ఆనాడు ఎవరూ చెప్పలేదని అన్నారు. పార్లమెంట్ ఉభయ సభ్యులతో కూడిన జేపీసీకి అభినందనల తెలిపారు. మొత్తం 284 ప్రతినిధులు, 25 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల వక్ఫ్‌బోర్డులు జేపీసీలో తమ వాదనలు వినిపించాయన్నారు. తాము బిల్లులో కొన్ని సానుకూల మార్పులు చేస్తే.. మమ్మల్ని ఎందుకు ప్రశ్నిస్తున్నారని నిలదీశారు. ఈ బిల్లు తీసుకురాకపోతే.. కొందరు పార్లమెంట్ భవనాన్ని కూడా వక్స్ ఆస్తిగా పేర్కొంటారు" అని సంచలన వ్యాఖ్యలు చేశారు. అయితే ఈ స్పందనకు గతంలో ఏఐయూడీఎఫ్ చీఫ్ బద్రుద్దీన్ అజ్మల్ చేసిన వ్యాఖ్యలు కారణం. దేశ రాజధానిలోని పార్లమెంట్ భవనం, దాని పరిసర ప్రాంతాలు వక్ఫ్ ఆస్తికి సంబంధించినవని అజ్మల్ అప్పట్లో వాదించారు.



"వక్ఫ్ బిల్లు ముస్లిం సమాజానికి చెందిన మత విశ్వాసాలకు ఎలాంటి ఆటంకం కలిగించదు. ఇది కేవలం ఆస్తుల నిర్వహణకు సంబంధించిన విషయం మాత్రమే. ఈ బిల్లుకు మద్దతు ఇచ్చేవారు, వ్యతిరేకించేవారు ఎప్పటికీ గుర్తుండిపోతారు. పేద ముస్లింలకు వక్స్ ఆస్తులను ఉపయోగించాలి. వారిని అలా వదిలేయకూడదు. వారి ఉన్నతి కోసం మోదీ ప్రభుత్వం ఏవైనా చర్యలు తీసుకుంటే ఎందుకు వ్యతిరేకిస్తున్నారు..? ముస్లిం ప్రతినిధులు ఆ బిల్లును ఆహ్వానించారు. వీలైనంత త్వరగా దీనికి ఆమోదం లభించాలని ఆ వర్గంలోని పేదలు కోరుకుంటున్నారు. అలాగే రిజిస్టర్ చేసిన ఆస్తి విషయంలో ఎవరూ జోక్యం చేసుకోరు. ప్రభుత్వం తీసుకువచ్చిన సంస్కరణలతో ముస్లిం మహిళలు, పిల్లలకు వారి హక్కులు దక్కుతాయి. ప్రభుత్వ భూమి విషయంలో వివాదం తలెత్తితే కలెక్టర్ కంటే పైస్థాయి వ్యక్తి తీర్పు ఇవ్వాలంటూ జేపీసీ చేసిన ప్రతిపాదనను మేం అంగీకరించాం" అని రిజిజు స్పష్టత ఇచ్చారు. మరోవైపు విపక్షాలు దీనిని వ్యతిరేకిస్తున్నాయి. ఈ బిల్లుకు వ్యతిరేకంగా కోల్‌కత్తాలో మార్చ్ జరిగింది.

**బిల్లుపై విపక్షాల నిరసనలు**

వివాదాస్పద వర్ఫ్ (సవరణ) బిల్లు లోక్సభ ముందుకువచ్చింది. ఈ బిల్లుకు వ్యతిరేకంగా విపక్షాలు ఆందోళన చేపట్టాయి. వారి నిరసనల నడుమ బుధవారం మధ్యాహ్నం కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు ఈ బిల్లును సభలో ప్రవేశపెట్టారు. అనంతరం బిల్లుపై రిజిజు చర్చ చేపట్టారు. దాదాపు 8 గంటల పాటు చర్చ జరిపిన అనంతరం ఓటింగ్ నిర్వహించనున్నారు. ఈ బిల్లును ఆమోదింపజేసుకోవాలని కేంద్ర ప్రభుత్వం పట్టుదలతో ఉండగా విపక్షాలన్నీ వ్యతిరేకిస్తున్నాయి.

వక్ఫ్ పాలకవర్గాల్లో మరింత పారదర్శకత, జవాబుదారీతనం పెంచుతూ పాలనలో మహిళల భాగస్వామ్యం తప్పనిసరి చేసేలా ఈ కొత్త బిల్లును కేంద్రం తీసుకొచ్చింది. ఈ మేరకు 1995 నాటి చట్టంలో దాదాపు 40 సవరణలు చోటుచేసుకోనున్నాయి. ముస్లిం సమాజం నుంచి వస్తున్న డిమాండ్ల మేరకే ఈ మార్పులు చేస్తున్నట్లు ప్రభుత్వ వర్గాలు చెప్పాయి. ఈ బిల్లును గతేడాది ఆగస్టులోనే కేంద్రం లోకసభలో ప్రవేశపెట్టింది. అప్పుడు దీనిపై విపక్షాల నుంచి పెద్దఎత్తున వ్యతిరేకత రావడంతో దీనిని సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జేపీసీ) పరిశీలనకు పంపింది. ఈ కమిటీ పలు ప్రతిపాదనలతో బిల్లుకు ఆమోదం తెలిపింది. ఈ నేపథ్యంలో వక్స్ బిల్లును కేంద్రం లోక్ సభ ముందుకు తీసుకొచ్చింది. లోక్ సభలో ఆమోదం పొందిన తర్వాత గురువారం రాజ్యసభలో ప్రవేశపెట్టనున్నారు. ఉభయ సభల్లో అధికార ఎన్డీయేకు మెజారిటీ ఉన్నందున బిల్లు ఆమోదానికి ఎలాంటి ఇబ్బంది ఉండదని భాజపా భావిస్తోంది.

## ముష్కరులను మట్టుబెట్టి

# దాయాదులకు బుద్ధి చెప్పిన భారత సైన్యం



భారత సైన్యం మరోసారి దాయాది దేశం పాకిస్థాన్ సైనికుల ఆటకట్టించాయి. పాక్ సైన్యం చేసిన చొరబాటు యత్నాలను భారత సైన్యం సమర్థవంతంగా భగ్నం చేశాయి. దాయాది దేశ సైన్యం కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించింది. జమ్ము కశ్మీర్‌లోని పూంచ్ జిల్లాలో నియంత్రణ రేఖ వద్ద పాక్ ఆర్మీ చొరబాట్లకు పాల్పడిందని భారత సైనిక వర్గాలు వెల్లడించాయి. ఈ నెల 1న కృష్ణ ఘాటి సెక్టార్ వద్ద పాక్ ఆర్మీ చొరబాట్లకు పాల్పడిందని తెలిపాయి. ఈ నేపథ్యంలో అక్కడ మందుపాతర పేలిన ఘటన చోటుచేసుకుంది. ఆ తర్వాత పాక్ సైన్యం కాల్పులు జరిపి, ఒప్పందాన్ని ఉల్లంఘించినట్లు పేర్కొన్నాయి. అందుకు దీటుగా బదులిచ్చిన భారత సైన్యం, ఎదురుకాల్పు జరిపినట్లు సైనిక వర్గాలు వెల్లడించాయి. ఈ ఘటనలో ఐదుగురు చొరబాటుదారులు.. మరణించినట్లు తెలుస్తోంది. తమ వైపు ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని భారత ఆర్మీ వెల్లడించింది. ప్రస్తుతం పరిస్థితి అదుపులో ఉందని తెలిపింది.

గత రెండు నెలలుగా నియంత్రణ రేఖ వెంబడి చొరబాటు ప్రయత్నాలు, కాల్పులు ఘటనలు గణనీయంగా పెరిగాయి. ఉగ్రవాదులతో కలిసి పాక్ సైన్యం అనేకసార్లు చొరబాటు ప్రయత్నాలకు చేసినా వాటిని మన సైన్యం సమర్థవంతంగా తిప్పికొట్టాయి. ఈ ఏడాది ఫిబ్రవరిలో ఎవ్వోసీ వద్ద పాక్ సైన్యం కాల్పులు జరపడంతో పాటు పేలుడు పదార్థాలతో దాడులు చేశాయి. సరిహద్దుల్లో ఉద్రిక్తతను తగ్గించే ఉద్దేశంతో 2021లో భారత్, పాకిస్తాన్ కాల్పుల విరమణ ఒప్పందాన్ని పునరుద్ధరించాయి. అయితే ఈ మధ్య కాలంలో పాక్ తరుచూ నిబంధలను ఉల్లఘించడం ఆందోళన కలిగిస్తుంది.



# రెచ్చిపోతున్న సైబర్ నేరగాళ్ళ

## ఆగని మోసకారి లింకులు

## కుదేలవుతున్న మదుపరులు

అధిక లాభాల ఆశ చూపిస్తూ అమాయకుల్ని లక్ష్యంగా చేసుకొని సైబర్ కేటుగాళ్లు రెచ్చిపోతున్నారు. తాజాగా వాట్సప్‌లో పంపిన లింక్‌పై క్లిక్ చేసిన ఓ ఉద్యోగి నుంచి స్టాక్ మార్కెట్ ట్రేడింగ్ పేరిట భారీ మోసానికి తెగబడ్డారు. ఉత్తరప్రదేశ్‌లోని సోనా భద్రలో వెలుగుచూసిందీ ఘటన. నార్తన్ కోల్ ఫీల్డ్స్ లిమిటెడ్ (ఎన్సీఎల్)లో పనిచేస్తున్న యుగల్ కిశోర్ తివారీ అనే వ్యక్తి స్టాక్ మార్కెట్ ఇన్వెస్టిమెంట్ పేరిట రూ.2.27 కోట్లు నష్టపోయినట్లు సైబర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ ఘటనపై పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తివారీకి ఈ ఏడాది జనవరి 13న వాట్సప్‌లో ఒక లింక్ వచ్చింది. దానిపై క్లిక్ చేసి మోసపూరిత ట్రేడింగ్ అప్లికేషన్ యాప్ డౌన్లోడ్ చేయగా.. అతడికి రెండు డీమ్యాట్ ఖాతా నంబర్లు వచ్చాయి.

స్టాక్ ట్రేడింగ్ నుంచి భారీ లాభాలు వస్తాయని హామీ ఇవ్వడంతో ఆ ఆపరేటర్ల మాటలు నమ్మిన తివారీ భారీగా పెట్టుబడి పెట్టాడు. మొత్తం 24 వేర్వేరు ట్రాన్సాక్షన్లలో రూ.1.46 కోట్లు, ఆ తర్వాత అతడి మేనకోడలు ఖాతా నుంచి 10 ట్రాన్సాక్షన్లలో రూ.81లక్షలు బదిలీ చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నాడు. దీంతో ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

# రిటైర్మెంట్ రోజే అనంతలోకాలకు

*- లోకోపైలట్ ఇంట విషాదం!*

ఎన్నో ఏళ్లుగా విధి నిర్వహణలో తలమునకలై.. ఇకనైనా తమ కుటుంబంతో హాయిగా గడపొచ్చని కలలు కన్న ఆ లోకో పైలెట్‌కు రిటైర్మెంట్ రోజే చివరి రోజు అయ్యింది. ఆయనతో కలిసి భోజనం చేయాలని ఎదురు చూస్తున్న కుటుంబానికి కన్నీరే మిగిలింది. ఝార్కండ్‌లోని సాహెబ్ గంజ్ జిల్లాలో రెండు గూడ్స్ రైళ్లు ఢీకొన్న ప్రమాదంలో కన్నుమూసిన లోకో పైలట్ గంగేశ్వర్ మృతితో ఆయన కుటుంబం శోకసంద్రంలో మునిగిపోయింది. మంగళవారం తెల్లవారుజామున 3గంటలకు రాంచీలోని సాహెబ్ గంజ్ జిల్లాలో విద్యుత్ సంస్థ ఎన్టీపీసీకి చెందిన రెండు గూడ్స్ రైళ్లు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో రెండు గూడ్సు రైళ్ల డ్రైవర్లు మృతిచెందగా, మరో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ప్రమాదంలో మృతి చెందిన లోకో పైలట్ గంగేశ్వర్ ఈ నెల 1న పదవీ విరమణ చేయాల్సి ఉంది. కాగా అదే రోజు ఉదయం ప్రాణాలు కోల్పోవడంతో ఇంట్లో విషాద ఛాయలు అలుముకున్నాయి. విధుల్లో చివరి రోజున తోటి వారితో కలిసి సరదాగా గడిపి.. ఎన్నో జ్ఞాపకాలతో తిరిగి వస్తాడనుకున్న తన తండ్రి ఇంకెప్పటికీ రాడనే విషయాన్ని నమ్మలేకపోతున్నామని అతడి కుమార్తె కన్నీరు మున్నీరయింది. రేపటి నుంచి



ఇంట్లోనే ఉండి విశ్రాంతి తీసుకుంటానని ఆనందంగా చెప్పి వెళ్లిన తండ్రి విగతజీవిగా తిరిగి వచ్చాడని ఆవేదన వ్యక్తం చేసింది.

# ఫారిన్ స్టూడెంట్స్‌పై యూఎస్ ఏఐ నిఘా


క్యాంపస్ ఆందోళనల్లో క్రియాశీలంగా వ్యవహరించిన అమెరికాలోని విదేశీ విద్యార్థులకు అక్కడి విదేశాంగశాఖ హెచ్చరికలు జారీ చేసిన విషయం తెలిసిందే. కేవలం ఆందోళనల్లో పాల్గొన్న వారినే కాకుండా అక్కడి దృశ్యాలను, జాతి వ్యతిరేక సందేశాలను సామాజిక మాధ్యమాల్లో షేర్ చేసిన వారిని స్వచ్ఛందంగా దేశం విడిచి వెళ్లిపోవాలంటూ ఈ మెయిల్స్ పంపినట్లు అధికారులు పేర్కొన్నారు. ఈనేపథ్యంలో ఓ కీలకమైన విషయం వెలుగులోకి వచ్చింది. హమాస్ అనుకూల ఉగ్రవాద గ్రూపులకు మద్దతిస్తున్న విదేశీ విద్యార్థులను గుర్తించడానికి, వారిపై నిఘా పెట్టడానికి అమెరికా ప్రభుత్వం ఏఐ సాంకేతికతను ఉపయోగిస్తున్నట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. ఉగ్రవాద అనుకూల పోస్టు, స్టోరీలకు ఇన్‌స్టాలో లైక్ కొట్టినా దొరకబుచ్చుకునేలా ట్రంప్ యంత్రాంగం సాంకేతికతను వినియోగిస్తున్నట్లు పేర్కొన్నాయి. యూఎస్ విదేశాంగ కార్యదర్శి మార్కో రూబియో నాయకత్వంలో అధికారులు ఈ చర్యలు తీసుకుంటున్నట్లు ప్రభుత్వ ఉన్నతాధికారులు పేర్కొన్నారు. 2023 అక్టోబర్ 7న హమాస్ ఇజ్రాయెల్‌పై దాడి చేసిన నాటినుంచి ఇప్పటివరకు వారికి మద్దతుగా ఎవరెవరు సోషల్ మీడియా ఖాతాల్లో పోస్టు చేశారు, ఎవరు వాటిని లైక్, షేర్ చేశారనే విషయాలు తెలుసుకోవడానికి విదేశీ విద్యార్థుల సోషల్ మీడియా ఖాతాలను స్కాన్ చేస్తున్నట్లు యాక్సియోస్ అనే నివేదిక వెల్లడించింది. నివేదికలోని వివరాల ప్రకారం.. విదేశీ విద్యార్థుల సోషల్ మీడియా ఖాతాలపై కొంతకాలంగా ఏఐ నిఘా కొనసాగుతోంది. విద్యార్థులు వారు చేసిన పోస్టును తొలగించినప్పటికీ ప్రభుత్వ విభాగాల వద్ద వాటి స్క్రీన్ షాట్లు ఉంటాయి.

బైడెన్ అధికారంలో ఉన్న సమయంలో బహిష్కరణ వేటు పడినప్పటికీ యూఎస్‌లోనే ఉంటున్న అక్రమ వలసదారులను (విద్యార్థులు) గుర్తించడానికి కూడా ట్రంప్ యంత్రాంగం వీటిని ఉపయోగిస్తోంది. ఇందులో భాగంగా ఇప్పటివరకు లక్షకు పైగా విదేశీయుల ప్రొఫైళ్లను ఫెడరల్ అధికారులు స్కాన్ చేశారు. ఓపెన్ డోర్స్ నివేదిక ప్రకారం.. 2023-24 విద్యా సంవత్సరంలో అమెరికా రికార్డు స్థాయిలో 1.1 మిలియన్ల అంతర్జాతీయ విద్యార్థులకు ఆతిథ్యం ఇచ్చింది. వీరిలో 3 లక్షలకు పైగా భారత్‌నుంచి వచ్చారు. ట్రంప్ రెండోసారి అధికారంలోకి వచ్చినప్పటినుంచి అమెరికాకు వ్యతిరేకంగా ఉన్న అన్ని విషయాలపై ఉక్కుపాదం మోపారు. ఇందులో భాగంగానే జాతి వ్యతిరేక ప్రచారానికి పాల్పడుతున్న వారి సోషల్ మీడియా ఖాతాలను అమెరికా విదేశాంగశాఖ జల్లెడ పడుతోంది. ఒకవేళ అదే నిజమని తేలితే ఆ విద్యార్థులకు అమెరికాలో చదువుకునే వీల్లేకుండా తక్షణమే స్వదేశానికి పంపించే యోచనలో ఉన్నట్లు స్పష్టంగా తెలుస్తోంది. ఈమేరకు అమెరికా విదేశాంగశాఖ, కాన్సులేట్ అధికారుల సమావేశంలో నిర్ణయం తీసుకున్నట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు వెలువరించింది. ఈ మేరకు హెచ్చరిక సందేశాలు అందుకున్నవారు.. తమ స్వదేశాలకు వెళ్లేందుకు సీబీపీ హోమ్ యాప్ ఉపయోగించుకోవచ్చని తెలిపింది.

## కొడుకుకే ఉద్యోగమివ్వని బిలియనీర్

### అర్హత సంపాదించుకున్నాకే అవకాశాలు..


ఒక తరం వ్యాపార సామ్రాజ్యాన్ని నిర్మిస్తే.. తర్వాతి తరం ఆ పగ్గాలను అందిపుచ్చుకుంటుంది. వారసత్వం కారణంగా ఉన్నత హోదాలు అధిరోహిస్తుంటుంది. దాదాపు పలు సంస్థల్లో ఇదే ట్రెండ్ కనిపిస్తుంది. కానీ రియల్‌ఎస్టేట్ రంగానికి చెందిన ఓ బిలియనీర్ మాత్రం ఆ ట్రెండును బ్రేక్ చేశారు. సొంత కుమారుడికే ఉద్యోగం ఇవ్వడానికి నిరాకరించారు. ఎందుకంటే అమెరికాలోని ఫ్లోరిడా కేంద్రంగా రిలేటెడ్ గ్రూప్ కార్యకలాపాలు నిర్వహిస్తోంది. రియల్‌ఎస్టేట్ రంగానికి చెందిన ప్రముఖ సంస్థ ఇది. సంస్థ అధినేత జోర్గ్ పెరెజ్.. 60 బిలియన్ డాలర్ల విలువైన సంస్థ భవిష్యత్తుకు అధిక ప్రాధాన్యమి చ్చారు. దాంతో కళాశాల చదువు పూర్తిచేసుకొని, సంస్థలో చేరేందుకు ఆసక్తి చూపిన కుమారుడు జాన్ పాల్‌కు ఉద్యోగం ఇవ్వనని తేల్చిచెప్పారు. “నువ్వు నా దగ్గర పనిచేయడం కుదరదని చెప్పాను. నా వారసుడు అయిన కారణంగా సంస్థ ప్రతిష్ఠను పణంగా పెట్టాలనుకోలేదు. అందుకే నా స్నేహితుడి సంస్థలో చేరి, నిరూపించుకోవాలని సూచించాను. అయితే అందుకు నా కొడుకు అంగీకరించలేదు. ఏదో ఒకరోజు మన సంస్థలో పని చేయాలంటే సవాళ్లతో కూడిన న్యూయార్క్ రియల్‌ఎస్టేట్ మార్కెట్లో ఐదేళ్లు పని చేయాల్సిందేనని నా పిల్లలకు స్పష్టం చేశాను. అలాగే టాప్ బిజినెస్ స్కూల్ పట్టా పొందాలని షరతు విధించాను.

నేను రియల్‌ఎస్టేట్ రంగంలో విజయం సాధించాను కాబట్టి.. వారికి అంతగా ఆసక్తి లేకపోయినా ఈ రంగంలోకి రాకూడదు. జీవితం నిత్యం సవాళ్లతో కూడి ఉంటుంది. డబ్బు సంపాదించడం కోసం నచ్చని పని చేయొద్దు. అలా చేయడం ఏమాత్రం ఉపయోగపడదు. అలాగే ఇంటిపేరు కారణంగా పదవులు దక్కాయని నా సిబ్బంది భావించకూడదు. నా స్నేహితుడు, బిలియనీర్ అయిన స్టీఫెన్ రాస్ సంస్థలో జాన్ అనలిస్టుగా చేరాడు. అలాగే నార్త్ వెస్టర్న్ యూనివర్సిటీకి చెందిన కెల్లాగ్ స్కూల్ ఆఫ్ మేనేజ్మెంట్ నుంచి ఎంబీఏ పూర్తి చేశారు” అని పెరెజ్ మీడియాతో మాట్లాడారు.

ఇదంతా 2012లో జరిగింది. ఆ సమయానికి రిలేటెడ్ గ్రూప్‌లో చేరేందుకు జాన్‌పాల్ తగిన అనుభవం సంపాదించారు. అయినా సరే టాప్ పోస్ట్ మాత్రం దక్కలేదు. తొలుత సంస్థకు చెందిన రెంటల్ బిజినెస్ చూసుకున్నారు. తర్వాత తన పనితీరుతో సీఈఓ స్థానాన్ని దక్కించుకున్నారు. తన సోదరుడు కూడా అదే దారిలో వెళ్లి, ఉన్నతస్థానానికి చేరారు. ప్రస్తుతం పెరెజ్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్‌గా రిలేటెడ్ గ్రూప్ కార్యకలాపాలను పర్యవేక్షిస్తున్నారు. దశాబ్దకాలం తన కుమారుల సామర్థ్యాలను పరీక్షించిన తర్వాతే వారికి ఆ స్థానాలు దక్కాయని పెరెజ్ వెల్లడించారు.

## ఏటా.. 700 బిలియన్ డాలర్లు

### - టారిఫ్‌ల పెంపుతో అమెరికాకు కలిసొచ్చేదిదే

భారత్ సహా అనేక దేశాలపై ప్రతీకార సుంకాలు విధించేందుకు అమెరికా సిద్ధమైంది. మరికొన్ని గంటల్లోనే అధ్యక్షుడు ట్రంప్ వీటిపై ప్రకటన చేయనుండగా.. తక్షణమే అమల్లోకి వస్తాయని వైట్‌హౌస్ వర్గాలు తెలిపాయి. ఈ నేపథ్యంలో వీటివల్ల అగ్రరాజ్యానికి ఏటా భారీ స్థాయిలో ఆదాయం సమకూరే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. వైట్‌హౌస్ వర్గాల ప్రకారం ఏటా 600 బిలియన్ల నుంచి 700 బిలియన్ డాలర్ల ఆదాయం సమకూరనున్నట్లు అంచనా.

**పదేళ్లలో 6 ట్రిలియన్ డాలర్లు..**

చైనా, కెనడా, మెక్సికో నుంచి దిగుమతి చేసుకునే కొన్ని వస్తువులపై 25శాతం సుంకాలు విధిస్తామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇదివరకే స్పష్టం చేశారు. మరికొన్ని వస్తువులపై ఇవి భారీగా ఉండనున్నాయనే సంకేతాలు ఇచ్చారు. అయితే, వీటివల్ల అమెరికాకు ఏమేరకు ఆదాయం సమకూరుతుందనే విషయం ఆసక్తిగా మారింది. వీటిపై వైట్‌హౌస్ వాణిజ్య సలహాదారు పీటర్ నవారో మాట్లాడుతూ.. కొత్త టారిఫ్‌లవల్ల ఏటా 600 బిలియన్ డాలర్ల ఆదాయం సమకూరే అవకాశం



ఉందని అంచనా వేశారు. ఆటో టారిఫ్‌లవల్ల మరో 100 బిలియన్ డాలర్లు వస్తాయన్నారు. మొత్తంగా వచ్చే పదేళ్ల కాలంలో 6 ట్రిలియన్ డాలర్లు సమకూరనున్నట్లు పేర్కొన్నారు.

**భారీ ఆదాయం కష్టమే..!**

ఇదే విషయంపై చట్టసభ సభ్యులతో ట్రెజరీ సెక్రటరీ స్కాట్ బెసెంట్ మాట్లాడుతూ.. ఈ సుంకాలపై పరిమితి ఉంటుందని, ఆయా దేశాలతో చర్చల తర్వాత వీటిని తగ్గించే అవకాశం ఉందన్నారు. వైట్‌హౌస్ మాత్రం వీటి విధానానికి సంబంధించి అధికారికంగా ఎటువంటి వివరాలు వెల్లడించలేదు. అయితే, వైట్‌హౌస్ వర్గాల అంచనాకంటే ఈ ఆదాయం తక్కువే ఉంటుందని ఆర్థిక నిపుణులు భావిస్తున్నారు. వైట్‌హౌస్ వర్గాలు చెబుతున్నట్లుగా అంత ఆదాయం వచ్చే అవకాశం లేదని, 100బిలియన్ డాలర్ల నుంచి 200బిలియన్ డాలర్లు వస్తే అదృష్టమని మూడీ చీఫ్ ఎకానమిస్ట్ మార్క్ జాండీ పేర్కొన్నారు.

**పన్నుల భారమేనా..?**

దిగుమతులపై సరాసరి 20శాతం పన్ను విధిస్తే ఒక్కో కుటుంబంపై అదనంగా 3400 డాలర్ల నుంచి 4200 డాలర్ల భారం పడనున్నట్లు యేల్ యూనివర్సిటీ నిపుణులు అంచనా వేస్తున్నారు. దేశీయంగా ఉత్పత్తులను పెంచడంవల్ల ఆ రంగంలో ఉపాధి అవకాశాలు పెరుగుతాయని ట్రంప్ యంత్రాంగం భావిస్తోంది. ఈ నేపథ్యంలో అధ్యక్షుడు ట్రంప్ విధానం కచ్చితంగా సరైందేనని వైట్‌హౌస్ వర్గాలు ధీమా వ్యక్తం చేస్తున్నప్పటికీ.. ప్రజలు, మిత్రదేశాలు మాత్రం ఈ సుంకాలను ముప్పుగానే భావిస్తున్నాయి.

## ఐదు రోజుల తరువాత శిథిలాలనుంచి సజీవంగా

భారీ భూకంపంతో మయన్మార్, థాయిలాండ్‌లు వణికిపోతున్నాయి. ఈ ప్రకృతి విపత్తు కారణంగా మయన్మార్‌లో మృతుల సంఖ్య అంతకంతకూ పెరిగిపోతోంది. అదేవిధంగా శిథిలాల కింద చిక్కుకుపోయిన వేలాది మందిని రక్షించేందుకు సహాయక సిబ్బంది కృషి చేస్తున్నారు. ఈక్రమంలో శిథిలాల కింద చిక్కుకుపోయిన ఓ వ్యక్తిని సిబ్బంది రక్షించారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. మయన్మార్, టర్కిష్కు చెందిన సిబ్బంది రెస్క్యూ ఆపరేషన్ కొనసాగిస్తున్నారు. ఈక్రమంలోనే రాజధాని నేపిడాలోని ఓ భవనం శిథిలాల కింద 26 ఏళ్ల వ్యక్తిని గుర్తించారు. వెంటనే అతడిని రక్షించి, ఆస్పత్రికి తరలించారు. ఇటీవల రెస్క్యూ సిబ్బంది మాండలేలోని గ్రేట్ వాల్ హోటల్ శిథిలాల నుంచి ఒక గర్భిణీని సజీవంగా బయటకు తీసిన సంగతి తెలిసిందే. ఇక, ఈ భూకంపం కారణంగా మధ్య, వాయువ్య మయన్మార్లో మొత్తం 10 వేల భవనాలు కులిపోవడం లేదా పూర్తిగా దెబ్బతిన్నాయని ప్రపంచ ఆరోగ్య సంస్థ తెలిపింది.

నిమిషాల వ్యవధిలో వచ్చిన భారీ భూకంపాలతో ఇటీవల మయన్మార్ కుదేలైంది. బలమైన ప్రకంపనల ధాటికి పలు నిర్మాణాలు, భవనాలు ఎక్కడికక్కడ పేకమేడల్లా కూలిపోయాయి. ప్రకృతి విపత్తు కారణంగా ఇక్కడ ఇప్పటివరకు 2,719 మంది మృతిచెందగా.. 4,521 మంది గాయపడ్డారు. ఇంకా 441 మంది ఆచూకీ తెలియరావాల్సి ఉంది. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. విపత్కర సమయంలో పొరుగుదేశానికి అండగా నిలిచేందుకు ‘ఆపరేషన్ బ్రహ్మ’ పేరిట భారత్ పెద్దఎత్తున సహాయక సామగ్రిని చేరవేస్తోంది. 80 మందితో కూడిన ఎన్డీఆర్ఎఫ్ బృందం సహాయక చర్యల్లో పాల్గొంటోంది. భారత్‌తోపాటు వివిధ దేశాలు కూడా మయన్మార్‌కు సాయాన్ని అందిస్తామని ప్రకటించాయి. ఇక, థాయిలాండ్ రాజధాని బ్యాంకాక్‌లో ఇప్పటివరకు 13 మృతదేహాలు బయటపడ్డాయి. భూకంపం కారణంగా నిర్మాణంలో ఉన్న 30 అంతస్తుల భవనం కూలిపోయిన సంగతి తెలిసిందే. ఈ ఘటనలో శిథిలాల కింద 300మంది కార్మికులు చిక్కుకుని ఉంటారని, వారిలో ఎక్కువమంది విదేశాల నుంచి వచ్చినవారేనని మీడియా కథనాలు వెల్లడిస్తున్నాయి.

## లక్షమంది హసీనా కార్యకర్తలు భారత్‌కు పరారీ

బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనాపై ప్రస్తుత తాత్కాలిక ప్రభుత్వ అడ్వైజర్ ఒకరు తీవ్ర విమర్శలు చేశారు. భారత్‌లో కూర్చొని ఆమె తన సొంత దేశానికి వ్యతిరేకంగా కుట్రలు పన్నుతున్నారని బంగ్లా ప్రభుత్వ సమాచార సలహాదారు మహూజ్ ఆలమ్ ఆరోపించారు. అంతేకాదు.. హసీనాతో పాటు ఆమె పార్టీ అవామీ లీగ్‌కు చెందిన దాదాపు లక్షమంది కార్యకర్తలు భారత్‌కు పారిపోయి ఆశ్రయం పొందుతున్నారని సంచలన ఆరోపణలు చేశారు.

రంజాన్ సందర్భంగా ఢాకాలో ఓ కార్యక్రమం ఏర్పాటుచేశారు. హసీనా ప్రభుత్వ హయాంలో అదృశ్యమైన లేదా ప్రాణాలు కోల్పోయిన బాధితుల కుటుంబ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఇందులో పాల్గొన్న ఆలమ్.. మాజీ ప్రధానిపై తీవ్రంగా విరుచుకుపడ్డారు. “తన తల్లిదండ్రుల హత్యకు ప్రతీకారంగా హసీనా దేశంలో పలు అక్రమాలకు పాల్పడ్డారు. ఎదురుతిరిగిన వారి ప్రాణాలు తీసేందుకు కూడా వెనుకాడలేదు. 2013-14 మధ్య ఓటు హక్కు కోసం ప్రజలు పోరాడుతున్న సమయంలో పెద్ద సంఖ్యలో మిస్సింగ్ ఘటనలు చోటుచేసుకున్నాయి. వారి ఆచూకీ ఇప్పటివరకు తెలియరాలేదు. ఎన్నికల వ్యవస్థను నిర్వీర్యం చేసేందుకు ఆమె ఎన్నో దారుణాలు చేశారు” అని ఆలమ్ మండిపడ్డారు.

“అవామీ లీగ్‌ను వ్యతిరేకించిన వారిని ఉగ్రవాదులు, మిలిటెంట్లుగా ముద్ర వేసి వారిని కన్పించకుండా చేశారు. ఇప్పుడు కూడా భారత్‌లో కూర్చుని బంగ్లాకు వ్యతిరేకంగా కుట్రలు పన్నుతున్నారు. హసీనాతోపాటు దాదాపు లక్షమందికి పైగా అవామీ లీగ్ కార్యకర్తలు ఆ దేశానికి పారిపోయారు. వారికి భారత్ ఆశ్రయం ఇవ్వడం దురదృష్టకరం” అని అలమ్ ఆరోపించారు.

బంగ్లాదేశ్‌లో రిజర్వేషన్లకు వ్యతిరేకంగా చోటుచేసుకున్న ఆందోళనకర పరిస్థితుల నేపథ్యంలో గతేడాది ఆగస్టు 5న దేశం వీడిన షేక్ హసీనా.. భారత్‌లో ఆశ్రయం పొందుతున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో హసీనాతోపాటు ఆమె మంత్రివర్గంలో ఉన్న నేతలు, సలహాదారులు, సైనికాధికారులపై నేరారోపణలు నమోదయ్యాయి. స్వదేశంలో హసీనాపై 100కు పైగా కేసులున్నాయి. ఇప్పటికే ఇంటర్నేషనల్ క్రైమ్స్ ట్రైబ్యునల్ ఆమెకు అరెస్టు వారెంట్ జారీ చేసింది.

## ఆర్‌సీబీ జోరుకు బ్రేక్..

# 8 వికెట్ల తేడాతో గుజరాత్ ఘన విజయం





ఐపీఎల్ 2025 సీజన్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు(ఆర్‌సీబీ) జోరుకు బ్రేక్‌పడింది. బుధవారం ఏకపక్షంగా సాగిన మ్యాచ్‌లో సమష్టిగా రాణించిన గుజరాత్ టైటాన్స్.. 8 వికెట్ల తేడాతో ఆర్‌సీబీని చిత్తు చేసింది. బౌలింగ్‌లో సిరాజ్(3/19).. బ్యాటింగ్‌లో జోస్ బట్లర్.. ఆర్‌సీబీని చెడుగుడు ఆడేసారు.

ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన ఆర్‌సీబీ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్లకు 169 పరుగులు చేసింది. లియామ్ లివింగ్ స్టోన్(40 బంతుల్లో ఫోర్, 5 సిక్స్‌లతో 54) హాఫ్ సెంచరీతో రాణించగా.. జితేష్ శర్మ(21 బంతుల్లో 5 ఫోర్లు, సిక్స్‌తో 33), టీమ్ డేవిడ్(18 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్స్‌లతో 32) దూకుడుగా ఆడారు. గుజరాత్ టైటాన్స్ బౌలర్లలో మహమ్మద్ సిరాజ్ మూడు వికెట్లు తీయగా.. సాయి కిషోర్(2/22) రెండు వికెట్లు పడగొట్టాడు. అర్షద్ ఖాన్, ఇషాంత్ శర్మ తలో వికెట్ తీసారు.

అనంతరం గుజరాత్ టైటాన్స్ 17.2 ఓవర్లలో 2 వికెట్లకు 170 పరుగులు చేసి సునాయస విజయాన్నందుకుంది. జోస్ బట్లర్(39 బంతుల్లో 5 ఫోర్లు, 6 సిక్స్‌లతో 73 నాటౌట్) అజేయ హాఫ్ సెంచరీతో చెలరేగగా.. సాయి సుదర్శన్(36 బంతుల్లో 7 ఫోర్లు, సిక్స్‌తో 49)రాణించాడు. ఆర్‌సీబీ బౌలర్లలో భువనేశ్వర్ కుమార్, జోష్ హాజెల్ వుడ్ తలో వికెట్ తీసారు.

**మ్యాచ్ టర్నింగ్ పాయింట్..**

పవర్ ప్లేలోనే ఆర్‌సీబీ నాలుగు వికెట్లు కోల్పోవడం ఆ జట్టు విజయావకాశాలు దెబ్బతీసింది. సూపర్ ఫామ్‌లో ఉన్న ఫిల్ సాల్ట్‌తో పాటు విరాట్ కోహ్లీ, దేవదత్ పడిక్కల్, రజత్ పటీదార్ పేలవ ప్రదర్శన ఈ మ్యాచ్‌కు టర్నింగ్ పాయింట్‌గా నిలిచింది. ఈ టాప్-4 బ్యాటర్లలో ఒక్కరు క్రీజులో నిలబడినా ఫలితం మరోలా ఉండేది. సంచలన బౌలింగ్ ప్రదర్శనతో ఈ మ్యాచ్‌లో సిరాజ్ మోస్ట్ వాల్యూబుల్ ప్లేయర్‌గా నిలిచిపోయాడు. విధ్వంసకర బ్యాటింగ్‌తో ఆర్‌సీబీ లక్ష్యాన్ని చిన్నది చేసిన జోస్ బట్లర్ అన్‌సంగ్ హీరోగా నిలిచాడు.

**జోస్ బట్లర్ విధ్వంసం..**

ఈ స్వల్ప లక్ష్యాన్ని గుజరాత్ టైటాన్స్ ఆడుతూ పాడుతూ ఛేదించింది. కెప్టెన్ శుభ్‌మన్ గిల్(14) విఫలమైనా.. జోస్ బట్లర్‌తో కలిసి సాయి సుదర్శన్ ఇన్నింగ్స్‌ను ముందుకు నడిపించాడు. ఆరంభంలో కాస్త ఆచితూచి ఆడటంతో పవర్ ప్లేలో గుజరాత్ వికెట్ నష్టానికి 42 పరుగులే చేసింది. అనంతరం కాస్త దూకుడు పెంచిన ఈ జోడీ ఆర్‌సీబీ బౌలర్లపై భారీ షాట్లతో విరుచుకుపడింది.

హాఫ్ సెంచరీ ముంగిట సాయి సుదర్శన్‌ను హాజెల్ వుడ్.. కీపర్ క్యాచ్‌గా ఔట్ చేయగా.. షెర్ఫేన్ రుథర్‌ఫోర్డ్ సాయంతో జోస్ బట్లర్ చెలరేగాడు. భారీ సిక్సర్లు బాదిన అతను 31 బంతుల్లో హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. మరో ఎండ్‌లో రూథర్‌ఫోర్డ్ సైతం బ్యాట్‌కు పనిచెప్పడంతో ఆర్‌సీబీ బౌలర్లు ఏం చేయలేకపోయాడు. హాజెల్ వుడ్ వేసిన 18వ ఓవర్‌లో జోస్ బట్లర్ రెండు భారీ సిక్సర్లు బాది విజయాన్ని ఖాయం చేయగా.. రూథర్‌ఫోర్డ్ సిక్సర్‌తో మ్యాచ్‌ను ముగించాడు.

**మలుపు తిప్పిన సిరాజ్..**

అంతకుముందు టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ఆర్‌సీబీకి ఆదిలోనే గట్టి షాక్ తగిలింది. పిచ్ నుంచి లభించిన సహకారాన్ని గుజరాత్ టైటాన్స్ బౌలర్లు అందిపుచ్చుకున్నారు. సిరాజ్ వేసిన తొలి ఓవర్‌లోనే ఫిల్ సాల్ట్ ఇచ్చిన సునాయస క్యాచ్‌ను జోస్ బట్లర్ నేలపాలు చేశాడు. కానీ ఆ మరుసటి ఓవర్‌లోనే విరాట్ కోహ్లీని(7) అర్షద్ ఖాన్ క్యాచ్ ఔట్‌గా పెవిలియన్ చేర్చాడు. అనంతరం సిరాజ్ తన వరుస ఓవర్లలో దేవదత్ పడిక్కల్(4)తో పాటు డేంజరస్ ఫిల్ సాల్ట్(14)ను క్లీన్ బౌల్డ్ చేశాడు. రెండు లైఫ్‌లు వచ్చినా ఫిల్ సాల్ట్ సద్వినియోగం చేసుకోలేకపోయాడు. దాంతో 35 పరుగులకే ఆర్‌సీబీ మూడు వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది.

**ఆదుకున్న లివింగ్, జితేష్..**

పవర్ ప్లే అనంతరం రజత్ పటీదార్‌ను ఇషాంత్ శర్మ ఎల్బీగా పెవిలియన్ చేర్చాడు. ఈ పరిస్థితుల్లో జితేష్ శర్మ, లియామ్ లివింగ్ స్టోన్ జట్టును ఆదుకునే ప్రయత్నం చేశారు. జితేష్ శర్మ భారీ షాట్లతో విరుచుకుపడ్డాడు. 52 పరుగుల భాగస్వామ్యంతో క్రీజులో సెట్ అయిన ఈ జోడీని సాయి కిషోర్ విడదీసాడు. భారీ షాట్ ఆడే ప్రయత్నంలో జితేష్ శర్మ క్యాచ్ ఔట్‌గా వెనుదిరిగాడు. క్రీజులోకి వచ్చిన కృనాల్ పాండ్యా(5) తీవ్రంగా నిరాశపర్చాడు. సాయికిషోర్‌కు రిటర్న్ క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. టీమ్ డేవిడ్‌తో కలిసి లివింగ్ స్టోన్ చెలరేగాడు.

ముఖ్యంగా రషీద్ ఖాన్ బౌలింగ్‌లో విరుచుకుపడ్డాడు. అతని బౌలింగ్‌లో లివింగ్ స్టోన్ 5 సిక్సర్లు బాదడం విశేషం. ఈ క్రమంలో అతను 39 బంతుల్లో హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. మరో ఎండ్‌లో టీమ్ డేవిడ్ ఉండటంతో.. ఆర్‌సీబీ 190 పరుగులు చేస్తుందని అంతా అనుకున్నారు. కానీ 19వ ఓవర్ వేసిన సిరాజ్.. లివింగ్ స్టోన్‌ను కీపర్ క్యాచ్‌గా పెవిలియన్ చేర్చాడు. దాంతో ఆ ఓవర్‌లో 4 పరుగులు మాత్రమే వచ్చాయి. ప్రసిద్ కృష్ణ వేసిన ఆఖరి ఓవర్‌లో టీమ్ డేవిడ్.. వరుసగా 4, 6, 4 బాది ఆఖరి బంతికి ఔటయ్యాడు. ఈ ఓవర్‌లో 16 పరుగులే రావడంతో ఆర్‌సీబీ 169 పరుగులే చేయగలిగింది.

## యశస్వి జైశ్వాల్ సంచలన నిర్ణయం..!



భారత జట్టులో సంచలన ప్లేయర్ యశస్వి జైస్వాల్. ఓపెనర్‌గా దూకుడైన బ్యాటింగ్‌తో ప్రత్యర్థులపై ఆధిపత్యం ప్రదర్శిస్తుంటాడు. అయితే ఈ భారత యువ ఓపెనర్ యశస్వి జైశ్వాల్ కీలక నిర్ణయం తీసుకున్నాడు. దేశవాళీ క్రికెట్‌లో తన స్టేట్ టీమ్ నుంచి మారాలనుకుంటున్నట్లు వెల్లడించాడు. ఈ మేరకు ముంబయి క్రికెట్ అసోసియేషన్‌కు నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ కోరుతూ లేఖ రాశాడు.

**ఆ జట్టుకు కెప్టెన్ గా..**

"మా నుంచి అతడు నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ కోరాడు. గోవాకు మారాలనుకుంటున్నట్లు తెలిపాడు. ఇది అతడి వ్యక్తిగత నిర్ణయం." అని ఎమ్‌సీఏ తెలిపింది. అలానే జైశ్వాల్‌కు దగ్గరగా ఉన్న ఓ ప్రతినిధి కూడా ఈ విషయాన్ని కన్ఫామ్ చేశారు. కాగా, 2025-26 సీజన్ లో జైశ్వాల్ గోవా జట్టుకు కెప్టెన్ గా వ్యవహరిస్తాడని సమాచారం అందింది.

**4,26 పరుగులు..**

టీమిండియా క్రికెటర్లందరూ అంతర్జాతీయ మ్యాచులు లేని సమయంలో కచ్చితంగా దేశవాళీ క్రికెట్ ఆడాలని బీసీసీఐ ఆదేశాలు జారీ చేసింది. ఈ నేపథ్యంలో గత సీజన్ లో ముంబయి జట్టు తరపున ఆడిన జైశ్వాల్.. రంజీ ట్రోఫీలో జమ్ము కశ్మీర్ తో జరిగిన మ్యాచులో ఆడాడు. ఆ మ్యాచులో 4,26 పరుగులు చేశాడు.

**ముంబయితో యశస్వి జైశ్వాల్ జర్నీ..**

17ఏళ్ల వయసులో ముంబయి జట్టులోకి వచ్చిన యశస్వి. 2018-19 సీజన్ లో ముంబయి జట్టు తరపున రంజీ ట్రోఫీ అరంగేట్రం చేశాడు. 2022 సీజన్‌లో కేవలం మూడు మ్యాచుల్లోనే 83 సగటుతో 498 పరుగులు సాధించాడు. అతడి అత్యధిక వ్యక్తిగత స్కోరు 181. ఆ సీజన్ లో ముంబయి ఫైనల్‌కు చేరడంలో కీలక పాత్ర కూడా పోషించాడు. 2019-20లో విజయ్ హజారే ట్రోఫీలో డబుల్ సెంచరీ బాది అందరి దృష్టిని ఆకర్షించాడు. ఈ క్రమంలోనే టీమిండియాలోకి ఎంట్రీ ఇచ్చి మంచి ప్లేయర్ గా పేరు గాంచాడు. టెస్టుల్లోనూ సూపర్ ఓపెనర్‌గా అవతరించాడు.

## సంజు శాంసన్‌కు లైన్ క్లియర్

**- ఇక రాజస్థాన్ కెప్టెన్, కీపర్‌గా**



రాజస్థాన్ రాయల్స్ ఫ్యాన్స్‌కి గుడ్‌న్యూస్. ఆర్ఆర్ కెప్టెన్‌గా స్టార్ వికెట్ కీపర్- బ్యాటర్ సంజు శాంసన్ తిరిగొస్తున్నాడు. 2025 ఐపీఎల్‌లో అతడు కీపింగ్ చేయడానికి నేషనల్ క్రికెట్ అకాడమీ నుంచి అనుమతి పొందాడు. ఏప్రిల్ 5న ముల్లన్‌పూర్‌లో పంజాబ్ కింగ్స్‌తో జరిగే మ్యాచ్‌లో శాంసన్ కీపర్‌గా, కెప్టెన్‌గా వ్యవహరించన్నాడు.

ఫిబ్రవరిలో భారత్- ఇంగ్లండ్ టీ20I సిరీస్‌లో శాంసన్ కుడి చూపుడు వేలికి గాయమైంది. ఇంగ్లాండ్ ఫాస్ట్ బౌలర్ జోఫ్రా ఆర్చర్ బౌలింగ్‌లో బంతి తగిలింది. వేలికి శాంసన్ శస్త్రచికిత్స చేయించుకున్నాడు. అతడికి కీపింగ్ చేయడానికి ఎన్‌సీఏ నుంచి అనుమతి రాలేదు. అందుకే ప్రస్తుత సీజన్‌లో రాజస్థాన్ ఆడిన మూడు మ్యాచుల్లో కేవలం బ్యాటర్‌గా ఆడాడు. ఇంపాక్ట్ ప్లేయర్‌గా వచ్చాడు. ఇప్పటి వరకు ధ్రువ్ జురెల్ కీపర్‌గా, రియాన్ పరాగ్ కెప్టెన్‌గా వ్యవహరించాడు.

రియాన్ పరాగ్ కెప్టెన్సీలో ఆర్ఆర్ మొదటి రెండు మ్యాచ్‌లు సన్‌రైజర్స్ హైదరాబాద్, కోల్‌కతా నైట్ రైడర్స్‌తో ఓడిపోయింది. మూడో మ్యాచ్‌లో చెన్నై సూపర్ కింగ్స్‌పై గెలిచింది. శాంసన్ బ్యాటర్‌గా వరుసగా 66, 13, 20 పరుగులు చేశాడు.

**RR అధికారిక ప్రకటన**

రాజస్థాన్ రాయల్స్ ఎన్‌సీఏ నుంచి శాంసన్‌కి క్లియరెన్స్ లభించడంపై ఓ ప్రకటన విడుదల చేసింది. 'రాజస్థాన్ రాయల్స్ కెప్టెన్ సంజు శాంసన్ కోలుకున్న తర్వాత వికెట్ కీపింగ్ తిరిగి ప్రారంభించేందుకు నేషనల్ క్రికెట్ అకాడమీ నుంచి అనుమతి పొందాడు. NCA వైద్య బృందం అతడి ఫిట్‌నెస్‌ను క్షుణ్ణంగా పరిశీలించాక అనుమతి వచ్చింది. శాంసన్ పూర్తిస్థాయి కెప్టెన్‌గా తిరిగి వస్తాడు. పంజాబ్ కింగ్స్‌తో జరిగే మ్యాచ్ నుంచే కెప్టెన్సీని తిరిగి ప్రారంభిస్తాడు.' అని చెప్పింది.

**రాజస్థాన్ పరిస్థితి ఏంటి?**

రాజస్థాన్ రాయల్స్ ప్రస్తుతం 2025 IPL పాయింట్ల పట్టికలో తొమ్మిదో స్థానంలో ఉంది. ఆడిన మూడు మ్యాచుల్లో ఒక్క విజయం మాత్రమే సాధించింది. 2008 ఐపీఎల్ మొదటి సీజన్‌లో కప్పు గెలిచిన ఆర్ఆర్, నేటికీ రెండో కప్పు గెలవలేకపోయింది. 2022లో ఫైనల్ చేరినా టైటిల్ అందుకోలేకపోయింది.



## ఒకరితో పోల్చితే నచ్చదు

వేరే నటితో తనను పోల్చి చూడటం తనకేమాత్రం నచ్చదంటోంది అర్జున్‌రెడ్డి ఫేం శాలినీ పాండే. బాలీవుడ్ నటి అలియాభట్‌తో తనని పోల్చి చూడటంపై నటి షాలినీ పాండే స్పందించారు. “ప్రేక్షకులు నన్నెంతగానో ప్రేమిస్తున్నారు. వారి ప్రేమాభిమానాలు వెలకట్టలేనివి. కొంతమంది నన్ను నటి అలియాభట్‌తో పోలుస్తూ తమ ప్రేమను తెలియజేస్తున్నారు. మనకు ఇండస్ట్రీలో ఇప్పటికే ఒక అలియా ఉన్నారు. కాబట్టి, ఆమెలా మరొకరు అవసరం లేదు. ఆమెలా ఉండాలని వేరొకరు అనుకోరు. ఎందుకంటే, ఆమె అద్భుతమైన నటి. సినిమాల్లోనే కాదు. నిజ జీవితంలోనూ ఆమె ఎంతో ఉన్నతంగా ఉంటారు. నేను కూడా ఆమెనుంచి ఎంతో స్ఫూర్తి పొందుతుంటా. ఎన్నో విషయాలు నేర్చుకోవాలనుకుంటా. అయితే ఆమెతో పోల్చి చూస్తుంటే మాత్రం పెద్దగా నచ్చదు. నన్ను నాలా గుర్తిస్తే చాలు. నాకంటూ ఒక గుర్తింపు తెచ్చుకోవాలనేది నా ఉద్దేశం” అని షాలినీ పాండే తెలిపారు. సినిమాల్లో రాణించాలని షాలినీ ఇంటినుంచి వచ్చేసిన విషయం తెలిసిందే. 2017లో విడుదలైన ‘అర్జున్ రెడ్డి’తో ఆమె హీరోయిన్‌గా ఎంట్రీ ఇచ్చారు. తొలి చిత్రంతోనే గుర్తింపు తెచ్చుకున్నారు. ప్రస్తుతం ఆమె బాలీవుడ్‌లో సినిమాలు, సిరీస్‌లు చేస్తున్నారు. షాలినీ పాండే ఇటీవల నటించిన వెబ్ సిరీస్ ‘డబ్బా కార్టెల్’. షబానా అజ్మీ, జ్యోతిక కీలక పాత్రల్లో నటించారు. నెటిక్స్ వేదికగా స్ట్రీమింగ్ అవుతోంది. ఎలాంటి బ్యాక్‌గ్రౌండ్ లేకుండా పరిశ్రమలోకి అడుగుపెట్టడం వల్ల కెరీర్ ఆరంభంలో కొన్ని ఇబ్బందులు ఎదుర్కొన్నానని చెప్పారు.

## బ్లో అప్



## టచ్ కియా.. జాట్ గ్లింప్స్

బాలీవుడ్ స్టార్ హీరో సన్నీ డియోల్ హీరోగా నటిస్తున్న లేటెస్ట్ చిత్రం ‘జాట్’. టాలీవుడ్ స్టార్ దర్శకుడు గోపీచంద్ మలినేని తెరకెక్కించిన చిత్రం ఇపుడు రిలీజ్‌కి రాబోతుంది. ఇక ఈ సమయంలో మేకర్స్ సినిమా నుంచి ఫస్ట్ సింగిల్‌ని రిలీజ్ చేశారు. టచ్ కియా అంటూ సాగే ఈ సాంగ్‌ని థమన్ సాలిడ్ బీట్స్‌తో కొట్టాడని చెప్పాలి. ఇక ఈ స్పెషల్ సాంగ్‌లో బ్యూటీ ఊర్వశి రౌటేలా కనిపించడం విశేషం. సాంగ్‌కి జానీ మాస్టర్ డాన్స్ కంపోజ్ చేయగా తన కొరియోగ్రఫీ ఈ సాంగ్‌కి పర్ఫెక్ట్‌గా ఉందని చెప్పవచ్చు. సాంగ్‌లో బాలీవుడ్ నటుడు రణదీప్ హూడా ఆలాగే యంగ్ నటి రెజీనా కాసాండ్రా కూడా కనిపిస్తున్నారు. మంచి పార్టీ అండ్ సెలబ్రేషన్ సాంగ్‌గా ప్లాన్ చేసిన సాంగ్‌లో సన్నీ డియోల్ ప్రెజెన్స్ అయితే లేదు. మొత్తానికి హిందీ ఆడియెన్స్‌కి ఈ సాంగ్ నచ్చే రేంజ్‌లో అనిపిస్తుంది. ఇక ఈ అవైటెడ్ మాస్ యాక్షన్ ఎంటర్టైనర్ చిత్రం ఈ ఏప్రిల్ 10న గ్రాండ్‌గా రిలీజ్‌కి రాబోతుంది.



## మళ్లీ పాట పాడనున్న చిరు

మెగాస్టార్ చిరంజీవి హీరోగా త్రిష హీరోయిన్‌గా అలాగే మరింతమంది టాలెంటెడ్ నటీనటులు నటిస్తున్న అవైటెడ్ భారీ ఫాంటసీ చిత్రమే “విశ్వంభర”. ఎన్నో అంచనాలు నెలకొల్పుకున్న చిత్రం కోసం మెగా అభిమానులు ఎప్పుడునుంచో ఆసక్తిగా ఉన్నారు. వాటికి తగ్గట్టుగానే మేకర్స్ గ్రాండ్ ప్లానింగ్స్ సినిమాకి చేస్తున్నారు. అయితే, ఒక ఇంట్రెస్టింగ్ టాక్ చిత్రంపై ఇపుడు వినిపిస్తుంది. ఈ సినిమా కోసం చిరు గాయకునిగా మారనున్నారని. చిరు గతంలో పలు సినిమాలకి పాటలు పాడిన సంగతి తెలిసిందే. పాటలతో పాటుగా పాటల్లో కొన్ని కొన్ని డైలాగ్స్‌తో మాట సాయం అందించిన సినిమాలు కూడా చాలానే కనిపించాయి. మరి ఇపుడు విశ్వంభర కోసం చిరు మరోసారి ఈ స్టెప్ తీసుకోనున్నట్టుగా రూమర్స్ వినిపిస్తున్నాయి. మరి దీనిపై మరింత క్లారిటీ రావాల్సి ఉంది. ఇక ఈ చిత్రానికి ఎంఎం కీరవాణి సంగీతం అందిస్తున్న సంగతి తెలిసిందే. అలాగే యూవీ క్రియేషన్స్ వారు నిర్మాణం వహిస్తున్నారు.



## అభిమానులు చేసే పనేనా?

విజయ్ సేతుపతి హీరోగా దర్శకుడు పూరి జగన్నాథ్ ఓ సినిమాను తెరకెక్కిస్తున్న విషయం తెలిసిందే. ఉగాది సందర్భంగా ఈ సినిమాపై అధికారిక ప్రకటన విడుదల చేశారు. తాజాగా విజయ్ సేతుపతి సినిమాల ఎంపికలను ఉద్దేశిస్తూ ఓ నెటిజన్ పూరి జగన్నాథ్‌పై కామెంట్ చేశారు. దానికి నటుడు శాంతను భాగ్యరాజ్ స్పందిస్తూ స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. పూరి జగన్నాథ్ అవుటేటెడ్ అయ్యారని.. ‘మహారాజ’వంటి హిట్ తర్వాత విజయ్ సేతుపతి ఆయన దర్శకత్వంలో నటించడానికి ఎందుకు అంగీకరించారంటూ విమర్శిస్తూ ఓ నెటిజన్ పోస్ట్ పెట్టారు. దీనికి నటుడు శాంతను భాగ్యరాజ్ స్పందిస్తూ.. “ఇండస్ట్రీలో వ్యక్తుల గురించి అలా మాట్లాడకండి. సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టేటప్పుడు సరైన పదాలు వాడడం నేర్చుకోండి. ఆయన ఓ ప్రముఖ దర్శకుడు. ఆయనకు గౌరవం ఇవ్వండి. మీలాంటి వారినుంచి ఇలాంటివి ఊహించలేదు” అని అన్నారు. దీంతో నెటిజన్ క్షమాపణలు చెప్పి తన పోస్టును డిలీట్ చేశారు.

‘లైగర్’, ‘డబుల్ ఇస్మార్ట్’ చిత్రాలు పూరి జగన్నాథ్‌కు ఆశించిన ఫలితాన్ని అందించలేకపోయాయి. దీంతో, సూపర్ హిట్టే లక్ష్యంగా పూరి తదుపరి సినిమా కోసం బిజీగా ఉన్నారని, విజయ్ సేతుపతిని హీరోగా తెరకెక్కించనున్నారని ఇటీవల వార్తలొచ్చాయి. వాటికి చెక్ పెడుతూ నిర్మాణ సంస్థ ఉగాది రోజు ఈ ప్రాజెక్టును అధికారికంగా ప్రకటించింది. ఈ సినిమాకి ‘బెగ్గర్’ టైటిల్ పరిశీలనలో ఉన్నట్టు ప్రచారం జరుగుతోంది. ఇక విజయ్ సేతుపతి ‘మహారాజ’తో ఇటీవల బ్లాక్‌బస్టర్ విజయాన్ని సొంతం చేసుకున్నారు.





## వివాదాల్లోకి లాగొద్దు.. ప్లీజ్

సంగీత దర్శకుడు, నటుడు జీవీ ప్రకాశ్, గాయని సైంధవి విడాకులు తీసుకున్న విషయం తెలిసిందే. వీరిద్దరి విడాకులకు కారణం దివ్యభారతి అంటూ ఆమెపై ఎన్నో విమర్శలు వచ్చాయి. ఇప్పటికే ఈ విమర్శలను ఆమె ఖండించారు. తాజాగా మరోసారి ఇన్‌స్టా వేదికగా పోస్ట్ పెట్టారు. “నాకు సంబంధంలేని వ్యక్తుల కుటుంబ విషయాల్లోకి నా పేరును లాగుతున్నారు. జీవీ ప్రకాశ్ కుటుంబ సమస్యలతో నాకు ఎలాంటి సంబంధం లేదు. ఒక్క విషయం స్పష్టంగా చెప్పాలనుకుంటున్నా. నేను ఎవరితోనూ డేటింగ్‌లో లేను. ముఖ్యంగా పెళ్లయిన వ్యక్తితో డేటింగ్ చేయను. ఆధారంలేకుండా రూమర్స్ సృష్టించకండి. నేను ఈ విషయంలో ఇప్పటివరకూ మౌనంగా ఉన్నాను. అయితే కొన్ని రోజుల నుంచి రూమర్స్ హద్దులు దాటుతున్నాయి. గాసిప్‌ల కారణంగా పేరు దెబ్బతింటోంది. ఇలాంటి నిరాధారమైన వార్తలు సృష్టించే బదులు సమాజానికి ఉపయోగపడే పనులు చేయండి. నా వ్యక్తిగత గోప్యతను గౌరవించండి. ఈ అంశంపై ఇదే నా మొదటి.. చివరి ప్రకటన” అని రాసుకొచ్చారు. ఇక గతంలో జీవీ ప్రకాశ్ విడాకులపై దివ్యభారతి స్పందించారు. ఆ దంపతులు విడాకులు ప్రకటించిన సమయంలో తనని ఎంతో విమర్శించారన్నారు. తనను తిడుతూ మెసేజ్ లు పెట్టారని ఆవేదన వ్యక్తంచేశారు. జీవీ ప్రకాశ్, దివ్యభారతి కలిసి కొన్ని ప్రాజెక్ట్ల కోసం వర్క్ చేశారు. వీళ్లిద్దరూ కలిసి నటించిన ‘కింగ్టన్’ ఇటీవల విడుదలై విజయాన్ని సొంతం చేసుకుంది.